



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 127 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 29 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-


## నాకేం మతిమరుపు లేదు

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** తన ఆరోగ్యంపై వస్తున్న వార్తలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. తాను ఆరోగ్యంగా ఉన్నానని న్యూయార్క్ మ్యాగ్జైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. వంశపారంపర్యంగా వస్తున్న అనారోగ్య సమస్యల వల్ల మీరేమైనా ఇబ్బంది పడుతున్నారా అని మీడియా అడిగిన ప్రశ్నకు ట్రంప్ బదులిస్తూ.. తన దివంగత తండ్రి అల్జీమర్స్‌తో బాధ పడ్డారని.. కానీ తనకు ఆ సమస్య లేదని అన్నారు. ఆ వ్యాధి గురించి తాను ఆందోళన చెందట్లేదన్నారు. 40 ఏళ్ల క్రితం తాను ఎలా ఆరోగ్యంగా ఉన్నానో ఇప్పటికీ అలాగే ఉన్నానని తెలిపారు. అయితే అల్జీమర్స్ గురించి మాట్లాడుతున్న సమయంలో ట్రంప్ ఆ వ్యాధి పేరును గుర్తు మిగతా .. 2లో..

### లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి నివేదికపై

# ఏపీ కేబినేట్‌లో చర్చ

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం ముగిసింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో 35 అజెండా అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తితిదే లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యిలో కల్తీపై సిట్ ఇచ్చిన నివేదికపై కూడా మంత్రివర్గ భేటీలో చర్చ జరిగింది. సిట్ నివేదికపై వైకాపా చేస్తున్న దుష్ప్రచారంపై చర్చించారు. దీనిపై సిట్ నివేదిక తెప్పించాలని కేబినెట్ కోరింది. ఇప్పటికే సీబీఐ ఆధ్వర్యంలోని సిట్ ఛార్జిషీట్ వేసిన విషయాన్ని అధికారులు చెప్పారు. సిట్ నివేదిక అధికారికంగా వచ్చిన తర్వాత.. దానిపై స్పందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు సూచించారు.




**కేబినెట్ భేటీలో కీలకాంశాలు..**

పిడుగురాళ్ల వైద్యకళాశాలను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్

ఎస్వీ వర్సిటీ పరిధిలోని 33 ఎకరాల భూమిని వ్యవసాయ మార్కెట్ కమిటీకి బదిలీపై చర్చ

పలమనేరులో లైవ్‌స్టాక్ రీసెర్చ్ స్టేషన్ ఏర్పాటుకు భూ బదిలీ ప్రతిపాదనకు ఆమోదం

అర్జున అవార్డు గ్రహీత జ్యోతికి విశాఖలో 500 చదరపు గజాల స్థలం ఇచ్చేందుకు మిగతా .. 2లో..

### ఏపీలోని రైల్వే ప్రాజెక్టులపై

## సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులపై సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ పోర్టుల నుంచి రైల్ కనెక్టివిటీ, తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి రవాణాపై సమీక్షలో చర్చించారు. రాయలసీమ ప్రాంతాల నుంచి కోస్తాంధ్రలోని వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీపై సమావేశంలో చర్చించారు. విశాఖ, విజయవాడ, గుంతకల్, గుంటూరు, రేణిగుంట తదితర రైల్వే జంక్షన్లలో రద్దీ తగ్గించే అంశంపైనా సమీక్ష మిగతా .. 2లో..

## అజిత్ పవార్ విమాన ప్రమాదం..

### 'రీడ్‌బ్యాక్' చేయని పైలట్: అసలేంటీ పదం..?

**విశ్వం వాయిస్ న్యూస్ :** మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం బుధవారం ఉదయం బారామతిలో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆయనతో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఉదయం 8.46 గంటలకు రన్‌వేకు 100 అడుగుల దూరంలో విమానం ప్రమాదానికి గురైనట్లు సీసీటీవీ దృశ్యాలను బట్టి వెల్లడైంది. దానికి 12 నిమిషాల ముందు ఏడీఎస్?-బీ రేడియో సిగ్నల్లను ప్రసారం చేయడం నిలిపివేసింది. వీటి ద్వారా ఎప్పటికప్పుడు విమానం లొకేషన్, వేగం తెలుస్తుంది. ఈ ఘటన గురించిన వివరాలను వెల్లడిస్తున్న సమయంలో పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు 'రీడ్‌బ్యాక్' అనే పదం వాడారు. ల్యాండింగ్ క్లియరెన్స్ సమయంలో పైలట్లు రీడ్‌బ్యాక్ చేస్తుంటారు. రీడ్‌బ్యాక్ అనేది ఒక ప్రొటోకాల్.. అందులో సందేశం ఏమీ ఉండదు. అయితే ల్యాండింగ్‌కు సంబంధించి అధికారిక అనుమతిని పొందే సమయంలో దీనిని వాడతారు. రీడ్‌బ్యాక్ అంటే ఒక సందేశాన్ని మళ్లీ చదవడమే. అంటే ఎయిర్‌క్రాఫ్ట్ సిబ్బంది, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ మధ్య సమన్వయ లోపం లేదని ఇది నిర్ధారిస్తుంది. ల్యాండింగ్ మిగతా .. 2లో..

### అజిత్ పవార్ మృతిపై

## తెలుగు రాష్ట్రాల సీఎంల విచారం..

ఆయన మృతి పట్ల సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి
ప్రజా జీవితానికి ఇది తీరని లోటని వ్యాఖ్యానించిన రేవంత్ రెడ్డి
పవార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన పవన్, జగన్, కేటీఆర్

**ముంబై, విశ్వం వాయిస్ న్యూస్ :** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ఈరోజు ఉదయం జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందడం పట్ల తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. ఏపీ సీఎం చంద్రబాబు మిగతా .. 2లో..

### నేనూ ప్రవాస

## భారతీయుడినే..

- నాకూ ఓసీఐ కార్డుంది..
- ఐరోపా కౌన్సిల్ అధ్యక్షుడు కోస్టా వెల్లడి
- మీడియా సమావేశంలో ఓసీఐ కార్డు చూపుతున్న ఆంటోనియో కోస్టా



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** తాను ప్రవాస భారతీయుడనేనని, తనకు ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డుందని ఐరోపా కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా తెలిపారు. తన మూలాలు గోవాలో ఉండటం తనకు గర్వకారణమని వ్యాఖ్యానించారు. తన తండ్రి కుటుంబం ఐరోపాకు వలస వెళ్లిందని వెల్లడించారు. ప్రధాని మోదీ, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులాతో కలిసి సంయుక్త మీడియా సమావేశంలో మిగతా .. 2లో..

### పేదరికం నుంచి

## 25 కోట్ల మందికి విముక్తి

### రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించారు. ఎన్డీఏ పదేళ్ల పాలనలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కల్పించినట్లు తెలిపారు. 100 కోట్లకు పైగా గ్యాస్ కనెక్షన్లు అందించామని.. ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్ల మందికి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వికసిత్ భారత్‌లో రైతులకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చామన్నారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి కల్పన కోసం జీ రామ్ జీ చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. వెనుకబడిన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని వెల్లడించారు. ఆత్మనిర్భర్ భారత్ సాధన కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. భవిష్యత్తును దృష్టిలోపెట్టుకొని దేశం సంస్కరణల పథంలో దూసుకెళ్తోందన్నారు. పీఎల్ఐ పథకం కింద పారిశ్రామికోత్పత్తిని ప్రోత్సహిస్తున్నట్లు మిగతా .. 2లో..

### గంజాయి, డ్రగ్స్ నిర్మూలన పట్ల

## 70శాతం మంది ప్రజలు సంతృప్తి

పూర్తిగా అరికట్టే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి
ఎన్జీవోల ఆధ్వర్యంలో డీ-అడిక్షన్ కేంద్రాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించండి
కేజీ నుంచి పీజీ వరకు డ్రగ్-ఫ్రీ ఏపీ కరిక్యులమ్ అమలుకు చర్యలు తీసుకోండి
గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణపై మంత్రుల ఉపసంఘం సమావేశంలో మంత్రి లోకేష్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలు పట్ల 70శాతం మంది ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. మిగిలిన 30శాతంపై కూడా దృష్టి పెట్టాలని అధికారులను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ ముప్పును అరికట్టేందుకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, ప్రణాళికలపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన రాష్ట్ర మిగతా .. 2లో..

### పనులు పూర్తికాకుండానే పోలీసుల పహారాలో

## వెలిగొండను జగన్ ప్రారంభించారు

### ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వెలిగొండ పనులు పూర్తి కాకుండానే అప్పట్లో జగన్ ప్రారంభించారని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పోలీసుల పహారా మధ్య జాతికి అంకితం చేశారన్నారు. నిర్వాసితులను అడ్డుకుని మరీ వెలిగొండను జగన్ ప్రారంభించారని తెలిపారు. అప్పటి పరిస్థితులు చూసిన ఎవరికైనా వెలిగొండ పూర్తి కాలేదని అర్థమైందన్నారు. ఈ ఏడాదిలోగా వెలిగొండ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టులో ప్రస్తుతం జరుగుతున్న పనులపై మంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. "వెలిగొండ నిర్మాణం పూర్తి అయిపోయిందని.. జగన్ ఆ ప్రాజెక్టును ఎప్పుడో జాతికి అంకితం చేశా రంటూ వైకాపా నేతలు కామెంట్లు చేస్తున్నారు. ప్రాజెక్టులో ఇంకా వేల కోట్ల రూపాయల పనులు పెండింగులో ఉన్నాయి. వాటిని కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తోంది" అని ఫొటోలు, వీడియోలతో మంత్రి వెల్లడించారు.

### చింతలపూడి బంగారం

## చోరీ కేసును ఛేదించిన పోలీసులు..



**చింతలపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలూరు జిల్లాలో సంచలనం సృష్టించిన చింతలపూడి బంగారం దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. చింతలపూడి కనకదుర్గ ఫైనాన్స్ గోల్డ్ లోన్‌లో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు మిగతా .. 2లో..

### బంగ్లాదేశ్‌లో అరెస్టైన విజయనగరం జిల్లా

## మత్స్యకారుల విడుదలకు తక్షణ చర్యలు

మంత్రి అచ్చెన్నాయుడు వినతితో వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు
కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీఎం లేఖ

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయనగరం జిల్లాకు చెందిన 9 మంది మత్స్యకారులను బంగ్లాదేశ్ నౌకాదళం అరెస్టు చేసిన ఘటనను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా, దీనిపై ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి కేంద్ర హోంమంత్రి అమిత్ షాకి లేఖ రాసి మత్స్యకారుల విడుదలకు అవసరమైన దౌత్య మిగతా .. 2లో..

### రైల్వేకోడూరు

## ఎమ్మెల్యేపై ఆరోపణలు

### జనసేన కీలక నిర్ణయం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రైల్వేకోడూరు ఎమ్మెల్యే అంశంలో జనసేన పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై ఓ మహిళ ఆరోపణలు చేసిన నేపథ్యంలో విచారణకు ముగ్గురు సభ్యులతో కమిటీని నియమించింది. దీనిలో టి.శివశంకర్, తంబళ్లపల్లి రమాదేవి, టి.సి.వరుణ్ ఉన్నారు. ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్తలపై విచారణ చేయాలని కమిటీని పార్టీ ఆదేశించింది. ఈ కమిటీ ముందు ఏడు రోజుల్లోపు ఎమ్మెల్యే శ్రీధర్ హాజరై వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. కమిటీ నివేదిక వెల్లడయ్యే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యేను ఆదేశించింది.

### పిఠాపురం రైల్వే స్టేషన్‌ను

## మోడల్ స్టేషన్‌గా అభివృద్ధి చేయండి

రోడ్డు ఓవర్ బ్రిడ్జిని పీఎం గతిశక్తి పథకంలో చేర్చండి
కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ని కోరిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని శ్రీవైష్ణవ్‌తో సమావేశం అయ్యారు. పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి, రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతోపాటు పలు అంశాలపై చర్చించారు. సేతు బంధన్ పథకం కింద మంజూరు చేసిన రోడ్డు ఓవర్ బ్రిడ్జిని పీఎం గతిశక్తి పథకం పరిధిలోకి తీసుకురావాలని మిగతా .. 2లో..

### అది ప్రమాదమే..

## రాజకీయం చేయొద్దు : శరద్ పవార్



**విశ్వం వాయిస్ న్యూస్ :** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణంపై ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ స్పందించారు. విమాన దుర్ఘటన పూర్తిగా ప్రమాదమేనని.. దీన్ని రాజకీయం చేయొద్దని అన్నారు. విమాన ప్రమాదంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అనుమానాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో తొలిసారి మీడియా ముందుకు వచ్చిన శరద్ పవార్.. అజిత్ మరణం తీవ్ర దుఃఖాన్ని మిగిల్చిందన్నారు. "అజిత్ పవార్ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఓ సమర్థుడైన నాయకుడిని రాష్ట్రం కోల్పోయింది. జరిగిన మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# అజిత్ పవార్ విమాన ప్రమాదం..

అవుతున్నప్పుడు ఈ రీడ్‌బ్యాక్ చాలా కీలకం. ఏ రన్‌వేను ఉపయోగించాలి.. వాతావరణం ఎలా ఉంది.. విమానం వేగం, ఎత్తు మార్చుకున్నప్పుడు.. విమానం ల్యాండ్ అయ్యే ప్రాంతంలో ట్రాఫిక్ ఎలా ఉందనే విషయాలపై పైలట్, ఏటీసీ మధ్య కమ్యూనికేషన్‌కు ఇది ఉపయోగపడుతుంది. అయితే తాజా ఘటనలో లియర్‌జెట్ పైలట్ శాంభవి పాఠక్.. ఈ రీడ్‌బ్యాక్ ఇవ్వలేదు. రన్‌వే కనిపిస్తుందా? లేదా అని పైలట్లను బారామతి ఏటీసీ అధికారులు అడిగారని, కనిపించడం లేదనే సమాధానం వచ్చిందన్నారు. దాంతో విమానం గాల్లో కొంతసేపు చక్కర్లు కొట్టినట్లు కేంద్ర మంత్రి వివరించారు. రెండోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించే సమయంలో రన్‌వే కనిపిస్తుందా? అని ఏటీసీ అడిగినప్పుడు పైలట్లు సానుకూలంగా స్పందించారని తెలిసిందన్నారు. దీంతో ల్యాండింగ్ కోసం ఏటీసీ క్లియరెన్స్ ఇచ్చిందని.. ఆ వెంటనే విమానం కూలిపోయిందన్నారు. శాంభవి.. న్యూజిలాండ్ ఇంటర్నేషనల్ కమర్షియల్ పైలట్ అకాడమీలో కమర్షియల్ పైలట్ శిక్షణ తీసుకుని లైసెన్స్ పొందారు. ఆ తర్వాత భారత్‌కు వచ్చి డీజీసీఏ నుంచి కమర్షియల్ పైలట్ లైసెన్స్‌తో పాటు ఫ్రోజెన్ ఎయిర్‌లైన్ ట్రాన్స్‌పోర్ట్ పైలట్ లైసెన్స్ కూడా పొందారు. కొత్త పైలట్లకు శిక్షణ ఇచ్చేలా అసిస్టెంట్ ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్‌గానూ పనిచేశారు. 2022 ఆగస్టు నుంచి వీఎస్‌ఆర్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఫుల్ టైమ్ ఫస్ట్? ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

**బారామతి.. 'అజిత్ దాదా'కు అల్విదా**

మహారాష్ట్ర రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలుగా చక్రం తిప్పిన అజిత్ పవార్.. విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం రాష్ట్ర ప్రజలను శోకసంద్రంలో ముంచేసింది. ముఖ్యంగా దశాబ్దాలుగా ఆయన వెన్నంటే నిలిచిన బారామతి నియోజకవర్గ ప్రజలు ఆయన మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన్ను రాజకీయ శక్తిగా మార్చిన నియోజకవర్గమే.. ఆయన చివరి అధ్యాయానికి వేదికగా మారిన విషయాన్ని తట్టుకోలేకపోతున్నారు. ఎంతో ఆప్యాయంగా దాదా అని పిలుచుకునే అజిత్? ఇక లేరనే విషయాన్ని దిగమింగుకుంటున్నారు.

**పవార్‌కు పర్యాయపదం..!**

పవార్ కుటుంబానికి బారామతికి విడదీయరాని అనుబంధం ఉందనే చెప్పవచ్చు. 1967 నుంచి శరద్ పవార్‌కు కంచుకోటగా ఉన్న ఈ అసెంబ్లీ నియోజకవర్గం 1991 నుంచి అజిత్ పవార్‌కు ఆశ్రయమిస్తోంది. అహల్యానగర్ జిల్లాలోని దేవ్‌లాలీ ప్రవర పట్టణంలో అజిత్ పవార్ జన్మించినప్పటికీ.. ఆయనకు రాజకీయ జన్మనిచ్చింది మాత్రం బారామతినే. ఈ నియోజకవర్గానికి 1967 నుంచి ఇప్పటివరకు వీరిద్దరే ప్రాతినిధ్యం వహిస్తూ పవార్ పేరుకే పర్యాయపదంగా మార్చుకోవడం గమనార్హం.

**కీలక సమయంలో దాదా వెంటే..**

రాజకీయంగా ఎదిగేందుకు అవకాశమిచ్చిన బారామతి ప్రజలకు అజిత్ పవార్ ఎప్పుడూ అందుబాటులో ఉండేవారు. అభివృద్ధితోపాటు క్షేత్రస్థాయిలో తిరుగుతూ స్థానికులకు మరింత దగ్గరయ్యారు. ముఖ్యంగా రాజకీయాలకు అతీతంగా పాల సంఘాలు, చక్కెర ఫ్యాక్టరీలు, సహకార బ్యాంకులు తదితర సహకార సంస్థల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. అందుకే ఆయన్ను స్థానికులు ఆత్మీయంగా అజిత్ దాదా అని పిలుచుకుంటారు. దశాబ్దాలపాటు ఆయన వెంటే ఉంటున్న స్థానిక ఓటర్లు.. పార్టీ చీలిక సమయంలోనూ దిగ్గజ నేత శరద్ పవార్‌ను పక్కనపెట్టి అజిత్ వర్గానికే జై కొట్టారు. దీంతో తాము దాదా కుటుంబీకులమని బారామతి ప్రజలు నిరూపించుకున్నారని అజిత్ సతీమణి సునేత్రా అప్పట్లో పేర్కొన్నారు.

**బారామతిపై కినుక వహించి..**

పవార్ కుటుంబానికి కంచుకోటగా ఉన్న బారామతిలో కొంతకాలంగా అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. గత లోక్‌సభ ఎన్నికల్లో అజిత్ పవార్ తన సతీమణి సునేత్రను అభ్యర్థిగా నిలబెట్టగా.. శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే పోటీకి దిగి విజయం సాధించారు. దీంతో బారామతి ప్రజలపై అలక వహించిన అజిత్.. ఇంకోసారి ఇక్కడి నుంచి పోటీ చేయనని ప్రకటించారు. ఆ తర్వాత మనసు మార్చుకున్న ఆయన.. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. ఇలా 1991 నుంచి ఇప్పటివరకు ఆయనే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. లోక్‌సభ స్థానమైనా.. అసెంబ్లీ నియోజకవర్గమైనా సుదీర్ఘ కాలంగా అవకాశమిస్తున్న బారామతి ప్రజలు 'అజిత్ దాదా'కు ఇక సెలవు చెబుతున్నారు.

**విమానం ఫిట్‌గా ఉంటే.. ఎలా గ్రౌండ్ చేస్తాం వీఎస్‌ఆర్ ఏవియేషన్ సంస్థ**

విమాన ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం పాలయ్యారు. వీఎస్‌ఆర్ సంస్థకు చెందిన లియర్ జెట్-45 మోడల్ విమానంలో ఆయన వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ లియర్‌జెట్ మోడల్ విమానం 2023లో కూడా ఇదే విధంగా ముంబయి విమానాశ్రయంలో క్రాష్‌ల్యాండ్ అయినట్లు జాతీయ మీడియా వర్గాలు తెలిపాయి. దీంతో ఈ మోడల్ విమానాలను నిర్వహించే సంస్థ పనితీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీటిపై వీఎస్‌ఆర్ యజమాని వీకే సింగ్ మీడియాతో మాట్లాడుతూ..ప్రస్తుతం ప్రమాదానికి గురైన విమానంలో ఎలాంటి సాంకేతిక సమస్య లేదని వెల్లడించారు. ఈ ప్రమాదం నేపథ్యంలో ఇతర విమానాలను నిలిపివేస్తారా అని మీడియా అడిగిన ప్రశ్నకు వీఎస్‌ఆర్ ఏవియేషన్ యజమాని వీకే సింగ్ బదులిస్తూ.. తమ విమానాల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు పరీక్షిస్తామని అన్నారు. అవన్నీ ప్రయాణాలకు అనువుగానే ఉన్నాయన్నారు. విమానం ఫిట్‌గా ఉన్నప్పుడు.. గ్రౌండ్ చేయాల్సిన అవసరం ఏముంటుందని ప్రశ్నించారు. ప్రమాదంలో విమానాన్ని నడిపిన పైలట్లు కూడా అనుభవం లేని వారేమీ కాదని.. ఇన్ కమాండ్‌గా కెప్టెన్ సుమిత్ కపూర్‌కు 16,000 గంటల అనుభవం ఉందన్నారు. కో పైలట్ కెప్టెన్ శాంభవి పాఠక్‌కు విమానం నడపడంలో 1500 గంటల అనుభవం ఉందన్నారు.

**ప్రమాదానికి కారణమేంటంటే?**

ప్రమాద సమయంలో బారామతి ఎయిర్‌పోర్టులో విజిబులిటీ చాలా తక్కువగా ఉండడం వల్ల రన్‌వేను గుర్తించడంలో పైలట్లకు ఇబ్బందులు ఎదురైనట్లు పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. వారికి రన్‌వే సరిగ్గా కనిపించకపోవడం వల్లే ల్యాండింగ్ కోసం ప్రయత్నిస్తున్న సమయంలో విమానం కూలిందన్నారు. ఈ ఘటనపై మరింత సమాచారం కోసం చూస్తున్నామని, దీనిపై పారదర్శకంగా పూర్తిస్థాయి దర్యాప్తు చేపడతామన్నారు.

**అజిత్ పవార్ విమాన ప్రమాదానికి కారణమదే : రామ్మోహన్ నాయుడు**

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం ప్రమాదానికి గురైన ఘటనపై పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ప్రాథమిక సమాచారం మేరకు.. ప్రమాద సమయంలో బారామతి ఎయిర్‌పోర్టులో విజిబులిటీ చాలా తక్కువగా ఉన్నట్లు తేలిందన్నారు. రన్‌వే కనిపిస్తుందా? లేదా అని పైలట్లను బారామతి ఏటీసీ అధికారులు అడిగారని, కనిపించడం లేదనే సమాధానం వచ్చిందన్నారు. దాంతో విమానం గాల్లో కొంతసేపు చక్కర్లు కొట్టినట్లు కేంద్ర మంత్రి వివరించారు. రెండోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించే సమయంలో రన్‌వే కనిపిస్తుందా? అని ఏటీసీ అడిగినప్పుడు పైలట్లు సానుకూలంగా స్పందించారని తెలిసిందన్నారు. దీంతో ల్యాండింగ్ కోసం ఏటీసీ క్లియరెన్స్ ఇచ్చిందని.. ఆ వెంటనే విమానం కూలిపోయిందన్నారు. ఈ ఘటనపై మరింత సమాచారం కోసం చూస్తున్నామని, దీనిపై పారదర్శకంగా పూర్తిస్థాయి దర్యాప్తు చేపడతామన్నారు. ఇందుకోసం ఇప్పటికే డీజీసీఏ, ఏఏఐబీ బృందాలు పుణె చేరుకున్నాయని కేంద్ర మంత్రి వెల్లడించారు. అంతకుముందు ఇదే అంశంపై డీజీసీఏ వర్గాలు స్పందిస్తూ.. ల్యాండింగ్ సమయంలో రన్‌వేను గుర్తించడంలో పైలట్లకు ఇబ్బందులు ఎదురైనట్లు పేర్కొన్నాయి. పైలట్ల నుంచి ఆపదలో ఉన్నామని తెలియజేసే మేడే కాల్స్ రాలేదని వెల్లడించినట్లు సమాచారం.

అజిత్ పవార్ మృతిపై

# తెలుగు రాష్ట్రాల సీఎంల విచారం..

అజిత్ పవార్ మరణంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. "ఈ ఉదయం విమాన ప్రమాదంలో అజిత్ పవార్ అకాల మరణం వార్త విని తీవ్రంగా కలత చెందాను. ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, అనుచరు లకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఓం శాంతి" అని చంద్రబాబు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి కూడా, అజిత్ పవార్ ఆకస్మిక మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పవార్ మరణం ప్రజా జీవితానికి తీరని లోటని ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, మహారాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజలకు రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మాజీ సీఎం వైఎస్ జగన్, బీఆర్‌ఎస్ వ?ర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా తమ సంతాపాన్ని ప్రకటించారు. ఎన్డీయే భాగస్వామ్య పక్ష నేత అయిన పవార్ ప్రజాసేవ చిరస్మరణీయమని పవన్ కొనియాడారు. క్షేత్రస్థాయిలో బలమైన సంబంధాలున్న అనుభవజ్ఞుడైన నేతను కోల్పోయామని, మహారాష్ట్ర రాజకీయాలకు ఇది తీరని లోటని కేటీఆర్ అన్నారు.

లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి నివేదికపై

# ఏపీ కేబినెట్‌లో చర్చ

ఆమోదం. డిగ్రీ తర్వాత గ్రూప్ 1 ఉద్యోగం ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం

ఏపీ టిడ్కోకు హడ్కో నుంచి రూ.4,451 కోట్ల ప్రభుత్వ రుణ గ్యారెంటీకి ఆమోదం

అమరావతి పరిధిలోని వీధిపోటు భూములు పొందిన రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లకు ఆమోదం

అమరావతి పరిధిలో భూములు లేని పేదలకు, అనాథ పిల్లలకు పింఛన్ల మంజూరుకు ఆమోదం

తితిదే పరిధిలో పలు పోస్టుల అప్‌గ్రేడ్‌కు, పలు సంస్థలకు భూకేటాయింపులకు ఆమోదం

అల్లూరి జిల్లా నందకోటలో పర్యాటక శాఖ ఫైవ్‌స్టార్ రిసార్ట్, కన్వెన్షన్ సెంటర్, థీమ్ పార్కు ఏర్పాటుకు భూకేటాయింపులకు ఆమోదం

పలు జలవనరుల ప్రాజెక్టులకు ఆర్థిక అనుమతులకు ఆమోదం

ఇంధనశాఖలో పలు పరిపాలన అనుమతులకు ఆమోదం

తిరుపతి, విశాఖపట్నం శిల్పారామం ప్రాజెక్టుల కోసం గార్డెన్‌సిటీ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్‌కు జారీ చేసిన ఎల్‌ఒఐలను రద్దు చేసి, కొత్తగా ఇఒఐలను ఆహ్వానించాలని మంత్రివర్గ నిర్ణయం

పీపీపీ విధానంలో గుంటూరు శిల్పారామంలో సాంస్కృతిక కేంద్రం, వినోద జోన్ అభివృద్ధికి ఆమోదం

ఏపీలోని రైల్వే ప్రాజెక్టులపై

# సీఎం చంద్రబాబు సమీక్ష

నిర్వహించారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాలకు రైలు కనెక్టివిటీ పెంచడంపై చర్చించారు. విజయవాడ బైపాస్, భద్రాచలం రోడ్-కొవ్వూరు సహా రాష్ట్రంలో వివిధ కొత్త రైల్వే మార్గాలకు సంబంధించిన ప్రతిపాదనలపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సమీక్షకు దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా, దక్షిణ కోస్తా రైల్వే డివిజన్ల జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# నాకేం మతిమరుపు లేదు

చేసుకోవడానికి కొంత సమయం పాటు ఇబ్బందిపడడం గమనార్హం.

**డాలర్ విలువ గొప్పగా ఉంది..**

మరోవైపు ఇదే ఇంటర్వ్యూలో అమెరికా డాలర్ విలువ మరీ తగ్గిందా అన్న విలేకరుల ప్రశ్నకు ట్రంప్ బదులిస్తూ.. అమెరికా చేస్తున్న వ్యాపారం వృద్ధి చెందుతుండడంతో డాలర్ విలువ చాలా గొప్పగా ఉందన్నారు. కాగా అమెరికా మీడియా వర్గాలు వెల్లడించిన గణాంకాల ప్రకారం మంగళవారం డాలర్ విలువ 1.3 శాతానికి పడిపోయింది. 2022 ఫిబ్రవరి తర్వాత అమెరికా డాలర్ విలువ ఇంత కనిష్ట స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారని యూఎస్ మీడియా వెల్లడించింది. దీంతో ట్రంప్ వ్యాఖ్యలపై చర్చ మొదలైంది. ట్రంప్ ఇంటర్వ్యూపై వైట్ హౌస్ స్పందిస్తూ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆరోగ్యంగా, బలంగా ఉన్నారని తెలిపింది. అమెరికా సేనల సర్వసైన్యాధ్యక్షుడిగా పనిచేయడానికి కావాల్సిన శరీర సామర్థ్యం ఆయనకు ఉందని పేర్కొంది. ఆయన ఆరోగ్య పరిస్థితులపై తప్పుడు వార్తలు ప్రచారం చేయొద్దని మీడియాకు సూచించింది.

# నేనూ ప్రవాస భారతీయుడినే...

పాల్గొన్న ఆయన తన ఓసీఐ కార్డును విలేకరులకు చూపించారు. విదేశీ పాస్‌పోర్టులున్న ప్రవాస భారతీయులకు ఓసీఐ కార్డులను కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తుంటుంది. దాంతో వారు జీవిత కాలంలో ఎప్పుడైనా, ఎన్నిసార్లైనా భారత్‌కు రావొచ్చు.. వెళ్లొచ్చు. ఇక్కడ స్థిరాస్తులను సమకూర్చుకోవచ్చు. కానీ వ్యవసాయ భూములను కొనడానికి వీల్లేదు. రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడానికీ అవకాశముండదు. ఎన్నో శతాబ్దాలపాటు పోర్చుగీస్ కాలనీగా ఉన్న గోవా 1961 డిసెంబరు 19వ తేదీన భారత్ వశమైంది. కోస్టా.. 1961 జులై 17వ తేదీన పోర్చుగల్‌లోని లిస్బన్‌లో జన్మించారు. గోవాను భారత్‌కు అప్పగించడానికి 5 నెలల ముందు ఆయన పుట్టారు.

పేదరికం నుంచి

# 25 కోట్ల మందికి విముక్తి

తెలిపారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. సముద్ర వ్యాపారాన్ని మరింత పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు వెల్లడించారు. గతేడాది నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత సైన్యం మన సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. భారత్‌పై దాడి చేస్తే ఏం జరుగుతుందో ప్రపంచం మొత్తం చూసిందన్నారు. ఈ ఆపరేషన్ తర్వాత డిఫెన్స్ ఎగుమతులు రికార్డు స్థాయిలో పెరిగినట్లు వెల్లడించారు.

గంజాయి, డ్రగ్స్ నిర్మూలన పట్ల

# 70శాతం మంది ప్రజలు సంతృప్తి

సచివాలయంలో జరిగిన కేబినెట్ సబ్ కమిటీ భేటీలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం చేపట్టిన కఠిన చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. పూర్తిగా అరికట్టే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి. ఎన్జీవోల ఆధ్వర్యంలో డీ అడిక్షన్ కేంద్రాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించాలి. డ్రగ్స్ పై విద్యార్థుల్లో అవగాహన కలిగించేలా కేజీ నుంచి పీజీ వరకు డ్రగ్-ఫ్రీ ఏపీ కరిక్యులమ్ అమలుకు చర్యలు తీసుకోవాలి. ఈగల్ యాప్ ను లీప్ యాప్ కు అనుసంధానించాలని మంత్రి ఆదేశించారు.

గంజాయి సాగును పూర్తిగా అరికట్టాం

గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ఈగల్(ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ ఫోర్స్ మెంట్) ఆధ్వర్యంలో ఇప్పటివరకు చేపట్టిన చర్యలను ఈ సందర్భంగా అధికారులు వివరించారు. రాష్ట్రంలో గంజాయి సాగును పూర్తిగా అరికట్టినట్లు తెలిపారు. జీరో గంజాయి సాగు రాష్ట్రంగా ఏపీ మారింది. ఎన్ కార్డ్(చీజూ=ణ-చీుతీషశీ-జశీశీతీ‌ఎఱఅఢ్‌ఱశీఅ జవత్‌తీవ) ప్రణాళికతో పూర్తిగా అనుసంధానం కావడం జరిగింది. ప్రణాళికాబద్ధంగా గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణ నెట్ వర్క్ లను ధ్వంసం చేసినట్లు అధికారులు వివరించారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణ చర్యల్లో ఇతర రాష్ట్రాలకు ఏపీ నమూనాగా నిలిచిందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 1,721 ఎన్డీపీఎస్(నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్ స్టాన్సెస్) కేసులు నమోదు చేసి, 4,421 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. 40వేల ఈగల్ క్లబ్స్ ఏర్పాటుచేయడంతో పాటు 35,400 అవగాహనా కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, ప్రజల్లో గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తో పాటు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చింతలపూడి బంగారం

# చోరీ కేసును ఛేదించిన పోలీసులు..

చేశారు. గతేడాది సెప్టెంబరు 9న కనకదుర్గ ఫైనాన్స్ హెడ్ ఆఫీసు నుంచి ఆడిట్ చేయడానికి చింతలపూడి పట్టణంలోని కనకదుర్గా ఫైనాన్స్ శాఖకు ఆడిటర్ వడ్లమూడి ఉమామహేశ్ వచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి.. లాకర్లలోని మొత్తం బంగారాన్ని బయటపెట్టి, మధ్యాహ్నం వరకు ఆడిట్ నిర్వహించారు. సాయంత్రం సమయంలో బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ బయటకు వెళ్లగా.. అదే అదునుగా భావించి, అక్కడున్న క్యాషియర్‌ను సైతం కొబ్బరినీళ్ల వంకతో బయటకు పంపారు. ముందుగా తనతో తీసుకువచ్చిన బ్యాగులో మొత్తం 378 కవర్లలోని 4.490 కేజీల బంగారు ఆభరణాలను తీసుకుని పారిపోయాడు. కనకదుర్గా ఫైనాన్స్ శాఖ ప్రతినిధుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. ఐటీ, సైబర్ సెల్ సాయంతో కేసును ఛేదించారు. నిందితున్ని అరెస్టు చేసి.. అతడి నుంచి బంగారం స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ వెల్లడించారు.

బంగ్లాదేశ్‌లో అరెస్టైన విజయనగరం జిల్లా

# మత్స్యకారుల విడుదలకు తక్షణ చర్యలు

చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుండి మాట్లాడుతూ, విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్?కు చెందిన మెకానైజ్డ్ ఫిషింగ్ బోట్ అక్టోబర్ 13, 2025న ఉదయం 4 గంటలకు లోతు సముద్ర చేపల వేటకు బయలుదేరిన సమయంలో, అందులో ఉన్న 9 మంది మత్స్యకారులు వాతావరణ పరిస్థితులు, సముద్ర ప్రవాహాల కారణంగా అనుకోకుండా అంతర్జాతీయ సరిహద్దులు దాటారని తెలిపారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ నౌకాదళం వారిని అరెస్టు చేసినట్లు వివరించారు. అక్టోబర్ 22, 2025న సమీప ప్రాంతంలో వేట చేస్తున్న మరో పడవ సిబ్బంది ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చిందని, అప్పట్లో పడవ డ్రైవర్ బంగ్లాదేశ్ నౌకాదళం తమను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపినట్లు మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకెళ్లగానే, మత్స్యకారుల కుటుంబాల పరిస్థితిని పరిగణలోకి తీసుకుని ముఖ్యమంత్రి వెంటనే స్పందించారని, కేంద్ర విదేశాంగ, హోంశాఖల ద్వారా బంగ్లాదేశ్ ప్రభుత్వంతో దౌత్య పరమైన చర్చలు జరిపి మత్స్యకారులు మరియు వారి పడవను సురక్షితంగా విడుదల చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గారిని కోరుతూ లేఖ రాసినట్లు తెలిపారు. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి అందిన సమాచారం ప్రకారం, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్?లో 13 మంది, పశ్చిమ బెంగాల్?లో 122 మంది బంగ్లాదేశ్ మత్స్యకారులు నిర్బంధంలో ఉన్నారని, పరస్పర విడుదల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఈ అంశాన్ని మానవతా దృక్పథంతో త్వరితగతిన పరిష్కరించాలని సీఎం చంద్రబాబు గారు కోరినట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. బంగ్లాదేశ్?లో అరెస్టయిన 9 మంది మత్స్యకారుల కుటుంబాలు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాయని పేర్కొన్న మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రభుత్వం వారి పక్షాన నిలబడి కేంద్రంతో నిరంతరం సమన్వయం చేస్తూ మత్స్యకారుల త్వరిత విడుదల కోసం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

పిఠాపురం రైల్వే స్టేషన్‌ను

# మోడల్ స్టేషన్‌గా అభివృద్ధి చేయండి

విజ్ఞప్తి చేశారు. ఇది 2030 జాతీయ రైల్ ప్రణాళికకు అనుగుణంగా లెవల్ క్రాసింగులు తొలగించేందుకు, ట్రాఫిక్ నియంత్రణకు సహకరిస్తుందని తెలిపారు. పిఠాపురం ఆధ్యాత్మికంగా ముఖ్య పట్టణం అయినందున రైల్వే స్టేషన్ ను అమృత్ స్కీం కింద మోడల్ రైల్వే స్టేషన్ గా అభివృద్ధి చేయాలని కోరారు. అష్టాదశ శక్తిపీఠం, శ్రీ పాద శ్రీ వల్లభ స్వామి కొలువైన క్షేత్రం పిఠాపురంలో ఉన్నందున దర్శనం నిమిత్తం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. వీటితోపాటు రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న పలు రైల్వే ప్రాజెక్టుల గురించి పవన్ కళ్యాణ్ చర్చించారు. శ్రీ అశ్విని వైష్ణవ్ గారు సానుకూలంగా స్పందించినందుకు పవన్ కళ్యాణ్ గారు కృతజ్ఞతలు తెలిపారు.

అది ప్రమాదమే..

# రాజకీయం చేయొద్దు : శరద్ పవార్

నష్టాన్ని పూడ్చలేం.. కానీ, ప్రతిదీ మన చేతుల్లో లేదు. ఈ ఘటనను రాజకీయం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇందులోకి రాజకీయాలు తీసుకురావద్దు. ఇది పూర్తిగా ప్రమాదమే. ఈ ఘటన నాతోపాటు రాష్ట్రం మొత్తానికి తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది. దయచేసి ఈ విషాదాన్ని రాజకీయం చేయొద్దు" అని శరద్? పవార్? విజ్ఞప్తి చేశారు.

బారామతి.. 'అజిత్ దాదా'కు అల్విదా!

అంతకుముందు అజిత్ పవార్ విమాన ప్రమాదంపై మమతా బెనర్జీ స్పందిస్తూ.. ఇందులో కుట్ర కోణం ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేసిన ఆమె.. అత్యున్నత న్యాయస్థానంపైనే తమకు నమ్మకం ఉందన్నారు. ఈ క్రమంలో ఇటువంటి ఊహాగానాలకు తెరదించేందుకే తాను మీడియా ముందుకు వచ్చినట్లు శరద్ పవార్ పేర్కొన్నారు.

## ఎడిటర్ వాయిస్

# ఢిల్లీలో పవన్.. ఏంటి పని!

## మోదీ 'మోగా' ఆఫర్ నిజమేనా?

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆకస్మికంగా ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. రాష్ట్ర కేబినెట్ సమావేశాన్ని డుమ్మాకొట్టి మరీ ఆయన హస్తినకు వెళ్లడం తీవ్ర చర్చకు దారితీస్తోంది. డిప్యూటీ సీఎం ఇంత ఆకస్మికంగా దేశ రాజధానికి ఎందుకు వెళ్లారా? అంటూ అంతా ఆరా తీస్తున్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కావడం, ఈ సమావేశాల్లో ఏపీకి సంబంధించిన కీలక బిల్లులను ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయని జరుగుతున్న ప్రచారం, కేంద్ర కేబినెట్ విస్తరణ వార్తల నడుమ పవన్ ఢిల్లీ పర్యటనపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో ఇటు రాష్ట్రంలోను అటు దేశ రాజధానిలోను పవన్ పర్యటన హాట్ టాపిక్ గా మారింది.

బుధవారం ఢిల్లీ పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిశారు. తిరుమల లడ్డూ కల్తీ కేసులో సీబీఐ సిట్ తుది చార్జిషీటు దాఖలు చేసిన తర్వాత పవన్ కేంద్ర హోంమంత్రిని కలవడం చర్చనీయాంశంగా మారిందని చెబుతున్నారు. అయితే పవన్ పర్యటనకు లడ్డూ కల్తీ కేసుకు సంబంధం లేదని, పవన్ వేరే పనిపైనే ఢిల్లీ వచ్చారని జనసేన పార్టీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. రాజధాని అమరావతి బిల్లు ప్రవేశపెట్టనున్న సందర్భంగా కేంద్రంతో చర్చించేందుకు పవన్ ఢిల్లీ వచ్చారంటూ ఒక కథనం ప్రచారం అవుతోంది. అయితే ఇంతకు మించిన ముఖ్యమైన పని కూడా ఉందని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

ఈ పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం అనేక ముఖ్యమైన బిల్లులను ప్రవేశపెడుతోంది. ఇందులో జమిలి ఎన్నికలతోపాటు నియోజకవర్గాల పునర్విభజన కూడా ఉందంటున్నారు. అంతేకాకుండా కీలకమైన బడ్జెట్ సమావేశాలు కావడంతో రాష్ట్రానికి నిధులు ఎక్కువ కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు పవన్ హస్తిన వచ్చారని చెబుతున్నారు. ఈ ఏడాది దేశంలో ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నందున కేంద్రం ఆయా రాష్ట్రాలకు బడ్జెట్లో ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంటున్నారు. అయితే ఏపీ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నిధుల కేటాయింపుల్లో ఎక్కువ ప్రాధాన్యం దక్కేలా కేంద్రం దృష్టిసారించాలని కోరేందుకే పవన్ ఢిల్లీ వచ్చారని చెబుతున్నారు. ఇదే సమయంలో కేంద్ర మంత్రి వర్గ విస్తరణ జరిగే అవకాశం ఉన్నందున తన పార్టీకి ఈ సారి ప్రాతినిధ్యం కల్పించాలని పవన్ కోరే అవకాశం ఉందంటున్నారు.

ఈ బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర కేబినెట్ ను పునర్వ్యవస్థీకరించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. పవన్ ఢిల్లీ పర్యటనకు ఇదీ కూడా ఒక కారణం అంటున్నారు. ప్రస్తుతం పవన్ కేంద్ర, రాష్ట్రాల్లో బీజేపీ, టీడీపీకి మద్దతిస్తున్నారు. ఏపీ ప్రభుత్వంలో మూడు పదవులను తీసుకుని చురుకైన పాత్ర పోషిస్తున్నారు. అయితే కేంద్రంలో జనసేనకు ప్రాతినిధ్యం లేకపోవడం వెలితిగా భావిస్తున్నారని అంటున్నారు. త్వరలో ఏపీ నుంచి 4 రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నందున తమకు ఒక సీటు కేటాయించడంతోపాటు మంత్రి పదవి ఇవ్వాలని పవన్ కేంద్ర పెద్దలను కోరుతున్నట్లు సమాచారం.

తన సోదరుడు నాగబాబును మంత్రిని చేయాలని పవన్ ఎప్పటి నుంచో చూస్తున్నారు. వాస్తవానికి గత ఏడాది ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కావాల్సివుంది. అయితే బీజేపీ ఒత్తిడి చేయడంతో నాగబాబుకు కేటాయించాల్సిన రాజ్యసభ స్థానాన్ని వదులుకున్నారు. దీంతో నాగబాబును ఎమ్మెల్సీగా ఎంపిక చేసి రాష్ట్ర మంత్రి పదవి ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. సీఎం చెప్పిన విధంగా నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చినా మంత్రి పదవి కేటాయించలేకపోయారు. అయితే ప్రస్తుతం రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నందున నాగబాబు కోరుకున్న విధంగా ఎంపీగా పంపి ఆయనకు కేంద్రంలో మంత్రి పదవి కేటాయించేలా ఢిల్లీ పెద్దలను కోరేందుకు పవన్ ఢిల్లీ వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందన ఏంటో తెలియాల్సివుంది. మొత్తానికి పవన్ హస్తిన పర్యటన అనేక ఊహాగానాలకు తావిస్తోందని చెబుతున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

## క్రైం వాయిస్

# ప్రియుడి మోజులో పడి..

### తల్లిదండ్రులకు విషం ఇంజక్షన్ ఇచ్చి చంపిన కుమార్తె

**వికారాబాద్ గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** వికారాబాద్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ప్రియుడి మోజులో పడి తల్లిదండ్రులకు కుమార్తె విషం ఇంజక్షన్ ఇచ్చి హతమార్చింది. అప్పుల బాధతో భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకుని ఉంటారని తొలుత భావించినా.. పోలీసుల విచారణలో కుమార్తె బండారం బట్టబయలైంది. వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బంట్వారం మండలం యాచారం గ్రామానికి చెందిన దశరథ్, లక్ష్మిలకు ఓ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చిన్నకుమార్తె సురేఖ.. సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా



పనిచేస్తోంది. అక్కడ ఓ యువకుడితో ప్రేమలో పడింది. తల్లిదండ్రులు వారి ప్రేమకు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలోనే మరో యువకుడితో సురేఖకు పెళ్లిచూపులు ఏర్పాటు చేశారు. పెళ్లిచూపుల నుంచి ఎలాగైనా తప్పించుకోవాలని భావించిన యువతి.. మోకాళ్ల నొప్పులకు అని చెప్పి తల్లిదండ్రులకు ఆదివారం వేర్వేరుగా విషం ఇంజక్షన్ ఇచ్చింది. వారు చనిపోయాక ఇద్దరినీ ఇంట్లో ఒకే చోట పడుకోబెట్టింది. అనంతరం ఏమీ తెలియనట్లు సోదరుడు అశోక్‌కు ఫోన్ చేసి తల్లిదండ్రులు స్పృహ తప్పి పడిపోయారని చెప్పింది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో కుమార్తె సురేఖే వారిని చంపినట్లు నిర్ధారణ అయింది. నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### వివాహేతర సంబంధం..

# అత్తతో కలిసి మేనమామను చంపిన మేనల్లుడు

**నల్గొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** అత్తతో కలిసి మేనల్లుడు సొంత మేనమామను హత్య చేసిన ఘటన నల్గొండ జిల్లా మాడ్గులపల్లి మండలం సీత్యాతండాలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రమావత్ రవి (34) వేములపల్లి మండలంలోని సల్కునూరు పీఏసీఎస్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు మిర్యాలగూడ మండలం ఏడు కోట్లతండాకు చెందిన లక్ష్మితో 15 ఏళ్ల క్రితం పెళ్లైంది. వీరికి ఇద్దరు పిల్లలు. రవి అక్క కుమారుడు గణేశ్‌తో భార్య లక్ష్మి గత కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం తెలియటంతో భర్త రవితో పాటు కుటుంబసభ్యులు ఇద్దరిని పలుమార్లు మందలించారు. అయినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ నెల 26న (సోమవారం) భార్యభర్తల మధ్య మరోసారి గొడవ జరిగింది. ఆ తర్వాత రవి డ్యూటీకి వెళ్లిపోగా భార్య లక్ష్మి పెద్దకొడుకును ఇంట్లో వదిలి తల్లి ఇంటికి వెళ్లిపోయింది. మరుసటి రోజు రాత్రి లక్ష్మి ఇంటికి వచ్చి భర్త రవితో గొడవ పడింది. మరో గదిలో ఉన్న అతడి తండ్రి లక్ష్మానాయక్.. ఇది తరచూ జరిగే గొడవే కదా అని నిద్రపోయాడు. తెల్లారి లేచి చూసేసరికి.. రవి నిద్ర లేవలేదు. తట్టి లేపే ప్రయత్నం చేస్తే.. తలపై గాయంతో రవి విగతజీవిగా పడి ఉన్నాడు. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం రవి భార్యకు ఫోన్ చేస్తే అందుబాటులో లేకుండా పోయింది. అయితే ఆమె మిర్యాలగూడ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. మృతుడి భార్య లక్ష్మి.. మేనల్లుడు గణేశ్‌తో కలిసి ఈ హత్య చేసినట్లు తండ్రి లక్ష్మానాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# మేడారం జాతరకు వెళ్తూ ట్రాక్టర్ బోల్తా..

### తల్లీకుమార్తెల దుర్మరణం - బోల్తాపడిన ట్రాక్టర్ కింద మృతదేహాలు

**మహాముత్తారం, విశ్వం వాయిస్ న్యూస్ :** మేడారం మహాజాతరకు వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కాటారం-మేడారం ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తల్లి, కుమార్తె దుర్మరణం చెందగా మరో మహిళ పరిస్థితి విషమంగా ఉంది. మృతులను ఆసిఫాబాద్? జిల్లా కౌటాల మండలం ముత్తంపేట గ్రామానికి చెందిన కస్తూరి లక్ష్మి (45), కస్తూరి అక్షిత (21)లుగా గుర్తించారు. పోలీసులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవపూర్ మండలం బొమ్మాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్‌లో 25 మంది మేడారం జాతరకు మంగళవారం సాయంత్రం బయలుదేరారు. మహాముత్తారం మండలంలోని పెగడపల్లి-కేశవాపూర్ అటవీ ప్రాంతంలో ట్రాక్టరును రహదారి కిందకు దించి మళ్లీ ఎక్కించే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ ట్రాలీ కింద తల్లీకుమార్తెలిద్దరూ నలిగిపోయి అక్కడికక్కడే చనిపోయారు. మరో మహిళ ఇరుక్కుపోగా పోలీసులు స్థానికుల సాయంతో ఆమెను బయటకు తీసి భూపాలపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఏఎస్పీ నరేశ్‌కుమార్ ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ ప్రమాదంతో మేడారానికి వెళ్లే దారిలో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది.

# పిల్లర్‌ను ఢీకొట్టిన కారు..

### ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి



**ఘట్‌కేసర్, విశ్వం వాయిస్ న్యూస్ :** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మేడ్చల్ జిల్లా ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ వంతెన పిల్లర్ నంబర్ 97 వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో కారులో 8 మంది విద్యార్థులు ఉన్నారు. మౌలాలి నుంచి పోచారం వెళ్తుండగా కారును అతివేగంగా నడుపుతూ పిల్లర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. మృతులను సాయివరుణ్ (23), నిఖిల్ (22)గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన వెంకట్, రాకేశ్‌ను సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన విద్యార్థులు యశ్వంత్, సాత్విక్, హర్షవర్ధన్, అభినవ్ సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### అప్పు తీర్చమన్నందుకు..

# ఇంటికి నిప్పంటించాడు

### మంటల్లో చిక్కుకొని వృద్ధుడి సజీవదహనం

రామన్నను సజీవదహనం చేసింది ఈ ఇంట్లోనే..



**పాడేరు, విశ్వం వాయిస్ న్యూస్ :** వారిద్దరూ మిత్రులు. అవసరాల కోసం ఒకరు మరొకరి దగ్గర అప్పు తీసుకున్నారు. చెప్పిన సమయానికి తిరిగివ్వకపోవడంతో ఇద్దరి మధ్య చెలరేగిన ఘర్షణ చివరికి హత్యకు దారి తీసింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. పాడేరు మండలం ఐనాడ పంచాయతీ పులగరువు ఇరుకురాయి గ్రామానికి చెందిన కొర్రా రామన్న(73) వ్యవసాయం చేస్తూ తాటాకులోని ఇంట్లో నివసిస్తున్నాడు. నాలుగు కిలోమీటర్ల దూరంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన వంతాల సోమన్న కూడా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరి మధ్య కొన్నేళ్లుగా స్నేహం ఉంది. దీంతో రామన్న వద్ద సోమన్న రూ.5,600 అప్పు తీసుకున్నాడు. ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ఈ నెల 23న (శుక్రవారం) రామన్న అడిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. మద్యం మత్తులో సహనం కోల్పోయిన సోమన్న అప్పు ఇచ్చిన రామన్నపై అతి కిరాతకంగా దాడి చేశాడు. అంతటితో ఆగకుండా రామన్నను ఆయన ఇంట్లోనే బంధించి ఇంటికి నిప్పుపెట్టాడు. హాహాకారాల మధ్య రామన్న మంటల్లో చిక్కుకొని సజీవదహనమయ్యాడు. ఆదివారం విషయం తెలుసుకున్న పాడేరు పోలీసులు సాయంత్రం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పూర్తిగా కాలిపోయిన రామన్న మృతదేహాన్ని డోలీలో నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న 108 వాహనం వద్దకు చేర్చారు. పరారీలో ఉన్న సోమన్న కోసం గాలిస్తున్నారు.

# ఎన్నో తిరస్కరణలు.. అయినా గూగుల్ కల అలా నెరవేరింది!

## వనిత వాయిస్



గూగుల్, మైక్రోసాఫ్ట్.. వంటి ప్రముఖ సంస్థల్లో తాము కోరుకున్న ఉద్యోగం రావాలంటే అత్యుత్తమ కళాశాలల్లోనే చదవాలనుకుంటారు చాలామంది. అందులోనూ ఐఐటీయన్లనే ఈ అదృష్టం వరిస్తుందనుకుంటారు. కానీ 'ఎక్కడ చదివామన్నది కాదు.. సబ్జెక్ట్‌పై ఎంత పట్టు సాధించామన్నదే ముఖ్యమం'టోంది భోపాల్‌కు చెందిన ఆర్చీ గుప్తా. అక్కడి ఓ టైర్-3 కళాశాలలో చదివిన ఆమె.. పరిమిత అవకాశాలున్నప్పటికీ అంతకంటే గొప్పదేదో సాధిస్తానని నమ్మింది. ఈ ఆత్మవిశ్వాసమే ఎన్నో ఇంటర్వ్యూ తిరస్కరణల అనంతరం.. ఆమెకు గూగుల్‌లో ఉద్యోగం తెచ్చిపెట్టింది. 'మనం పడిన కష్టం ఎప్పటికీ వృథా కాదు..' అంటూ తాజాగా సోషల్ మీడియాలో తన కథను పంచుకోగా అది వైరల్‌గా మారింది.



**ఆ లక్ష్యంతో..!**

'బాగా చదువుకోవాలి.. పెద్ద సంస్థలో ఉద్యోగం చేయాలి..' విద్యార్థి దశలో ఉన్నప్పుడు చాలామంది ఇలాగే అనుకుంటారు. అయితే ఇలా అనుకోవడంతో సరిపోదు.. ఈ దిశగా నిరంతరం ప్రయత్నించిన వారే లక్ష్యాన్ని చేరుకోగలుగుతారు. ఆర్చీనే ఇందుకు తాజా ఉదాహరణ. గూగుల్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడాలన్నది ఆమె కెరీర్ లక్ష్యం. అయితే దీన్ని చేరుకునే క్రమంలో ఐఐటీ వంటి మేటి విద్యాసంస్థల్లో చదవలేదామె. భోపాల్‌లోని ఓ సాధారణ ఇంజినీరింగ్ కళాశాలలో చేరింది. అది కూడా పరిమిత సదుపాయాలు, ప్రాంగణ నియామకాలు అంతంత మాత్రంగానే ఉన్న టైర్-3 కళాశాలలో. అయినా ఇవేవీ పట్టించుకోకుండా చదువుపైనే పూర్తి దృష్టి పెట్టింది. తాను అనుకున్నది తప్పకుండా సాధిస్తానన్న ఆత్మవిశ్వాసంతో అడుగు ముందుకేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలు చేపట్టిన ఇంటర్వ్యూలకూ హాజరైంది. కానీ ప్రతిచోటా తిరస్కరణలే స్వాగతం పలికాయామెకు. అయినా నిరాశ చెందకుండా ప్రయత్నించి తన కలల కొలువును సొంతం చేసుకుంది. ఈ క్రమంలోనే తన సక్సెస్ స్టోరీని తాజాగా ఇన్‌స్టా వేదికగా పంచుకుంది.

**ఏ అవకాశాన్నీ వదల్లేదు!**

2017లో కలల కొలువు సాధించే దిశగా నా ప్రయాణం ప్రారంభమైంది. అదే ఏడాది ఇంజినీరింగ్ విద్య కోసం భోపాల్‌లోని ఓ టైర్-3 కాలేజీలో చేరాను. కేవలం కొన్ని చిన్న చిన్న సంస్థలు మాత్రమే క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించేవి. అయినా అంతకుమించి గొప్ప ఉద్యోగం వస్తుందన్న నమ్మకంతో ఉండేదాన్ని. ఈ క్రమంలోనే ఇటు క్యాంపస్ లోపల, అటు క్యాంపస్ వెలుపల జరిగే ప్రతి ఇంటర్వ్యూకూ హాజరయ్యేదాన్ని. కొన్నిసార్లు దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాల్లో నిర్వహించిన వాక్-ఇన్ ఇంటర్వ్యూలకూ హాజరయ్యా. కానీ ప్రతిసారీ తిరస్కరణలే ఎదురయ్యేవి. అయినా నిరాశ పడలేదు. నా కలల కొలువు కచ్చితంగా వస్తుందన్న ఆశ నన్ను ముందుకు నడిపించింది. ఇక ఫైనలియర్‌లో ఉండగా ఓ సంస్థలో ఉద్యోగం వచ్చింది. కానీ అది నాకు సంతృప్తినివ్వలేదు. 'ఇది ఆరంభమే కదా!' అని వెనక్కి తగ్గా. ఆ అవకాశం వద్దనుకొని కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడంపై దృష్టి పెట్టా. ఇంతలోనే ఓ సంస్థలో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం వరించింది. పోనుపోను ఇదే ఫుల్‌టైమ్ ఉద్యోగం అయితే బాగుండనుకున్నా.

**ప్రయత్నం ఆపద్దు!**


అయినా ఇంటర్వ్యూ ప్రయత్నాలు ఆపలేదు. నేను అనుకున్నట్లుగానే ఇంటర్న్‌షిప్ చేసిన సంస్థలోనే ఫుల్‌టైమ్ ఉద్యోగిగా మారిపోయా. ఓవైపు జాబ్ చేస్తూనే.. మరోవైపు డేటా సైన్స్, మెషీన్‌లెర్నింగ్.. వంటి ఆధునిక సాంకేతికతల్నీ నేర్చుకున్నా. ఎప్పటికైనా నేను కోరుకున్న గూగుల్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం వస్తుందన్న నమ్మకం అప్పటికీ నాలో బలంగా ఉంది. అనుకున్నట్లుగానే 2019లో గూగుల్ నాకో అవకాశం ఇచ్చింది. కానీ అందులో నేను సఫలం కాలేదు. అయినా నిరాశ చెందలేదు.. ఆపైనా ఇతర ప్రముఖ సంస్థల్లో ఇంటర్వ్యూలకు హాజరవడం, తిరస్కరణకు గురవడం.. ఇలా రిజెక్ట్ చేసిన ప్రతిసారీ ఏదో ఒక కొత్త విషయం నేర్చుకున్నా. ఆఖరికి 2022లో నేను కన్న కల ఫలించింది. గూగుల్ నాకు మరో అవకాశం ఇచ్చింది. ఈసారి అదృష్టం నావైపు ఉంది. పూర్తిగా సన్నద్ధమై, నిండైన ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూకి వెళ్లిన నన్ను నా కలల ఉద్యోగం వరించింది. నా కెరీర్ లక్ష్యం నెరవేరింది. ఆ క్షణం ఎంత సంతోషించానో మాటల్లో చెప్పలేను. ఇదంతా నిరంతర ప్రయత్నం, అంకితభావం, ఆత్మవిశ్వాసంతోనే సాధ్యమైంది. అందుకే మీ అందరితో ఒక్క విషయం చెప్పాలనుకుంటున్నా.. ఒకే దాని గురించి ప్రయత్నించడం కొన్నిసార్లు బోరింగ్‌గా అనిపించచ్చు. కానీ ఆ స్థిరత్వమే లక్ష్యం చేరుకునేలా మనల్ని ప్రేరేపిస్తుంది. గెలుపుకి దగ్గరి దారులు ఉండవు.. నిరంతర ప్రయత్నం తప్ప!' అంటూ తన గెలుపు కథను పంచుకుంది ఆర్చీ.

**'స్ఫూర్తి కథ' మీది!**

ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారడంతో చాలామంది దీనిపై స్పందిస్తూ కామెంట్లు చేస్తున్నారు. 'మీ కథ ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంది.. నిరంతర ప్రయత్నంతోనే లక్ష్యాన్ని చేరుకోవచ్చని నిరూపించారు..' అంటూ ఒకరు రాసుకొచ్చారు. 'మీలాగే శ్రమిస్తే నేనూ నా కలను నెరవేర్చుకోగలుగుతాను. పరిమిత వనరులున్న ఒక సాధారణ కళాశాలలో చదివినా.. గూగుల్‌లో ఉద్యోగం సంపాదించిన మీ పట్టుదలకు హ్యాట్సాఫ్!' అంటూ మరొకరు కామెంట్ చేశారు. వీళ్లే కాదు.. మరికొంతమంది కలల కెరీర్‌ని సొంతం చేసుకునేందుకు తాము పడిన కష్టాల్ని, చేసిన ప్రయత్నాల్ని గుర్తుచేసుకున్నారు. 'ఎక్కడ చదివామన్నది కాదు.. ఎన్ని నైపుణ్యాలు నేర్చుకున్నాం.. కలల కొలువును సొంతం చేసుకోవడానికి ఎంత సిన్సియర్‌గా ప్రయత్నించాం..' అన్నదే ముఖ్యమని తన విజయంతో నిరూపించిన ఆర్చీ కెరీర్ జర్నీ నేటి యువతకు స్ఫూర్తిదాయకం అని చెప్పడంలో సందేహం లేదు.. కదూ!! అన్నట్లు.. ఆర్చీ వక్త, సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్ కూడా! ఈ క్రమంలోనే కెరీర్ టిప్స్, ఇంటర్వ్యూ చిట్కాల్ని ఆయా వేదికలపై పంచుకుంటుంది.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



క్లస్టర్ ఇంచార్జ్‌గా నియమితులైన

## ముచ్చు వీర వెంకట సత్యనారాయణ



**నియామకాన్ని ప్రకటించిన మండల అధ్యక్షులు చంటిబాబు**

**హర్షం వ్యక్తం చేసిన మండల టీడీపీ నాయకులు**

**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, నియోజకవర్గం పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు దేవీపట్నం మండలం తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ గా ఇందుకూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముచ్చు వీర వెంకట సత్యనారాయణను నియమించినట్టు మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు తెలిపారు. అధ్యక్షులు చంటిబాబు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పించడం జరుగుతుంది అని పార్టీ విధి విధానాలకు లోబడి క్రమశిక్షణ కలిగి ఉండాలని ఆయన తెలిపారు. క్లస్టర్ ఇంచార్జ్ గా నియమితులైన వీర వెంకట సత్య నారాయణ ఇప్పటికే పార్టీ లో మండల ప్రధాన కార్యదర్శిగా, ఎంపిటిసి గా పలు బాధ్యతలు నిర్వహించారు.మండల క్లస్టర్ ఇంచార్జ్ గా నియమితులైన వీర వెంకట సత్యనారాయణను పార్టీ నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు



**స్వాదీనపరుచుకున్న 11 మద్యం సీసాలు**

**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవీపట్నం మండలంలోని పలు గ్రామాలలోని దుకాణాలపై దేవీపట్నం ఎస్సై షరీఫ్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. మండలం లోని అంగుళూరు గ్రామంలో అక్రమంగా మధ్యాన్ని విక్రయిస్తున్న విజయ్ (35)ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి పదకొండు మద్యం సీసాలను స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేశారు.ఎస్సై షరీఫ్ మాట్లాడుతూ మండలం లో అక్రమంగా మద్యం విక్రయాలు ,నాటు సారా తయారీ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని ఆయన తెలిపారు.

## ఘనంగా నేమని శేఖర్ పుట్టినరోజు వేడుకలు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో నేమాని శేఖర్ పుట్టినరోజు వేడుకలు ఆయన అభిమనులు బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ పరిధిలో టేకుముడి శ్రీను ఆధ్వర్యంలో కేక్ కట్టింగ్‌లు పలు సేవ కార్యక్రమాలు చేపట్టారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి అని ఆయన అభిమానులు ఆకాంక్షించారు. అనంతరం ఆయన ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో ఉన్న ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ డొక్కా సీతమ్మ నిత్య అన్నదానం శిబిరంలో వృద్ధులకు, వికలాంగులకు, పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించాలి : డాక్టర్ జయశ్రీ



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రోవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పి.యం.పి. అసోసియేషన్ ఆఫ్ ఇండియా) నిడదవోలు మండలం ఆధ్వర్యంలో వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో సెర్వికల్ క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం మండల అధ్యక్షులు పోతుల సత్య వర ప్రసాద్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ జయశ్రీ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ఎలా గుర్తించాలో ముందుగా దాని లక్షణములు ఎలా ఉంటాయో వివరించారు. ప్రజలు ముందుగా వ్యాధిని గుర్తించడానికి ఉన్న పరీక్షలు, వ్యాధి సోకకుండా ఉండటానికి ముందుగా హెచ్పీవీ వ్యాక్సిన్ ఏవిధంగా వేయించాలో తొలి దశలో ఎలా గుర్తించాలో చక్కగా వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.రుద్ర మాట్లాడుతూ ఇలాంటి ఆరోగ్య అవగాహనా కార్యక్రమాలు చేయడానికి మేము సహకరిస్తాము అన్నారు. అసోసియేషన్ సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి పాండ్రాకుల వీర వెంకట సత్యనారాయణ,శివ, సురేష్, త్రిమూర్తులు, పండు తదితరులు పాల్గొన్నారు.

## అక్షరయోధుడు ఆచార్య ఎండ్లూరి సుధాకర్ ఘన నివాళి



**ధవళేశ్వరం, నేటి వార్త :** బుధవారం ఉదయం రాజమహేం ద్రవరం రూరల్ స్థానిక ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు స్వర్గీయ మహాకవి ఆచార్య ఎండ్లూరి సుధాకర్ నాల్గవ వర్ధంతి సభను నిర్వహించారు. ముందుగా ఆచార్య ఎండ్లూరి సుధాకర్ చిత్రపటానికి పూలమాల చేసిన నివాళులు అర్పించారు.అనంతరం ఇంచార్జీ ప్రిన్సిపాల్ ఏ. వెంకట రమణ మాట్లాడుతూ కవిత్వం మనిషి జీవితంలో ఒక భాగమని నిరూపించిన అక్షర యోధుడు మహా కవి ఆచార్య ఎండ్లూరి సుధాకర్ అని కొనియాడారు. తెలుగు అధ్యాపకుడు పి. భాస్కర్ మాట్లాడుతూ చిన్న చిన్న పదాలతో సరళమైన వాక్య నిర్మాణం కలిగి అత్యాధునిక భాషలో కవిత్వం అల్లిన కలం యోధుడు ఆచార్య ఎండ్లూరి సుధాకర్ అని పేర్కొన్నారు. ఆయన కవిత్వం నిండా ఆత్మ గౌరవ ప్రకటన ఉంటుందని తెలిపారు." నాలుగు మెతుకులే నా అక్షరాలు/ నాలుగు మనుషులే నేను చదివిన ప్రబంధాలు/ నా బాల్య దృశ్యాలే నేను చూసిన అలంకార శాస్త్రాలు"అని చాటి చెప్పిన గొప్ప మానవతా వాది ఆచార్య ఎండ్లూరి సుధాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు- ఎస్కే. అలీముద్దీన్, వి.ఎస్. శేఖర్ బాబు, కె.పెద్దబ్బులు, కె.వెంకట్రావు, వై.శివకుమారి, సి.శాంతి సుధ, కె.ఉమాశంకర్, డి.భాస్కరరావు, ఎన్.కళ్యాణిదేవి, ఏ.జ్యోతి తదితరులు మరియు ఆఫీసు సిబ్బంది మరియు విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

## తంటికొండలో అశ్లీల నృత్యాలపై కేసు నమోదు

**ఇద్దరు ఆర్గనైజర్లు, ముగ్గురు డ్యాన్సర్లు అరెస్టు**



**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం మండలం తంటికొండ గ్రామంలో జనవరి18వ తేదీన రాత్రి, తెల్లవారితే 19న 2.30 నుండి 3.30 గంటల మధ్య తంటికొండ గ్రామంలోని కుంతీదేవి అమ్మవారి జాతర సందర్భంగా అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేసినందుకుగాను నిర్వాహకులు మరియు అశ్లీల నృత్యాలు చేసిన డ్యాన్సర్ లపై కేసు నమోదు చేయడం జరిగిందని గోకవరం ఎస్సై వి.ఎన్.వి.పవన్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో అరెస్టు చేయబడిన వారు అదే గ్రామానికి చెందిన ఆర్గనైజర్లు కండెల్లి అశోక్ కుమార్, సుంకర దుర్గా ప్రసాద్, డ్యాన్సర్లు :రాజమహేంద్రవరానికి చెందిన గుర్రం ఏసుబాబు అలియాస్ రోహిణి, కానూరు సుబ్రమణ్యం అలియాస్ నక్షత్ర,రంప యర్రంపాలెం గ్రామానికి చెందిన పిల్లి మహేష్ అలియాస్ మహీ అనువారిపై 28 తేదీన ఊరిని అరెస్టు చేసి, రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం మొదటి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు కోరుకొండ సి.ఐ ఎస్.వి.వి.ఎస్.మూర్తి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకవరం పోలీసు స్టేషన్ మరియు కోరుకొండ సర్కిల్ పరిధిలోని ప్రజలు గ్రామ దేవతలు మరియు అమ్మవార్ల ఉత్సవాలు, ఊరేగింపులు, జాతరలు నిబంధనలకు లోబడి చట్టపరిధిలో జరుపుకోవాలని,ఉత్సవాలు, ఊరేగింపులు, జాతరలకు పోలీసు శాఖ మరియు సంబంధిత శాఖల నుండి అనుమతులు తప్పనిసరిగా పొందాలని, ఉత్సవాల్లో శాంతి భద్రతల సమస్యలు రాకుండా సమతుల్యం పాటించాల్సిన బాధ్యత కమిటీ వారిదేనని, ఉత్సవాలు, ఊరేగింపులు, జాతరల వివరాలు, అందులోని ప్రోగ్రామ్స్ మరియు అందులో పాల్గొనే వారి వివరాలు (ఈవెంట్ ఆర్గనైజర్లు) మొదలగు పూర్తి వివరాలు పోలీసు వారికి తెలియపరచాలని, అసాంఘీక కార్యకలాపాలు, గుండాట, పేకాట మొదలైనవి ఎవరూ ప్రోత్సహించరాదని, ఆడరాదని,అశ్లీల నృత్యాలు, పాటలు, ప్రసంగాలు; రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదని, ఫ్లెక్షీలు వివాదం కాకూడదని, వివధాస్పద ఫ్లెక్షీలు ఏర్పాటు చేసినట్లైతే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని,పబ్లిక్ మరియు ప్రైవేట్ ప్రదేశాల్లో ఫ్లెక్షీలు ఏర్పాటుకు సంబంధిత శాఖ మరియు ఎస్పీ నుండి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు.

## కలెక్టర్ చేతులమీదుగా సత్య రాజేష్‌కు ప్రశంసాపత్రం అందజేత



**తణుకు, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీచిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), తణుకు నందు కళాశాల సూపరింటెండెంట్ గా పనిచేస్తున్న కూసు వేంకట సత్య రాజేష్ అందించిన అత్యుత్తమ సేవలకుగాను 77వ భారత గణతంత్ర దినోత్సవం 2026 వేడుకల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న సందర్భంగా కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్. ఏడుకొండలు మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణతో పాటు సేవాభావంతో పనిచేస్తే ఇలాంటి గౌరవాలు సహజంగానే లభిస్తాయని అన్నారు. రాజేష్ పొందిన అవార్డు కళాశాల సిబ్బందికే కాకుండా సంస్థకు గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో కూసు వెంకట సత్య రాజేష్ ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్టాఫ్ క్లబ్ ప్రెసిడెంట్ ఆర్.ఎస్.ఎం.భూపాల్ మాట్లాడుతూ,రాజేష్ అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బందితో సమన్వయంగా పనిచేస్తూ కళాశాల అభివృద్ధికి విశేష సేవలందిస్తున్నారని తెలిపారు.వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి ఏ. మారుతీదేవిచౌదరి మాట్లాడుతూ, రాజేష్ కళాశాల పరిపాలనలో నిబద్ధతతో, బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత కూసు వెంకట సత్య రాజేష్ మాట్లాడుతూ, తనను గౌరవించిన ప్రభుత్వానికి, కళాశాల ప్రిన్సిపాల్ కి, అధ్యాపక బృందానికి మరియు సహచరులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత అంకితభావంతో సేవలు కొనసాగిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.కె.ఫణిధర్, జి. ఇందిరా కుమారి, డా.డి. కనక మహాలక్ష్మి,బి.యస్. యల్. పద్మశ్రీ, డా.పి. కమల, డా. ఇ.జ్యోతీ కిరణ్మయి, డా. కె. నాగభూషణ్ రెడ్డి, డా. జి.విజయ్ కుమార్,ఆర్. అశోక్ కుమార్, డా. టి.సంధ్యారాణి,యన్. విష్ణు వర్ధన్,కే. జీవన్ బాబు, జి.కమల, వి.శివ ప్రకాష్,బి. శిరీష,తదితర అధ్యాపక బృందం మరియు కళాశాల సీనియర్ అసిస్టెంట్ యమ్. పార్వతి, హెచ్.రామకృష్ణ,తదితర అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని రాజేష్ ను అభినందించారు.

**2029 ఎన్నికలకు చంద్రబాబు టార్గెట్ ఫిక్స్..**


## పక్కాగా పొలిటికల్ గవర్నెన్స్!!

పొలిటికల్ గవర్నెన్స్ లో పార్లమెంటు కమిటీలు కీలకమని ఆ నియోజకవర్గం పరిధిలో చేపట్టే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయా కమిటీల అధ్యక్షులతో ఎమ్మెల్యేలు, ఎంపీలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబులో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఎప్పుడూ రియల్ టైమ్ గవర్నెన్స్.. ఈ-గవర్నెన్స్ అంటూ టెక్నాలజీ మాటలు చెప్పే సీఎం చంద్రబాబు తొలిసారిగా వినూత్నంగా మాట్లాడారు. రాష్ట్రంలో పొలిటికల్ గవర్నెన్స్ పక్కాగా ఉండాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇలా మాట్లాడటం చూసిన టీడీపీ కార్యకర్తలు, నాయకులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీని భాగస్వామ్యం చేయడంలో చంద్రబాబు ఇందుకు పూర్తి భిన్నవైఖరిని ప్రదర్శించేవారని అంటున్నారు. ఎక్కువగా బ్యూరోక్రాట్లపై ఆధారపడే చంద్రబాబు మంగళగిరి పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ కార్యకర్తల శిక్షణ శిబిరంలో మాత్రం 2029 ఎన్నికల టార్గెట్ గా రాష్ట్రంలో పొలిటికల్ గవర్నెన్స్ పక్కాగా అమలు కావాలని సూచించారు. డబ్బులతోనే రాజకీయం చేయలేమని చెప్పిన చంద్రబాబు.. ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాలని కార్యకర్తలకు సూచించారు. "డబ్బుతోనే అన్నీ నడుస్తాయనుకుంటే ధనవంతులే రాజకీయం చేస్తారు. మనలాంటి వాళ్లు చేయలేరు" అంటూ సీఎం వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వంలో కార్యకర్తలు కష్టాలు పడ్డారు. ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పసుపు జెండా కోసం రక్తం చిందించారు. అనేక త్యాగాలు చేశారు. అందుకే



పార్టీలో ఎవరికి ఏ పదవి ఇచ్చినా కార్యకర్తల అభిప్రాయానికి పెద్దపీట వేస్తున్నామని సీఎం వ్యాఖ్యానించారు. సమర్థ నాయకులు తయారు కావడానికి టీడీపీ ఒక వేదిక అంటూ సీఎం చెప్పారు. ఈ సందర్భంగా పొలిటికల్ గవర్నెన్స్ పై సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. పొలిటికల్ గవర్నెన్స్ లో పార్లమెంటు కమిటీలు కీలకమని ఆ నియోజకవర్గం పరిధిలో చేపట్టే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయా కమిటీల అధ్యక్షులతో ఎమ్మెల్యేలు, ఎంపీలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా ఈ కమిటీలు మిత్రపక్షాలు జనసేన, బీజేపీతోనూ సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ లోక్ సభ నియోజకవర్గ అధ్యక్షుడు ఆ జిల్లా ఇంచార్జి మంత్రితో సమానమని చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షులతో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కలిసి పనిచేయాలని ఆదేశించారు. అప్పుడే పొలిటికల్ గవర్నెన్స్ లక్ష్యం సిద్ధిస్తుందని వ్యాఖ్యానించారు. మరోవైపు కమిటీల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటానని సీఎం స్పష్టం చేశారు. పదవులు తీసుకున్న వారు సరిగా పనిచేయకపోతే పక్కన పెడతాం. ప్రతి మూడు నెలలకు ఒకసారి అధ్యయనం చేస్తాం. మరింత సమర్థంగా పనిచేసేలా రోజురోజుకు మెరుగుపడాలి. అందుకే యువతకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చామంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల్లో 80 శాతం మంది కొత్తవారు, చదువుకున్న వారికి ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చామని వివరించారు. దేశంలో యంగ్ పార్లమెంటరీ పార్టీగా టీడీపీ ఉందని గుర్తు చేశారు. ఇదే సమయంలో వచ్చే ఎన్నికలపై సీఎం పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. 2024 ఎన్నికల్లో ఎన్ని ఓట్లు వచ్చాయో, 2029లో అంతకు 10 ఓట్లు అదనంగా రావాలని లక్ష్యం నిర్దేశించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో 2024 ఎన్నికల కంటే కూటమి మరింత బలపడిందని సీఎం చెప్పారు. ఎన్నికలు జరిగినప్పుడే ప్రజల వద్దకు వెళతామంటే సరికాదు, ప్రభుత్వ కార్యక్రమాలను వివరించేందుకు వారితో మమేకం అవ్వాలంటూ సూచించారు. వచ్చిన అధికారాన్ని మళ్లీ నిలబెట్టుకునే బాధ్యత నాయకత్వం, శ్రేణులపై ఉంది. నాయకులు ఎవరూ కేడర్ ను విస్మరించకూడదు. ఎవరికి కేటాయించిన పదవుల్లో వారే పనిచేయాలి. కావాలని ఎక్కడైనా వివాదాలు సృష్టిస్తే పక్కనపెడతామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు.

## ఏపీ పన్ను రాబడిలో కొత్త రికార్డు.. 9 నెలల్లో రూ.లక్ష కోట్లు దాటేశారు



గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పన్ను రాబడి సరికొత్త రికార్డును క్రియేట్ చేసింది. కేవలం తొమ్మిది నెలల కాలానికి పన్ను రాబడి ఆదాయం రూ.లక్ష కోట్ల మార్కును దాటేయటం విశేషం. 2021 నుంచి ఇప్పటివరకు తొమ్మిది నెలల వ్యవధిలో రూ.లక్ష కోట్ల కాస్త దగ్గరగా వచ్చినప్పటికి.. ఈసారి మాత్రం ఏకంగా ఆ మార్కును దాటేసి.. ఆసక్తికర గణాంకాలు నమోదైన పరిస్థితి. ఏపీలో మారుతున్న ముఖచిత్రానికి ఇదో నిదర్శనంగా చెబుతున్నారు. ఈ స్థాయిలో పన్ను రాబడిని సాధించింది గతంలో ఎప్పుడూ లేదు. రాష్ట్ర పన్నుల రాబడిలో జీఎస్టీ.. స్టాంపుల రిజిస్ట్రేషన్ల ఫీజుతో పాటు భూమిశిస్తు.. అమ్మకపు పన్ను.. ఎక్సైజ్ సుంకం.. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా.. ఇతర పన్నులన్నీ కలిపితే రాష్ట్ర రాబడి వస్తుంది. ఏపీలో పరిస్థితులు మారుతున్నాయని.. డెవలప్ మెంట్ విషయంలో కూటమి ప్రభుత్వం కొత్త అడుగులు వేస్తుందన్న మాటకు బలం చేకూరేలా తాజా గణాంకాల ఉన్నట్లుగా చెప్పాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025 ఏప్రిల్ 01 - 2026 మార్చి 31లో మొత్తం పన్నుల రాబడి రూ1.66 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఇందులో 63.23 శాతం డిసెంబరు నాటికి సమకూరిన నేపథ్యంలో మిగిలిన 37 శాతం (సుమారు) మూడు నెలల్లో సమకూరుతుందా? అన్నదిప్పుడు ప్రశ్న. అయితే.. సంక్రాంతి పండుగ సందర్భంగా జరిగిన లావాదేవీలు.. కొనుగోళ్లు.. ఏపీకి భారీ ఆదాయాన్ని తెచ్చి పెడతాయన్న అంచనా వ్యక్తమవుతోంది. ఆదాయం పెరగటానికి కారణాల్లో ఒకటి మూలధన వ్యయం ఎంత ఎక్కువగా ఉంటే.. డెవలప్ మెంట్ అంత సాధ్యమవుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గడిచిన తొమ్మిదినెలల్లో రూ.19,224 కోట్ల మూలధన వ్యయం చేశారు. గడిచిన ఐదేళ్లలో ఇదే ఎక్కువగా చెప్పాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.40వేల కోట్లు ఖర్చు చేయాలని భావించినా.. తొమ్మిదినెలల్లో యాభై శాతమే ఖర్చు చేసిన పరిస్థితి. మిగిలిన మూడు నెలల్లో యాభై శాతం ఖర్చు చేయటం సాధ్యమా? అన్నది ప్రశ్న. ఇక్కడో ఆసక్తికర అంశాన్ని ప్రస్తావించాలి. 2024 ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయం రూ.8,894 కోట్లు మాత్రమే. అందుకు భిన్నంగా ఈ ఏడాది భారీగా ఖర్చు చేసిన దానికి తగిన ఫలితం లభించినట్లుగా చెప్పాలి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

గురువారం, 29 జనవరి 2026
www.viswamvoice.com





# అనుమతి లేకపోతే రాయితీలు లేవు

## ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్‌పై జిల్లా కలెక్టర్ కఠిన హెచ్చరిక



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆక్వా చెరువులకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు పొందాలని, అనుమతులు లేకుంటే ఎలాంటి ప్రభుత్వ రాయితీలు అందుబాటులో ఉండవని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆక్వా రైతాంగానికి స్పష్టమైన హెచ్చరిక చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆక్వా రిజిస్ట్రేషన్ పూర్తిస్థాయిలో జరగకపోవడానికి గల కారణాలపై మత్స్యశాఖ అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ అధికారులు వివరణ ఇస్తూ డి-పట్టా భూములు ఒకరి పేరుపై ఉండగా, ప్రస్తుతం వేరొకరు వినియోగిస్తున్న సందర్భాలు ఎక్కువగా ఉండటం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. అలాగే దేవస్థాన భూములకు దేవస్థానం అనుమతి లేకుండా ఆక్వా చెరువులుగా నమోదు చేయడం సాధ్యం కాదన్నారు. సొసైటీ భూముల విషయంలో కూడా సంబంధిత సొసైటీ నుంచి లీజ్ డాక్యుమెంట్లు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. కొన్ని భూముల వివరాలు ఆన్లైన్‌లో అందుబాటులో లేకపోవడం వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోతోందన్నారు. పల్లిపాలెం, అంతర్వేది దేవస్థానం పరిధి, కర్రగొండి, కేశవదాసుపాలెం గ్రామాల్లో చెరువులుగా కనిపిస్తున్న అనేక భూములు వాస్తవానికి పల్లపు భూములుగా ఉండటంతో నిత్యం నీటితో నిండిపోయి ఆక్వా సాగుకు అనుకూలంగా లేవని తెలిపారు. అలాగే జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) కేసుల్లో ఉన్న భూములు, సీఆర్‌జెడ్ పరిధిలోని భూములు, లంక భూముల రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు. భూస్వామ్య పత్రాలు, పట్టాదారు పాస్‌బుక్స్, రిజిస్ట్రేషన్ డీడ్‌లలో స్పష్టత లేకపోవడం, పాత రికార్డులు కొత్త డిజిటల్ రికార్డుల మధ్య వ్యత్యాసాలు, లీజు భూములపై సరైన ఒప్పంద పత్రాల లేమి వంటి అంశాలు ప్రధాన అవరోధాలుగా మారాయని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల్లో సర్వర్ డౌన్, అప్లోడ్ ఫెయిల్యూర్, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయాల కొరత, రైతుల్లో డిజిటల్ అవగాహన లోపం వల్ల కూడా జాప్యాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. మత్స్య, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి వంటి ప్రధాన శాఖల అనుమతులు తప్పనిసరి కాగా, శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సరళీకృతం చేయడం ద్వారా రైతులకు లాభం చేకూరడమే కాకుండా, ఆక్వా రంగం సుస్థిరంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఎదురవుతున్న పరిపాలనా, సాంకేతిక, సామాజిక సమస్యలను అధిగమిస్తూ నిర్దేశిత కాలవ్యవధిలో అనుమతుల ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆక్వాకల్చర్ రంగం గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ నిశాంతి, మత్స్యశాఖ అధికారి వర్ధన్, తహసీల్దారులు రవికిరణ్, సునీల్ కుమార్, భాస్కర్, మత్స్య అభివృద్ధి అధికారులు హేమంత్, శరత్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

### రామచంద్రపురం నియోజవర్గంలో పలు అభివృద్ధి పనులకు

## శంకుస్థాపనలు చేసిన వాసంశెట్టి సత్యం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజవర్గంలో పలు అభివృద్ధి పనులకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, అధికారులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. కాజులూరు మండలంలో కోటి 32 లక్షల రూపాయలతో 9 అభివృద్ధి పనులు, అలాగే రామచంద్రపురం మండలం భీమక్రోసుపాలెం, నెలపర్తి పాడు గ్రామాల్లో 46 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కాజులూరు మండలంలోని శలపాకలో విలేజ్ హెల్త్ క్లినిక్ నిమిత్తం 36 లక్షలు, (విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణం కోసం 6 సెంట్లు స్థలం దానం చేసిన చంద్రు శ్రీహరి రావును పలువురు అభినందించారు.అలాగే తర్లంపూడి గ్రామంలో సిసి రోడ్డు 24 లక్షలు, టీ మామిడాడలో రోడ్డు 4 లక్షలు, చేదువాడ గ్రామంలో రెండు సిసి రోడ్లు 21 లక్షలు, శీల గ్రామంలో సిమెంట్ రోడ్డుకు 35.50 లక్షలు, ఒంటి తాడిలో సీసీ రోడ్డుకు 11.50 లక్షలు, అలాగే రామచంద్రపురం మండలంలో భీమక్రోసుపాలెం రోడ్లకు 30 లక్షలు, నేలపర్తిపాడు రోడ్లకు 16 లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల కల్పన, రోడ్లు, ప్రజలకు అవసరమైన సౌకర్యాల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పనులు అమలు చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో కూడా నియోజవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మంత్రి సుభాష్, కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో జే రాంబాబు, ఏఈ భవాని శంకర్, కాజులూరు మండల టిడిపి అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి,(డాక్టర్ బాబు) రామచంద్రపురం రూరల్ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, టేకుమూడి సత్యనారాయణ, వల్లూరి వీర వెంకట సూర్యనారాయణ చౌదరి, చిట్టూరి జానకిరామయ్య కృష్ణ, మంగయ్య చౌదరి, రాయుడు వీర్రాజు, తాతపూడి కుమార్ బాబు, పలువురు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కిటికీ బయటకు వచ్చిన క్షణమే కబళించిన మృత్యువు..

### ఆర్టీసీ బస్సు ప్రయాణంలో కాలేజీ విద్యార్థి విషాదాంతం



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

ప్రతిరోజూ కళాశాలకు వెళ్లే ఓ సాధారణ ప్రయాణం తల్లిదండ్రుల కలలకు ప్రతిరూపమైన ఓ విద్యార్థి. అతని జీవితాన్ని ఒక్క క్షణంలో మృత్యువు లాక్కుపోయింది. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో కిటికీ నుంచి తల బయటకు పెట్టిన ఓ కాలేజీ విద్యార్థి, టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన డివైడర్‌కు తల ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన హృదయ విదారక ఘటన ముమ్మిడివరం మండలంలో చోటుచేసుకుంది. ముమ్మిడివరం మండలం లక్ష్మీదేవి లంక గ్రామానికి చెందిన సోంపల్లి వెంకట రవీంద్ర (16) అమలాపురంలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. నిత్యం ఆర్టీసీ బస్సులో అమలాపురం వెళ్లి తిరిగి వచ్చే రవీంద్ర, బుధవారం ఉదయం కూడా కళాశాలకు వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. అయితే అన్నంపల్లి టోల్ గేట్ సమీపంలో బస్సు ప్రయాణిస్తున్న సమయంలో, కిటికీ నుంచి తల బయటకు పెట్టిన రవీంద్ర, అక్కడ ఏర్పాటు చేసిన డివైడర్‌కు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ప్రమాదంలో రవీంద్ర ఘటనాస్థలంలోనే మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒక్కసారిగా కుమారుడి మృతి వార్త వినడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రుల కళ్ల ముందు కళలన్నీ కూలిపోయినట్లయ్యాయి. ఇలాంటి ఘటనలు మరలా జరగకుండా విద్యార్థులు, ప్రయాణికులు బస్సు ప్రయాణ సమయంలో కిటికీల నుంచి తల లేదా చేతులు బయటకు పెట్టకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలు కూడా విద్యార్థులకు రవాణా భద్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## కుష్టురోగుల పట్ల కలంకాలను తొలగిద్దాం

### స్పర్శ్ లెప్రసీ అవగాహన కార్యక్రమ ప్రచార గోడపత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** కుష్టురోగులను సమాజంలోని ప్రధాన స్రవంతిలో చేర్చడమే మహాత్మా గాంధీజీ ఆశయమని, అదే లక్ష్యంతో స్పర్శ్ లెప్రసీ అవగాహన కార్యక్రమం అమలులో ఉందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం అమలాపురం కలెక్టరేట్‌లో స్పర్శ్ లెప్రసీ అవగాహన కార్యక్రమ ప్రచార గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు రెండు వారాల పాటు స్పర్శ్ లెప్రసీ అవగాహన కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు కుష్టురోగంపై సరైన అవగాహన కల్పించి, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ రెండు వారాల వ్యవధిలో గ్రామాలు, పట్టణాల్లో సర్వేలు, అవగాహన సభలు నిర్వహించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత పరీక్షలు, నివారణ చికిత్సలు సమగ్రంగా అందించాలని సూచించారు. కుష్టురోగం చర్మంపై మచ్చలు, స్పర్శ కోల్పోవడం, నరాల వాపు, కండరాల బలహీనత వంటి లక్షణాలతో కనిపిస్తుందని తెలిపారు. మైకోబాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందని, అయితే ముందస్తు గుర్తింపు, సరైన చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చని వివరించారు. ప్రతి పౌరుడు తన చుట్టూ ఉన్నవారికి అవగాహన కల్పించి, లక్షణాలు ఉన్నవారిని సమీప ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. కళాశాలలు, పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా కుష్టురోగంపై ఉన్న అపోహలు, కలంకాలను శాశ్వతంగా తొలగించవచ్చన్నారు. మహాత్మా గాంధీజీ కుష్టురోగుల సేవలో అహింస, మానవత్వాన్ని ఆచరించారని గుర్తు చేశారు. సబర్మతి, వర్ధా ఆశ్రమాల్లో గాంధీజీ తన సహచరులతో కలిసి కుష్టుగ్రస్తులకు వైద్య సేవలు, ఆహారం, సౌకర్యాలు అందించారని తెలిపారు. వ్యక్తిగతంగా వారి గాయాలను శుభ్రం చేస్తూ సేవ చేయడం ద్వారా సమాజంలోని అంటరానితనాన్ని ఛేదించారన్నారు. గాంధీజీ ప్రేరణతో స్థాపితమైన కుష్టు నివారక్ సంఘ్ కుష్టు నిర్మూలన, రోగుల సంరక్షణ కోసం విశేషంగా పనిచేసిందని, హరిజనోద్ధరణలో భాగంగా వారికి విద్య, ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. దీక్షలు, ప్రసంగాల ద్వారా కుష్టురోగులను స్పర్శించి సేవ చేయాలనే సందేశాన్ని దేశవ్యాప్తంగా వ్యాప్తి చేశారని చెప్పారు. కుష్టురోగ లక్షణాలు ఉన్నవారు తప్పకుండా పరీక్షలు నిర్వహించుకుని, ప్రభుత్వం చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎం అండ్ హెచ్ఓ, సీహెచ్‌వీ భరతలక్ష్మి, వైద్యులు రామానుజరావు, సుధాసూర్యనారాయణ రావు, రుద్దరాజు, డిపిఎంఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### కొబ్బరిలో భవిష్యత్తు

## కోనసీమకు ఆర్థిక బలం

### ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి లక్ష్యంతో కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వర్ణాంధ్ర వికసత్ భారత్ సంకల్ప సాధనలో భాగంగా ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి నానుడికి అనుగుణంగా కోనసీమ జిల్లాను కొబ్బరి ఆధారిత పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దే దిశగా అధికారులు అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ సూచించారు. కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల స్థాపన ద్వారా జిల్లాలో వార్షికంగా 15 శాతం వృద్ధిరేటు సాధించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. బుధవారం అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్?లో ఉద్యానవన, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో కొబ్బరి సాగు రైతుల ఆదాయవృద్ధికి, గ్రామీణ ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారిందని పేర్కొన్నారు. కేవలం దిగుబడిని పెంచడమే కాకుండా, సమర్థవంతమైన మార్కెటింగ్ విధానాల ద్వారా రైతులకు న్యాయమైన ధరలు లభించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మామిడికుదురు, ఉప్పలగుప్తం మండలాల్లో కొబ్బరి విలువ ఆధారిత ఎంఎస్ఎంఈ పార్కులు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులు, యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం శరవేగంగా చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, సరఫరా డిమాండ్ ధోరణులను అధ్యయనం చేస్తూ కొబ్బరి నూనె, కోప్రా, ఫైబర్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధిపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, సహకార సంఘాలను బలోపేతం చేయడం ద్వారా మధ్యవర్తులపై ఆధారాన్ని తగ్గించి, రైతులకు ప్రత్యక్ష మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. కొబ్బరి ఆధారిత పరిశ్రమల అభివృద్ధి వల్ల ఉపాధి అవకాశాలు పెరిగి, జిల్లా స్థూల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బీవీ రమణ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు కే. విశాలాక్షి, అంబాజీపేట మార్కెటింగ్ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### బోయిడి దుర్గారావుకు

## అక్షయ సేవా సంస్థ ఆర్థిక సాయం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం మండలం రావులపాలెం గ్రామానికి చెందిన బోయిడి దుర్గారావు గత సంవత్సరం తాపీ పని చేస్తుండగా బిల్డింగ్ పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడటంతో కాలు విరిగింది. వైద్యులు రాడ్లు వేసి శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం ఆ రాడ్లను తొలగించాల్సిన అవసరం ఉందని డాక్టర్లు సూచించారు.అయితే దుర్గారావు కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో అక్షయ సేవా సంస్థను సహాయం కోరారు. దీనికి స్పందించిన అక్షయ సేవా సంస్థ తరఫున రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. అదనంగా సంస్థ సభ్యులు కామగళ్ల మల్లేశం రూ.500 అందించడంతో మొత్తం రూ.10,500ను సంస్థ సభ్యులు దుర్గారావుకు సంస్థ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సహకరించిన సంస్థ సభ్యులందరికీ దుర్గారావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అక్షయ సేవా సంస్థ సేవా కార్యక్రమాలను గ్రామస్తులు అభినందించారు.

## ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ డైరీ క్యాలెండర్ల ఆవిష్కరణ



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

నిరంతరం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తూ విద్యారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీలు, క్యాలెండర్లను జిల్లా విద్యాశాఖ అధికారి పి.నాగేశ్వరరావు బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం అమలాపురంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా డీఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల పరిరక్షణలో ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ పాత్ర అభినందనీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రభుత్వానికి వాస్తవ పరిస్థితులను తెలియజేస్తున్న సంఘ సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ హనుమంతరావు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు షబ్బీర్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి షానవాజ్ హుస్సేన్ మాజింద్రాణి పాల్గొని డైరీలు, క్యాలెండర్లను ఉపాధ్యాయులు, ఉద్యోగులకు అందజేశారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సంఘం ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని, భవిష్యత్తులో మరింత బలమైన ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### కోనసీమ జిల్లా కలెక్టర్‌కి,

## కొత్తపేట రెవిన్యూ సబ్ డివిజన్ అధికారికి విన్నపం





**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ రహదారి 216 ఈ విస్తరణలో నివాస గృహాలు కోల్పోతున్నరు సుబ్రహ్మణ్యం రాజు, బాలకృష్ణ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నుండి రావులపాలెం వరకు జాతీయ రహదారి 216 ఈ రోడ్డు నిర్మాణం కొరకు వచ్చిన ప్రతిపాదనలో కొత్తపేట మండలం పలివెల వంతెన నుంచి రావులపాలెం మండలం వెదురేశ్వరం మీదుగా రాళ్ల గండి బొక్కవారిపాలెం. రోడ్డు వెడల్పు చేస్తున్నందువల్ల నష్టపోతున్నటువంటి నివాస గృహాల వారు వివిధ రకాల కమ్యూనిటీకి సంబంధించినటువంటి గృహాలు, స్కూల్ బిల్డింగ్స్, చర్చిలు, మసీదులు, హిందూ దేవాలయాలు, సన్న ,చిన్న కారు రైతుల భూములు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల నష్టపోతున్నామని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కి మరియు కొత్తపేట రెవిన్యూ సబ్ డివిజన్ అధికారి కి జాతీయ రహదారి 216ఈ విస్తరణలో నివాస గృహాలు కోల్పోతున్నవారు కోనసీమ జిల్లా కలెక్టర్ వారికి దరఖాస్తు ఇచ్చి ఉన్నారు ఈ యొక్క కార్యక్రమంలో దండు సుబ్రహ్మణ్యం రాజు ,గుమ్మడి బాలకృష్ణ ,గుమ్మడి చిరంజీవి, దొడ్డిపట్ల నాగచంద్ర, నరసింహారాజు, టీ ఆర్. రత్నరాజు ఖండవిల్లి రాజు,సుమారు 80 మంది కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించారు.

### టేకిశెట్టిపాలెం సఖినేటిపల్లి రోడ్డులో

## స్కూల్ బస్ ప్రమాదం

### డ్రైవర్ లైసెన్స్ బస్ పర్మిట్ సస్పెన్షన్



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

టేకిశెట్టిపాలెం సఖినేటిపల్లి రోడ్డులో సోమవారం ఉదయం భాష్యం స్కూల్‌కు చెందిన బస్ విద్యార్థులతో వెళ్తుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనపై జిల్లా రవాణా శాఖ కఠినంగా స్పందించింది. ఈ ప్రమాదానికి సంబంధించి బస్ డ్రైవర్ లైసెన్స్‌తో పాటు బస్ పర్మిట్‌ను మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు వెల్లడించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న రవాణాధికారి బస్ డ్రైవర్‌ను విచారించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా సరిపడా బస్సులు ఏర్పాటు చేసుకోవాలని స్కూల్ యాజమాన్యానికి సూచించారు. రహదారి భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఘటనలో విద్యార్థులకు ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా స్కూల్ బస్సుల నిర్వహణలో మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు సూచించారు.

### క్లీన్ అండ్ గ్రీన్ అవార్డుతో

## జిల్లాకే గర్వకారణంగా సర్ సివి రామన్ స్కూల్

### రాష్ట్రస్థాయి ఎంపికపై హర్షం – డైరెక్టర్ రవణం వేణుగోపాలరావుకు ఘన సన్మానం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో విద్యా రంగంలో తనదైన ముద్ర వేసుకుంటున్న సర్ సివి రామన్ స్కూల్ మరో ప్రతిష్టాత్మక ఘనతను సొంతం చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన క్లీన్ అండ్ గ్రీన్ గణతంత్ర దినోత్సవ అవార్డులలో జిల్లాలో ప్రథమ బహుమతి గెలుచుకుని అందరి ప్రశంసలు అందుకుంది. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ చేతుల మీదుగా ఈ అవార్డును సర్ సివి రామన్ స్కూల్ డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు స్వీకరించారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, హరిత కార్యక్రమాల్లో పాఠశాల చూపిన అంకితభావానికి గుర్తింపుగా ఈ అవార్డు లభించడం విశేషం. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడమే కాకుండా, రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు మరింత గర్వకారణంగా మారింది. ఈ సందర్భంగా తెదేపా అమలాపురం పట్టణ అధ్యక్షులు తిక్కిరెడి నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో డైరెక్టర్ రవణం వేణుగోపాలరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ సర్ సివి రామన్ స్కూల్‌కు జిల్లాలో ఎంతో మంచి ప్రతిష్ట ఉంది. విద్యతో పాటు విలువలు, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడం అభినందనీయం. జిల్లాలో ప్రథమ బహుమతి రావడం, రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది అని హర్షం వ్యక్తం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం బోర్డ్ మెంబర్ పట్నాల వెంకటరమణ, దిన్నా, గుమ్మల చిన్నా, దంగేటి చిన్ని, పాఠశాల ప్రిన్సిపల్ వి. కేశవ్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు. పర్యావరణ హిత కార్యక్రమాలతో విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందిస్తూ ముందుకు సాగుతున్న సర్ సివి రామన్ స్కూల్ ఈ అవార్డుతో మరింత ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేస్తోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ చీఫ్ షర్మిల కీలక ప్రతిపాదన..

# రాహుల్ గ్రీన్ సిగ్నల్.. ఇక రచ్చేనా?

ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల ఆ పార్టీ నేత, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని కలిశారు. ఇటీవల అమెరికా పర్యటన ముగించుకుని రాష్ట్రానికి వచ్చిన షర్మిల మంగళవారం ఢిల్లీలో రాహుల్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పనితీరుపై చర్చించడంతోపాటు రాహుల్ తో ఒక కీలక ప్రతిపాదన చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై కాంగ్రెస్ పార్టీ ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది. అయితే ఈ ఉద్యమాన్ని ఏపీ నుంచే ప్రారంభించాలని షర్మిల ప్రతిపాదించారు. దీనికి రాహుల్ కూడా అంగీకరించడంతో ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశం అవుతోంది. షర్మిల ప్రతిపాదనను రాహుల్ ఓకే చేయడం ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. గత ఎన్నికలకు ముందు ఏపీసీసీ చీఫ్ గా షర్మిల బాధ్యతలు చేపట్టారు. అయితే ఆమె ఎక్కువగా విపక్షాన్నే టార్గెట్ చేస్తున్నట్లు విమర్శలు ఎదుర్కొంటున్నారు. విపక్ష నేత జగన్ సైతం తన సోదరి షర్మిల తనపై ఎక్కువగా విమర్శలు చేయడాన్ని ఎత్తిచూపుతున్నారు. తాము అధికారంలో లేకపోయినా, షర్మిల తమనే నిందిస్తున్నారని జగన్, ఆయన పార్టీ నేతలు పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. అయితే ఈ విమర్శలపై పెద్దగా స్పందించని షర్మిల కొన్నాళ్లుగా రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్లు చెబుతున్నారు. దీనికి కారణం ఆమె విదేశీ పర్యటనే అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు. కారణం ఏదైనా కొన్ని రోజులుగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు మందగించాయని చెబుతున్నారు. దీంతో పార్టీ కార్యకర్తలు



నిస్తేజంగా మారిపోయారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో కాంగ్రెస్ పూర్తిగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. దాదాపు పదేళ్ల విరామం తర్వాత పార్టీ అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు స్వీకరించిన తర్వాత కాంగ్రెస్ లో కాస్త ఊపు కనిపించింది. మిత్రపక్షాలైన కమ్యూనిస్టులను కలుపుకుని పలు కార్యక్రమాల్లో షర్మిల దూకుడుగా వ్యవహరించి పొలిటికల్ గా అందరినీ ఆకర్షించారు. ఇదే ఊపులో ఆమె అధికార పక్షంపై కాస్త రాజీ ధోరణి ప్రదర్శిస్తున్నారనే విమర్శలు కొంత ఇబ్బందికరంగా మారాయి. అయితే అమెరికా పర్యటనకు ముందు ఈ విమర్శలు ఎక్కువగా వినిపించగా, షర్మిల విదేశీ పర్యటన ముగించుకుని వస్తూనే ఆ విమర్శలకు చెక్ చెప్పేలా అడుగులు వేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామీణులకు ఎంతో మేలు చేసే ఉపాధి హామీ పథకం పేరు మార్పుతోపాటు ఆ పథకం ఉనికే ప్రమాదంలో పడేలా కేంద్రం కొత్త చట్టాన్ని చేసిందని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ మార్పును తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. జాతీయ స్థాయిలో ఉద్యమానికి పిలుపునిచ్చింది. సరిగ్గా పార్టీ పిలుపును క్యాష్ చేసుకోవాలని భావించిన షర్మిల ఉపాధి హామీపై ఉద్యమాన్ని ఏపీ నుంచి ప్రారంభించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కోరారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని 20 ఏళ్ల క్రితం యూపీఏ ప్రభుత్వం ప్రారంభించింది. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఏపీలో అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామం నుంచి ఉపాధి పథకానికి శ్రీకారం చుట్టారు. దాదాపు రెండు దశాబ్దాల పాటు పేదలకు వరంలా పనిచేసిన పథకాన్ని ఎన్డీఏ ప్రభుత్వం నీరుగారుస్తోందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. దీనిపై రెండు కూటముల మధ్య కొన్నాళ్లుగా మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా నిరసనలు నిర్వహించాలని కాంగ్రెస్ పిలుపునివ్వగా, విపక్ష నేత రాహుల్ గాంధీ దేశవ్యాప్త యాత్రకు సిద్ధమని ప్రకటించారు. అయితే షర్మిల చాకచక్యంగా రాహుల్ ను ఏపీ నుంచి యాత్రకు ఆహ్వానించడం దేశవ్యాప్తంగా ఆకర్షించింది. ఇది ఒక విధంగా ఏపీలోని ప్రతిపక్షం వైసీపీపై పైచేయి సాధించినట్లేనని వ్యాఖ్యానిస్తున్నారు. విపక్షంగా ఇంతవరకు కేంద్ర పథకంపై వైసీపీ ఏం మాట్లాడలేదని అంటున్నారు. రాహుల్ రాష్ట్రం నుంచి ఉద్యమాన్ని ప్రారంభిస్తే క్షేత్రస్థాయిలో పార్టీ పట్ల సానుకూల వైఖరి పెంచే చర్యగా మారుతుందని అంటున్నారు. మొత్తానికి షర్మిల వ్యూహాత్మకంగా పావులు కదిపి రాహుల్ ను రాష్ట్రానికి రప్పించడంలో సక్సెస్ అయ్యారని అంటున్నారు.

30, 31 తేదీల్లో

# ఏలూరులో కోకో 2026 సమావేశం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏలూరు జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఏలూరులోని చింతలపూడి రోడ్డులోని బాలాజీ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ఈ నెల 30, 31 తేదీల్లో కోకో కాంక్లేవ్ - 2026 ను నిర్వహిస్తున్నారు. ఈ రెండు రోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు సమావేశాలను నిర్వహించ నున్నారు. కోకో పంట సాగు విస్తరణ, అభివృద్ధి, నాణ్యతా ప్రమాణాలు, ఉత్పత్తి, నిర్వహణను గురించి రైతులకు వివరించేందుకు ఈ సమావేసాలను ఏర్పాటు చేస్తున్నారు. రైతులు, కొనుగోలు దారులు సమావేశాలు, సామర్థ్యాల పెంపు కార్యక్రమాలు, రైతుల నైపుణ్యాలను మెరుగు పరచడం, నాణ్యత గల కోకో గింజల ఉత్పత్తిని పెంచే విధానాలు, సూచనలు వంటి పలు అంశాలపై కోకో సాగు నిపుణులు, జాతీయ సంస్థల అధిపతులు, వివిధ పరిశోధన సంస్థలు, సెంటర్ ఆఫ్ ఎక్సెన్స్ ప్రతినిధులు ఈ రెండు రోజుల కార్యక్రమాల్లో విస్తృతంగా చర్చించ నున్నారు. ఈ అవగాహనా సమావేశాలకు ఆసక్తి ఉన్న రైతులు అందరూ విధిగా హాజరు కావాలని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం , శంఖవరం మండలాల ఉద్యాన అధికారి కె.దివ్యశ్రీ పిలుపును ఇచ్చారు. పూర్తి వివరాలకు 8340861234 లో సంప్రదించాలి అన్నారు.

జగన్ భారీ హామీ...

# క్యాడర్ హ్యాపీ నా?



వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఒక భారీ హామీ అయితే క్యాడర్ కి ఇచ్చేశారు. తమ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తే పాలన మొత్తం కార్యకర్తల చేతుల మీదుగానే చేయిస్తామని. అంటే సంక్షేమ పథకాలు కానీ అభివృద్ధి కార్యక్రమాలు కానీ అంతా కార్యకర్తల మాటే క్షేత్ర స్థాయిలో చెల్లుబాటు అవుతుందని జగన్ హామీ ఇచ్చారు అన్న మాట. అంతే కార్యకర్తలు ఈ హామీతో ఫుల్ హ్యాపీయేనా అన్నది చర్చ సాగుతోంది. నిజం చెప్పాలి అంటే ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా కార్యకర్తలు తమకు తగిన ప్రాధాన్యత దక్కాలని కోరుకుంటారు. అది సహజం కూడా. కానీ ఒక్క వైసీపీ విషయంలోనే అది రివర్స్ అయింది.

**పదేళ్ళు మోసి మరీ :**

వైసీపీ కోసం క్యాడర్ ఏకంగా పదేళ్ల పాటు పార్టీని మోసారు. 2009లో వైఎస్సార్ మరణం తరువాత జగన్ వెంట చేరిన క్యాడర్ 2019 దాకా ఎటువంటి ఫలాపేక్ష లేకుండా పార్టీ కోసం ఆరుగాలం కష్టపడ్డారు. ఈ దశాబ్ద కాలంలో వారు ఎంతో కోల్పోయారు. తమ కాలం వయసు, ధనం అన్నీ కూడా పెట్టుబడిగా పెట్టారు. అంతే కాదు ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వంతో విభజన ఏపీలో టీడీపీ ప్రభుత్వంతో పోరాడి ఎన్ని ఇబ్బందులు పడాలో అన్నీ పడ్డారు. తీరా జగన్ సీఎం అయి వైసీపీ అధికారంలోకి వచ్చాక క్యాడర్ కి ఏమి దక్కింది అంటే ఆవేదన నిరాశ అన్నదే అని అంతా తీవ్రమైన మనో వేదనకు గురి అయ్యారు.

**తెలిసివచ్చిందా :** అయితే వైసీపీకి 2024 ఎన్నికల్లో తమ సొంత పార్టీ క్యాడర్ పూర్తిగా హ్యాండ్సప్ అని చేతులు ఎత్తేయడంతో అనేక బలమైన నియోజకవర్గాలు సైతం చేతులు జారి కూటమి వైపుగా టర్న్ కావడంతో తప్పు ఏమిటో తెలిసి వచ్చింది అని అంటున్నారు. 2024లో వైసీపీ ఓడినా ఇంతటి భారీ ఓటమి అయితే వచ్చి ఉండేది కాదని పార్టీ పెద్దలు భావిస్తున్నారు. క్యాడర్ జోక్యం చేసుకుని ఉంటే కచ్చితంగా యాభై దాకా అయినా అసెంబ్లీ సీట్లు దక్కేవని ఫలితంగా గౌరవప్రదమైన స్థానంలో పార్టీ ఉండేదని కూడా మథనం చెందుతూ వచ్చారు. అయితే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఇపుడు క్యాడర్ కి ఎంతో మేలు చేస్తామని పార్టీ పెద్దలు చెబుతున్నారు అని అంటున్నారు.

**వారికే అగ్ర తాంబూలం :** వైసీపీ పాలన 2.0 కనుక వస్తే క్యాడర్ కే పెద్ద పీట వేస్తామని చెబుతున్నారు. జగన్ స్వయంగా హామీ ఇచ్చారు. అసలు వాస్తవం ఏమిటో గ్రహించారు అని అంటున్నారు. అయితే క్యాడర్ దీని మీద ఎలా ఆలోచిస్తోంది అన్నది కూడా ముఖ్యమని అంటున్నారు. నిజానికి క్యాడర్ అయితే చాలా ఏళ్ళుగా పార్టీలో నిస్తేజంగా ఉంటూ వస్తోంది. పార్టీలో జీవగర్ర లాంటి క్యాడర్ సైలెంట్ ఈ రోజుకీ పార్టీ పెద్దలకు ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో జగన్ ఇవ్వాల్సింది హామీ కాదని నేరుగా క్యాడర్ తో భేటీలు పెట్టాలని అంతా సూచిస్తున్నారు.

**వారితోనే అంతా :** ఏ పార్టీకి అయినా నాయకులు అయితే బయటకు కనిపిస్తారు కానీ అసలైన జవసత్వాలు క్యాడర్ అని అంతా ఒప్పుకునే మాట. అందువల్ల క్యాడర్ విషయంలో మాటల వరకే కాకుండా వారిలో పూర్తి ఆత్మ విశ్వాసం నింపేలా వారిలో కొత్త ఉత్సాహం పెల్లుబుకేలా అధినాయకత్వం నేరుగా సమావేశాలు నిర్వహించాలని అంతా కోరుతున్నారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో నాయకులతో భేటీలు వేయడం మంచిదే కానీ వారితో పాటుగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కనీసం వంద మంది వరకూ కీలకమైన కార్యకర్తలను పిలిచి వారి మనసులో మాటను తెలుసుకోవాల్సి ఉందని సూచనలు వస్తున్నాయి. అంతే కాకుండా పార్టీ పరిస్థితి ఎలా ఉందో వారిని అడిగితేనే రియల్ ఫీడ్ బ్యాక్ కూడా వస్తుందని అంటున్నారు. మొత్తం మీద అయితే క్యాడర్ పట్టు కొమ్మ అని వారే తమకు పెద్ద దిక్కు అని వైసీపీ చెప్పడం వరకూ ఓకే అయినా క్యాడర్ ని కదిలించాలి అంటే ఇది సరిపోదని ఇంకా కావాల్సింది చేయాల్సింది చాలానే ఉందని అంటున్నారు. సో అదన్న మాట మ్యాటర్.

# చిత్రం చెప్పే కథ : సామాన్య కార్యకర్తలా సీఎం..!

ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీకి 4వ సారి సీఎం. తెలుగుదేశం పార్టీకి సర్వ సైన్యాధ్యక్షుడు చంద్రబాబు. 1995లో టీడీపీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు ఇప్పటికీ అదే హోదాలో కొనసాగుతున్నారు. రాష్ట్రంలో టీడీపీకి అధ్యక్షుడిగానే కాదు దేశంలో అత్యంత సుదీర్ఘకాలం పాటు ఒక పార్టీకి అధ్యక్షుడిగా పనిచేసిన రికార్డు చంద్రబాబుదే. అలాంటి నేత సామాన్య కార్యకర్తలా ప్రవర్తించడం అంటే విశేషమే. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ కమిటీల శిక్షణ తరగతుల్లో చంద్రబాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆధ్వర్యంలో మంగళవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో టీడీపీ పార్లమెంటు కమిటీల శిక్షణ తరగతులు జరిగాయి. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7.30 నిమిషాల వరకు ఈ కార్యక్రమం జరిగింది. మంత్రి నారా లోకేశ్ ఉదయం నుంచి పార్టీ కార్యాలయంలోనే



ఉండగా, సీఎం చంద్రబాబు సమావేశాల మధ్యలో ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. అయితే ఇలా వచ్చిన చంద్రబాబు సమావేశాన్ని ఉద్దేశించి కాసేపు ప్రసంగించి వెళ్లిపోలేదు. తాను కూడా ఒక సామాన్య కార్యకర్తగా అందరి మధ్య కూర్చొని ట్రైనర్లు ఏం చెబుతున్నారో శ్రద్ధగా తెలుసుకు న్నారు. మంగళగిరి పార్టీ ఆఫీసులో జరిగిన ఈ శిక్షణ తరగతులకు రాష్ట్రంలోని 25 పార్లమెంటు నియోజకవర్గాల నుంచి సుమారు 1050 మంది హాజరయ్యారు. వర్క్ షాపు జరుగుతున్న ప్రతి గదికి వెళ్లిన చంద్రబాబు చివరి వరుసలో కూర్చొని పార్టీ సీనియర్ నేతలు చెబుతున్న విషయాలను శ్రద్ధగా విన్నారు. నాలుగోసారి సీఎంగా పనిచేస్తున్నా, పార్టీ కార్యకర్తలా చంద్రబాబు తమ మధ్యే కూర్చోవడం తమకు స్ఫూర్తినిస్తోందని కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ శిక్షణ శిబిరంలో మంత్రి పయ్యావుల కేశవ్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ ఆవిర్భావంపై తరగతులు తీసుకునే బాధ్యతను మంత్రి కేశవ్ కు అప్పగించారు. దీనిపై కేశవ్ క్లాసు జరుగుతుండగా, చంద్రబాబు ఆ గదికి వెళ్లారు. పయ్యావుల ప్రసంగం చాలా ఆసక్తికరంగా ఉండటంతో చంద్రబాబు ఆ గదిలో చాలాసేపు ఉండిపోయారు. టీడీపీ ఆవిర్భావం నాటి పరిస్థితులు, పార్టీ వ్యవస్థాపకుడు అన్న ఎన్టీఆర్ కు ఉన్న జనాదరణ, లక్ష్మీపార్వతి ప్రవేశం, ఎన్టీఆర్ పదవీచ్యుతుడు కావడం, పార్టీ కార్యకర్తల నమ్మకాన్ని చంద్రబాబు దక్కించుకుని పార్టీని ముందుకు నడిపిన తీరుపై కేశవ్ చక్కగా వివరించారు. ఆర్థిక మంత్రి ప్రసంగాన్ని విన్న ముఖ్యమంత్రి చంద్రబాబు బాగా చెప్పారంటూ ప్రశంసించారు.

# రాష్ట్రం మీదుగా మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు..

ఏపీలో భవిష్యత్తులో మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు రానున్నాయి. ఈ మేరకు రైల్వేశాఖ ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు తాజాగా సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీలోని రైల్వే ప్రాజెక్టులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ ప్రజలకు కూటమి సర్కార్ శుభవార్త అందించింది. ఈ మేరకు తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా ఏపీలోని రైల్వే ప్రాజెక్టులపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులపై చర్చించారు. రాయలసీమ ప్రాంతాలను కోస్తాంధ్రలోని ప్రాంతాలతో అనుసంధానించేలా రైల్వే కనెక్టివిటీపై చర్చించారు. ఈ క్రమంలో రైల్వే అభివృద్ధి ప్రణాళికలపై అధికారులను అడిగి చంద్రబాబు వివరాలు తెలుసుకున్నారు. అలాగే పలు రైల్వే స్టేషన్లలో రద్దీని తగ్గించే అంశంపై చర్చించారు.

**ఈ లైన్లలో హైస్పీడ్ రైల్వే కారిడార్లు**

హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, చెన్నై-బెంగళూరు మార్గాల్లోని లైన్లను హైస్పీడ్ రైల్వే కారిడార్లుగా అభివృద్ధి చేయడంపై చంద్రబాబు చర్చించారు. దీనికి సంబంధించిన ప్రణాళికల గురించి అధికారులను అడిగి అన్ని వివరాలు తెలుసుకున్నారు. అటు విజయవాడ, రేణిగుంట, గుంటూరు, విశాఖపట్నం లాంటి ప్రధాన రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో ఇక్కడ రద్దీని తగ్గించే విషయంపై అధికారులను అడిగి తెలుసున్నారు. ఈ భేటీలో దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వే, దక్షిణ కోస్తా రైల్వే అధికారులు పాల్గొన్నారు.



ఏపీ మీదుగా హైస్పీడ్ కారిడార్


అటు హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్ ప్రాజెక్ట్, ఫ్యూచర్ సిటీ-అమరావతి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే మార్గంలో హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్ రైలు కనెక్టివిటీ ఉండాలని సూచించారు. ఈ రైలు నెట్‌వర్క్ ఏపీ మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. ఇక ఏపీలోని వివిధ పోర్టులను రైలు కనెక్టివిటీతో అనుసంధానం చేయడంపై చంద్రబాబు చర్చించారు. అలాగే తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాలకు చెందిన హింటర్ ల్యాండ్ నుంచి రైలు రవాణాపై రైల్వేశాఖ ఉన్నతాధికారులతో చంద్రబాబు చర్చలు జరిపారు.

# ఏపీలో అంతర్జాతీయ హంగులతో అతి పెద్ద ఇండోర్ స్టేడియం.. ఎక్కడంటే..?

విశాఖపట్నం ప్రజలకు గుడ్ న్యూస్. కూటమి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. అత్యాధునిక సౌకర్యాలతో నగరంలో అతిపెద్ద ఇండోర్ స్టేడియంను ప్రారంభించింది, క్రీడాకారులకు చెమటలు పట్టకుండా సెంట్రల్ ఏసీతో పాటు సీసీ కెమెరాలు వంటి సౌకర్యాలు ఇందులో ఉన్నాయి. తాజాగా ఈ స్టేడియం ప్రారంభమైంది. ఏపీలోకి క్రీడాకారులకు ఉపయోగపడేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మరో ఇండోర్ స్టేడియంను అందుబాటులోకి తెచ్చింది. ప్రధాన నగరమైన విశాఖపట్నంలో ఇండోర్ స్టేడియంను అంతర్జాతీయ హంగులతో తీసుకొచ్చింది. గతంలో ఉన్న స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంను అత్యాధునిక సౌకర్యాలతో ఆధునీకరించింది. గత కొంతకాలం నుంచి ఆధునీకరణ పనులు జరుగుతుండగా.. ఇప్పుడు అవి పూర్తి కావడంతో తాజాగా ప్రారంభించారు. దాదాపు రూ.16.90 కోట్ల ఖర్చుతో ఈ స్టేడియంను పున:నిర్మించారు. అభివృద్ధి పనులు పూర్తి కావడంతో తిరిగి ప్రారంభించారు.

**సెంట్రల్ ఏసీ ఏర్పాట్లు**

ఈ స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంను విశాఖపట్నం ఎంపీ భరత్? ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, విశాఖపట్నం మేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ స్టేడియంలో అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. సెంట్రల్



ఏసీ ఏర్పాటు చేశారు. అలాగే అత్యాధునిక ఫైర్ ఫైటింగ్ మెషీన్లు, సిట్టింగ్ ఏర్పాటు చేశారు. అలాగే ఆరు బ్యాడ్మింటన్ కోచ్?లతో పాటు స్టేడియం మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటుంది. దీని వల్ల స్టేడియంలో భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఈ స్టేడియంలో నామమాత్రపు ఫీజులు క్రీడాకారుల నుంచి వసూలు చేయనున్నారు. క్రీడాకారులపై ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ స్టేడియంలో ఒకేసారి 1750 మంది ప్రేక్షకుల కూర్చొనేలా సీటింగ్ సామర్థ్యం పెంచారు. ఇక ప్రమాదాలు జరగకుండా అధునాతన ఫైర్ ఫైటింగ్ యంత్రాలు ఏర్పాటు చేశారు.

**స్పోర్ట్ హబ్‌గా విశాఖ**

స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పున:ప్రారంభంలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ.. విశాఖపట్నంను స్పోర్ట్ హబ్?గా మారుస్తామని హామీ ఇచ్చారు. స్వర్ణ భారతి స్టేడియం అందులో భాగమేనని అన్నారు. ఈ స్టేడియం రాకతో క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని అన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలతో పాటు జాతీయ, అంతర్జాతీయ పోటీలో ఈ ఇండోర్ స్టేడియంలో నిర్మించుకోవచ్చని తెలిపారు. ఈ స్టేడియం క్రీడాకారులకు ఉపయోగపడుతుందని, తక్కువ ఫీజులతో సేవలు వినియోగించుకోవచ్చని చెప్పారు. క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయని, ప్రజలందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

విశ్వంవాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్

గురువారం, 29 జనవరి 2026
www.viswamvoice.com





బ్యాక్‌లాగ్ పోస్టులు, వసతి గృహాలు,

# ఎస్సీ సమస్యలపై చర్యలకు ఆదేశం

**ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌కు అర్జీలు స్వీకరణ - సత్వరం పరిష్కారం చూపాలి - అధికారులకు ఆదేశాలు**
**రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహర్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బ్యాక్‌లాగ్ పోస్టులు, వసతి గృహాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్యలకు ఆదేశాలు రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహర్ తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు మరియు ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అందిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు కె ఎస్ జవహర్ సూచిస్తూ,వాటిపై సత్వరంగా సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్సీ ఉద్యోగుల సమస్యలు, ప్రజల సామాజిక, ఆర్థిక సమస్యలు ఛైర్మన్‌కు వివరించగా, ముఖ్యంగా రాష్ట్రంలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రతి నెల ఆఖరి రోజున జరగవలసిన సివిల్ రైట్స్ డేను ప్రతి మండలంలోనూ, జిల్లాలోనూ అమలు చేయాలని వినతిపత్రాల్లో పేర్కొన్నారు. అలాగే ఎస్సీ వసతి గృహ విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచాలని, దాదాపు 600 ఎస్సీ వసతి గృహాలు ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందువల్ల తప్పనిసరిగా శాశ్వత భవనాలను నిర్మించాలని కోరారు. ఎస్సీ వసతి గృహాలలో సిబ్బంది కొరత అధికంగా ఉందని, పదవీ విరమణ చేసిన వెల్ఫేర్ ఆఫీసర్లు, అటెండర్లు, కుక్ పోస్టుల్లో నూతన ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని వినతిపత్రాల్లో పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్సీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.7,200 కోట్లను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. నూతనంగా ఏర్పడిన జిల్లాలలో డా. బీఆర్ అంబేద్కర్ భవనాలను నిర్మించాలని, అలాగే తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఏపీ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వ్యక్తిగత అర్జీలు సమర్పించిన వారిలో రాజమండ్రికి చెందిన జీ.దేవి తాను నివసిస్తున్న గృహానికి ఇంటి పన్ను, కుళాయి పన్ను చెల్లిస్తున్నప్పటికీ పట్టా ఇవ్వడం లేదని అర్జీ సమర్పించగా, తగు చర్యలు తీసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌కు ఛైర్మన్ సూచించారు. గోకవరం మండలం గుమ్మల్లదొడ్డి గ్రామానికి చెందిన కె. భీమరాజు తన వ్యవసాయ భూమికి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని, రాజమండ్రికి చెందిన గిరిధర్ తనకు చెందిన ఇసుక ర్యాంప్‌లో ప్రవేశించకుండా కొందరు అడ్డుకుంటున్నారని తగు చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించారు. అలాగే రాజమండ్రి రూరల్ బొమ్మూరు గ్రామానికి చెందిన ఎం. మంగాయమ్మ తన తండ్రి కోటి గ్రామంలో వీఆర్వోగా పనిచేస్తూ మరణించారని, తనకు కారుణ్య నియామకం కల్పించాలని అర్జీ సమర్పించగా, వాటిపై తగు చర్యలు తీసుకోవాలని ఛైర్మన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 47 మంది బాధితులు ఛైర్మన్‌కు అర్జీలు సమర్పించారు. అలాగే కల్లి సుబ్బాయమ్మ అనే విభిన్న ప్రతిభావంతురాలైన మహిళ ఉపాధి కల్పించాలని అర్జీతో ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకోగా, కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహర్ ఆమె వద్దకు స్వయంగా వెళ్లి అర్జీని స్వీకరించి, తగు చర్యలు తీసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఈ పర్యటనలో ఛైర్మన్ వెంట రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యదర్శి ఎస్. చిన్న రాముడు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎండీ. ఫయాజుద్దీన్, ఉమ్మడి ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.సత్యవతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ నాయకులు తాళ్లూరు బాబు రాజేంద్ర ప్రసాద్, కోరుకొండ చిరంజీవి, పసలపూడి సుభాష్ చంద్రబోస్, ఆకుమర్తి చిన్న, దార యేసు రత్నం, చిడిపి స్టాలిన్, ఉసురుమర్తి రామారావు, జంగం సుబ్బారావు, మోత నాగలక్ష్మి, అజ్జరపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వారాహిదేవి అమ్మవారి ఆశీస్సులు

# అందుకున్న కంబాల శ్రీనివాసరావు

**ఘనంగా శ్రీశ్రీశ్రీ వారాహిదేవి పీఠం ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాలు**



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరు గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ వారాహి దేవి పీఠంలో ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆజ్ఞాపీఠికతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల జనవరి 26 (సోమవారం) నుండి జనవరి 28 (బుధవారం) వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగనున్నాయి. ఇందులో శ్రీ సుదర్శన యజ్ఞం, హోమాలు, విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 28న ప్రత్యేక అభిషేకం, మహా మంగళహారతి కార్యక్రమాలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవి అనుగ్రహం పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు. శాంతి, ఐశ్వర్యం, సమృద్ధి కలగాలని ఆకాంక్షతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని గ్రామస్తులు పిలుపునిచ్చారు. కొంతమూరులో కొలువున్న వారాహి దేవి అమ్మవారి పీఠము ప్రథమ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. భక్తుల సమక్షంలో అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలు అందరికీ లభించి, ప్రజలందరూ సుఖశాంతులతో, ఐశ్వర్యంతో జీవించాలని ఆకాంక్షించారు. వారాహి దేవి ఆశీస్సులతో ధర్మ పరిరక్షణ మరింత బలపడాలని ఆయన పేర్కొన్నారు. బిజెపి అంటే హిందీ ముస్లిం క్రైస్తవుల పార్టీ అని అన్ని పార్టీల కలయిక బీజేపీ అని, కష్టాల్లో ఉన్న వారికి అండగా హైందవధర్మం కాపాడుకుంటూ ముందుకు సాగుతున్నామని ఆయన అన్నారు. కోరుకొండ దేవాలయానికి 25 లక్షలు, మహిళలకు రెండు లక్షల రూపులు, 250 కుటుంబాలకు ప్రతినెల పది నుంచి 20 కేజీల బియ్యం మూడు నియోజకవర్గాల పంపిణీ చేస్తున్నవని ఆయన అన్నారు. కాన్సర్ తో బాధ పడుతున్న విద్యార్థికి లక్ష రూపాయలు సహాయం చేసానని ఆయన తెలిపారు. కుల మతాలకు అతీతంగా ఆలయాలు ధర్మాలు కాపాడుకోవడం మన బాధ్యతని ఆర్ఎస్ఎస్ లో చేరడం, హిందూ ఆలయాలను ధర్మాలు కాపాడుకోవటం మన బాధ్యతని ఆయన మరోసారి తెలియజేశారు. ఎవరన్నా హిందూ ధర్మాలని, దేవాలయాల గురించి తప్పుగా మాట్లాడితే ఊరుకునేది లేదని అటువంటి వారిపై వెంటనే చర్యలు తీసుకుంటానని ఆ సమాచారం మాకు తెలియజేయాలని ఆయన కోరారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ వారు మనం ధర్మాన్ని పాడు చేసే విధంగా కుట్ర పన్నుతుందని అలాంటివారు ఎవరైనా ఉంటే నాకు సమాచారం తెలియజేయాలి కోరారు. ప్రస్తుతానికి ఈ ఆలయానికి లక్ష రూపాయలు విరాళము అందించామని ఆయన తెలిపారు.

శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి

# నిజరూప దర్శనానికి పోటెత్తిన భక్తులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక కోరుకొండ రోడ్డులోని సింహాచలనగర్ శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో శ్రీ మదుభయ వేదాన్తా చార్య పీఠం ట్రస్టు, శ్రీరంగం ఆధ్వర్యాన శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీ శ్రీ త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి మంగళాశాసనాలతో చందన యాత్ర మహోత్సవాలలో భాగంగా శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి ట్రస్ట్, ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం దంపతులు, కాలెపు నాగేశ్వరరావు దంపతుల పర్యవేక్షణలో బుధవారం తెల్లవారుఝామున 3గంటలకు సుప్రభాతం, ఆరాధన, చందనోత్తరణ, సువర్ణ పుష్పార్చన జరిగాయి. ఉదయం 6నుంచి ప్రారంభమైన నిజరూప దర్శన సేవలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు రాజకీయ నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి 8గంటలకు నిజరూప స్వామికి అష్టోత్తర శత కలశాభిషేకం, చందన సమర్పణ,తీర్థ గోష్టి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

# కార్యకర్తలకు టీడీపీ అండగా నిలుస్తుంది : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

**- మృతి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ. 5,00,000 చెక్కు అందజేత**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తన కార్యకర్తలకు అండగా నిలుస్తుందని, కష్టకాలంలో సహకారం అందిస్తుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేసినవారికి, మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు పక్షపాతం లేకుండా సహాయం అందిస్తుందని తెలిపారు. స్థానిక 9వ డివిజన్ బర్మా కాలనీ 3వ వీధికి చెందిన టీడీపీ కార్యకర్త బత్తిన సంతోష్ ప్రమాదవశాత్తూ ఇటీవల మృతి చెందారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, సంతోష్ పార్టీ సభ్యత్వ వివరాలతో కేంద్ర కార్యాలయానికి సమాచారం అందించి ప్రమాద బీమా మంజూరు చేయించారు. ఈ రోజు హౌసింగ్ బోర్డులో సంతోష్ తల్లి వద్ద ఉన్న సతీమణి భవ్య భారతికి రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. సంతోష్ మృతి పట్ల విచారం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, పార్టీకి విధేయుడై పని చేసిన మంచి కార్యకర్తను కోల్పోవడం బాధాకరమని అన్నారు. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో గతంలో ప్రమాదాల్లో మరో నలుగురు కార్యకర్తలకు కూడా రూ. 5 లక్షల చొప్పున బీమా చెక్కులు అందజేసినట్లు గుర్తు చేశారు. కష్టాల్లో ఉన్న కార్యకర్తలను ఆదుకోవడమే టీడీపీ సంప్రదాయమని, భవిష్యత్తులో ఏ సహకారం కావాలన్నా అందిస్తామని భవ్య భారతికి భరోసా ఇచ్చారు. నగర మహిళా కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లారీ యజమానులు బ్రతుకు తెరువు నిలపాలి

**- లారీ ఓనర్స్ పరిస్థితి అగమ్యగోచరం - పెంచిన లారీ ఫిట్నెస్ చార్జీలు తగ్గించాలి..**
**- లారీల ఫిట్నెస్ చార్జీలు తగ్గిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చెయ్యాలి**
**- అసోసియేషన్ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ రావు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ది రాజమండ్రి లారీ ఓనర్స్ అసోసియేషన్ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆళ్ల గోవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ యూనియన్ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రస్తుతం లారీ యజమానుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని, చాలా మంది లారీ యజమానులు వ్యాపారం లేక తమ లారీలను పాత ఇనుప సామానులకు స్క్రాప్ రేటుకే అమ్మివేశారని తెలిపారు. గత ప్రభుత్వం విధించిన గ్రీన్ టాక్స్ ను కూటమి ప్రభుత్వం తగ్గించినట్లే తగ్గించి, ఇప్పటివరకు లేని ఫిట్నెస్ ఛార్జిలపై జీఎస్టీని విధించి తమ నడ్డిలను విరిచిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న లారీ ఓనర్ల పరిస్థితి ఏమీ బాగోలేదని, లారీలకు సరైన కిరాయిలు లేక మరియు లోడింగ్ లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటీవల పెంచిన లారీల ఫిట్నెస్ చార్జీలు తమకు గుదిబండలగా మారాయని, పెంచిన ఫిట్నెస్ చార్జీలు తగ్గించమని లారీ ఓనర్స్ అసోసియేషన్లు అన్నీ కూటమి ప్రభుత్వానికి విన్నవించుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. తాము పడుతున్న ఇబ్బందులు గుర్తించి తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ, ఐటి శాఖ మంత్రి నారాలోకేష్ పెంచిన ఫిట్నెస్ చార్జీలు తగ్గిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ రవాణా మరియు రోడ్డు భవనాలు శాఖ 22122025 (టి.ఆర్.పి.-1) విభాగం ద్వారా మెమో విడుదల చేసినారని, కానీ ఇది జరిగి నెలరోజులు దాటిన ఇప్పటి వరకు ఫిట్నెస్ చార్జీలు తగ్గలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పలు లారీ యూనియన్ల సభ్యులు పాల్గొన్నారు.

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే

# సకాలంలో పూర్తి చేయండి

**స్వర్ణ వార్డు సచివాలయాల మేనేజర్ దంటు శ్రీనివాస్**



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను ఎటువంటి అవకతవకలు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని వార్డు సచివాలయాల మేనేజర్ దంటు శ్రీనివాస్ అన్నారు. మండపేట పురపాలక సంఘ కార్యాలయంలో కమీషనరు టి.వి.రంగారావు ఆదేశాల మేరకు స్వర్ణ వార్డు సచివాలయాల మేనేజరు దంటు.ఆర్.ఆర్.యస్. శ్రీనివాసు పర్యవేక్షణలో వార్డు సెక్రటరీలతో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వర్ణ వార్డు సచివాలయాల మేనేజరు శ్రీనివాసు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశించిన ఈ యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ను వార్డు సెక్రటరీ అందరు క్లస్టర్ల వారీగా ప్రతి ఇంటింటికి వెళ్ళి పూర్తిస్థాయిలో ఈ సర్వేను నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని పేర్కొన్నారు. సర్వే క్లస్టర్ మాపింగ్ ఈ సర్వే సంబంధించి ఏమైనా టెక్నికల్ సమస్యలు మరియేతర సందేహాలు ఉంటే వెంటనే కార్యాలయంకు తెలియజేయాలని కోరారు. తద్వారా వెంటనే ఆ సమస్యలను జిల్లా అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామని చెప్పారు. కమీషనరు టీవీ రంగారావు మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ స్వర్ణ వార్డు సెక్రటరీలు ఇళ్ళకు వచ్చి సర్వే చేస్తారన్నారు. ప్రతి ఒక్కరు ఈ సర్వే తప్పని సరిగా చేయించుకోవాలన్నారు.

# గ్రామకమిటీలు త్వరగా పూర్తి చెయ్యాలి : జక్కంపూడి

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గంలో గ్రామ కమిటీల నియామకం త్వరగా పూర్తి చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం స్వగృహంలో నియోజకవర్గంలోని డివిజన్ కోఆర్డినేటర్లతో సమావేశంలో, గ్రామకమిటీల నియామకంపై చర్చించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఐదారు గ్రామాలు కలిపి ఒక డివిజన్ కింద ఏర్పాటు చేశామని, ప్రతి డివిజన్‌కి డివిజన్ ఇంచార్జిని నియమించి, ప్రతి డివిజన్‌కి ఇద్దరు సీనియర్ లీడర్లుని అబ్జర్వర్‌గా నియమిస్తున్నామన్నారు. వీరి సారథ్యంలో గ్రామకమిటీల నియామకం జరుగుతుందని, రానున్న రోజుల్లో గ్రామ కమిటీలు చాల కీలకమని,గ్రామాల్లో అందరిని సమన్వయము చేసుకుంటూ గ్రామకమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు.డివిజన్ కోఆర్డినేటర్లకు ఆయా డివిజన్ కి సంబందించిన కిట్ లను జక్కంపూడి రాజా చేతుల మీదుగా అందజేసి, పార్టీ కమిటీల నియామకం త్వరగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జక్కంపూడి రాజా, నీరుకొండ బాబ్జి, అడబాల జగదీష్,యడ్ల గంగా సురేష్, బోడపాటి కొండబాబు, నియోజకవర్గ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇనుగంటివారిపేట గ్రామంలో లక్ష్మీ గణపతి ఆలయంలో పక్ష దీక్ష



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం ఇనుగంటివారిపేట గ్రామంలో వేంచేసియున్న లక్ష్మీ గణపతి ఆలయంలో సూర్యనారాయణ (ఢిల్లీ పంతులుగారు), వడలి శివశర్మ, లక్ష్మీనారాయణశర్మ, వారి ఆధ్వర్యంలో పక్ష దీక్షగా అనగా 15రోజులపాటు విశేషముగా సూర్య ఆరాధన జరుపబడు చున్నది. అందులో భాగంగా భీష్మ ఏకాదశి రోజున ఉచిత సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతములు చేయుటకు నిశ్చయించి ఉన్నారు. ఈ కార్యక్రమము ఫిబ్రవరి 1 వరకు మాఘ పౌర్ణమి వరకు జరుగుచున్నది. ఆరోజు మహా పూర్ణాహుతి జరుగును. కావున ఈ కార్యక్రమాన్ని దర్శించి సూర్య అనుగ్రహం ద్వారా ఆయురారోగ్య ఐశ్వర్యాలు పొందవలసిందిగా కోరుచున్నాము.

శ్రీ జనార్ధన స్వామిరథోత్సవం సందర్భంగా


# నేడు విద్యుత్ సరఫరా అంతరాయం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట లో శ్రీ జనార్ధన అగస్తేశ్వర స్వామి వారి రథోత్సవం సందర్భంగా నేడు మండపేట టౌన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. రథాన్ని రథం సెంటర్ నుండి కలువపువ్వు సెంటర్లో వెంకటేశ్వర స్వామి గుడి వద్దకు తీసుకువెళ్తారు . దీంతో గురువారం మధ్యాహ్నం ఒంటి గంటల నుండి రాత్రి ఏడు గంటల వరకు మండపేట టౌన్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.జనార్ధన స్వామి (రథోత్సవం) సందర్భంగా కేపీ రోడ్ లో విద్యుత్ వైర్లు తొలగిస్తారు. కేపీ రోడ్డు, రావిచేట్టువద్ద, తెనుకలపేట, బురుగుంట చెరువు వద్ద,మెయిన్ రోడ్డు, తర్వాణి పేట, పోలీస్ స్టేషన్ రోడ్డు, సైదుల పేట, గాంధీ నగరం, కలవపువ్వు సెంటర్, మున్సిపాల్ ఆఫీస్ రోడ్డు, నాళం వారి వీధి, సంకా వారి వీధి,రథం సెంటర్, వల్లూరి వారి వీధి, గవర్నమెంట్ హాస్పటల్ వెనుక వీధి, గౌరీశంకర్ వీధి, సంగం పుంత రోడ్డు, పార్థసారథి నగర్, కరాచీ సెంటర్, ఏడిద రోడ్డు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని మండపేట ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏం మూని తెలిపారు.విద్యుత్ సరఫరాలో అంతరాయంకు పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

మాజీ ఎంపీపీ సత్యవేణిను

# పరామర్శించిన రెడ్డి రాధాకృష్ణ



**కపిలేశ్వరపురం మండలం, విశ్వంవాయిస్ న్యూస్ :** కపిలేశ్వరపురం మండల మాజీ ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అత్తయ్య మేడిశెట్టి సత్యవతి మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, టేకి గ్రామంలో ఉన్న వారి గృహంలో బుధవారం నిర్వహించిన దశదిన కార్యక్రమంలో వైసీపీ రైతు విభాగం రాష్ట్ర కన్వీనర్, మండపేట పుర పాలక సంఘం కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమం లో మండపేట సొసైటీ మాజీ అధ్యక్షులు పెంకే గంగాధర్, నదురబాధ సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు, దేవస్థానం మాజీ ఛైర్మన్ సూరంపూడి సత్య ప్రసాద్, నాయకులు వాసంశెట్టి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి

# విజన్- 3 లక్ష్యాలు ఉపకరిస్తాయి : ఏపీఎం జిలాని



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విజన్- 3 లక్ష్యాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఏపీఎం జిలాని తెలిపారు. బుధవారం కోరుకొండ మండలం వనరుల కార్యాలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న విజన్ -3 లక్ష్యాలపై బిక్కవోలు, రాజానగరం, కోరుకొండ ఏపీఎంలు అవగాహన కల్పించారు. సంఘ సభ్యులు, గ్రామ, మండల సమైక్య ఆధ్వర్యంలో సంఘ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సభ్యుల అభ్యున్నతికి భవిష్యత్తు కార్యాచరణ పైన అవగాహన కల్పిస్తున్నామన్నారు. శుక్రవారంతో విజన్- 3 అవగాహన కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు జిలాని, శ్రీనివాస్, సునీత, మహాలక్ష్మి, సీసీలు, ఎమ్మెస్ ఏలు, అకౌంటెంట్లు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### అంతర్జాతీయంగా యుద్ధ సంక్షోభాలున్నప్పటికీ

# భారత్ అభివృద్ధి కొనసాగుతోంది : రాష్ట్రపతి ముర్ము



పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం చేశారు. దేశం వేగంగా అభివృద్ధి చెందుతూ వికసిత్ భారత్ వైపు వేగంగా అడుగులు వేస్తోందన్నారు. తమ ప్రభుత్వం నిజాయితీతో కూడిన పారదర్శక పాలన అందిస్తుస్తోందని, వెనకబడిన వర్గాల అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం చేశారు. దేశం వేగంగా అభివృద్ధి చెందుతూ వికసిత్ భారత్ వైపు వేగంగా అడుగులు వేస్తోందన్నారు. తమ ప్రభుత్వం నిజాయితీతో కూడిన పారదర్శక పాలన అందిస్తుస్తోందని, వెనకబడిన వర్గాల అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అన్నారు. జనవరి 28, 2026న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కీలక ప్రసంగం చేశారు. "భారతదేశం ప్రతి రంగంలోనూ అభివృద్ధి చెందుతోంది. స్వావలంబన జీవితాన్ని గడపకుండా స్వాతంత్ర్యం అసంపూర్ణంగా ఉంటుంది. గత 11 సంవత్సరాలుగా దేశ ఆర్థిక పరిస్థితి గణనీయంగా బలపడింది. ద్రవ్యోల్బణాన్ని తక్కువగా ఉంచడంలో ఈ రికార్డును కొనసాగించాము. ఇది మధ్యతరగతి, పేదలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చింది." అన్నారు. ఆపరేషన్ సింధూర్ గురించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రస్తావించారు. "భారత సైన్యం ధైర్యం, పరాక్రమాన్ని మనం చూశాము. ఉగ్రవాద స్థావరం నాశనం చేశాము. భవిష్యత్తులో ఉగ్రవాద దాడులకు ప్రతిస్పందన దృఢంగా, నిర్ణయాత్మకంగా ఉంటుంది. సింధు జల ఒప్పందం కూడా ఇందులో భాగమే" అని అన్నారు. మావోయిస్టుల గురించి మాట్లాడుతూ, మావోయిస్టు ఉగ్రవాదులపై నిర్ణయాత్మక చర్య తీసుకున్నామని రాష్ట్రపతి ముర్ము అన్నారు. నేడు, మావోయిస్టు ఉగ్రవాదుల సంఖ్య 126 నుండి 8 జిల్లాలకు తగ్గింది. కేవలం 3 జిల్లాలు మాత్రమే తీవ్రంగా ప్రభావితమయ్యాయి. 2,000 మందికి పైగా మావోయిస్టులు లొంగిపోయారు. దేశం నుండి ఉగ్రవాదం పూర్తిగా నిర్మూలించే రోజు ఎంతో దూరంలో లేదు. "భారతదేశం సౌర విద్యుత్ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోంది. రెండు మిలియన్ల సౌర వ్యవస్థలను ఏర్పాటు చేశారు, లక్షలాది కుటుంబాల ఇళ్లలో విద్యుత్ ఉత్పత్తిని పెంచారు. గత 11 సంవత్సరాలలో ఈశాన్యంలో 7,200 కు పైగా రహదారులు నిర్మించారు. రైల్వే అభివృద్ధిలో రూ. 80,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టారు. ఈ దశాబ్దం ఈశాన్య భద్రతకు కీలకమైనది. గిరిజన ప్రాంతాల్లోని 20,000 కు పైగా గ్రామాలు అభివృద్ధికి అనుసంధానించాము. ఎస్సీ విద్యార్థులకు రూ. 42,000 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం జరుగుతోంది. నా ప్రభుత్వం సంపన్న రైతును అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యంగా భావిస్తుంది." అని రాష్ట్రపతి పేర్కొన్నారు. "ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ప్రారంభించడం జరిగింది. దీని ద్వారా ఇప్పటివరకు 4 లక్షల కోట్ల రూపాయలు అందించడం జరిగింది. దేశంలో నూనె గింజల పంటల ఉత్పత్తి కూడా పెరిగింది. పశుసంవర్ధకం, మత్స్య సంపద, తేనెటీగల పెంపకం కూడా సమగ్రంగా వృద్ధి చెందుతోంది. మత్స్యకారులకు ప్రయోజనం చేకూర్చేలా కొత్త విధానాన్ని రూపొందించారు. 2014తో పోలిస్తే, మత్స్య సంపద 105 శాతం పెరిగింది. దేశంలో ఆహార ప్రాసెసింగ్ సామర్థ్యం 20 శాతం పెరిగింది" అని రాష్ట్రపతి అన్నారు. "దేశంలోని పౌరులందరీ సమాన హక్కులు కల్పించడం ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. నా ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక పథకాలను రూపొందించింది. 10 కోట్ల మంది మహిళలు స్వయం సహాయక సంఘాలతో అనుసంధానించడం జరిగింది. 3 కోట్ల మంది మహిళలను అనుసంధానించడమే లక్ష్యం, అందులో 6 మిలియన్లకు పైగా మహిళలు లఖ్‌పతి దీదీలుగా మారారు. డ్రోన్ దీదీ కూడా వేగంగా అభివృద్ధి చెందుతోంది" అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.

### ఈశా ఫౌండేషన్ శ్మశానవాటిక నిర్మాణానికి

# వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్ కొట్టివేత



ఈశా ఫౌండేషన్ శ్మశానవాటిక నిర్మాణానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం, 90 మీటర్ల దూర నిబంధన లైసెన్సింగ్‌ను నిషేధించదని కోర్టు స్పష్టం చేసింది. అయితే, ఇక్కరై బోలువంపట్టి గ్రామ పంచాయతీ ఉత్తర్వులపై దాఖలైన మూడు రిట్ పిటిషన్లను కోర్టు ఇంకా విచారిస్తోంది. లైసెన్స్ పొందిన ప్రాంతంలో మాత్రమే అంత్యక్రియలు నిర్వహించాలని ఆదేశించింది. ఈశా ఫౌండేషన్ శ్మశానవాటిక నిర్మాణానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చింది. ఈషా ఫౌండేషన్ కాలభైరవర్ ధగన మండపం నిర్మాణాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు ఇటీవల కొట్టివేసింది. తమిళనాడు గ్రామ పంచాయతీ నిబంధనలు ప్రకారం.. నివాస స్థలం లేదా తాగునీటి సరఫరా ఉన్న ప్రాంతాల నుంచి సుమారు 90 మీటర్ల లోపు శ్మశాన వాటికకు లైసెన్స్ మంజూరు చేయడాన్ని నిషేధించలేదని చీఫ్ జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ , జస్టిస్ జి. అరుళ్ మురుగన్ లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. నిబంధనల ప్రకారం, గ్రామ పంచాయతీ నుండి లైసెన్స్ పొందడం మాత్రమే ముందస్తు అవసరం అని కోర్టు స్పష్టం చేసింది.

### చిత్తు కాగితాల్లో

# సర్కార్ బడి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం!



గణతంత్ర దినోత్సవం నాడు ఓ పాఠశాలలోని విద్యార్థులకు అధికారులు చిత్తు కాగితాల్లో మధ్యాహ్నం భోజనం అందించారు. నేలపై కూర్చోబెట్టి.. చిత్తు కాగితాల్లో పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్?గా మారింది. ఈ దారుణ ఘటన ఎక్కడ జరిగిందంటే.. రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా ఓ పాఠశాల బడి పిల్లలకు అధికారులు చిత్తు కాగితాల్లో మధ్యాహ్నం భోజనం అందించారు. నేలపై కూర్చోబెట్టి.. చిత్తు కాగితాల్లో పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ దారుణ ఘటన మధ్యప్రదేశ్‌లోని మైహార్ జిల్లాల్లో జనవరి 26న గణతంత్ర దినోత్సవ విందు సందర్భంగా చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. మధ్యప్రదేశ్‌లో మైహార్ జిల్లాలో జనవరి 26వ తేదీన గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పూరీ, హల్వాను మధ్యాహ్న భోజనంలో భాగంగా అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే పిల్లలకు ప్లేట్లకు బదులుగా చిత్తు కాగితాల ముక్కలు, పాఠ్యా పుస్తకాల నుంచి చింపిన పేపర్లను అందించి.. వాటిల్లో ప్రత్యేక మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. ఈ ఇందుకు సంబంధించిన వీడియో మంగళవారం సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడంతో అది కాస్తా వైరల్‌గా మారింది. ఈ ఘటన మహిర్ జిల్లా భాటిగ్వన్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. దీనిపై అనేక వర్గాల నుంచి విమర్శలు రావడంతో జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. జిల్లా ప్రాజెక్టు సమన్వయకర్త విష్ణు త్రిపాఠి ఈ సంఘటనపై దర్యాప్తు నిర్వహించి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. దర్యాప్తు నివేదిక ఆధారంగా పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ సునీల్ కుమార్ త్రిపాఠిని జిల్లా కలెక్టర్ కమిషనర్ రేవా సస్పెండ్ చేశారు. అంతేకాకుండా స్థానిక బ్లాక్ రిసోర్స్ కోఆర్డినేటర్ జనవరి నెల జీతం తొలగించారు. జిల్లా పంచాయతీలో మధ్యాహ్న భోజన పథకం బాధ్యత వహించే అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో పిల్లల పరిశుభ్రత, గౌరవం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకుండా చూసుకోవాలని కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏదైనా లోపం తలెత్తితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక ఈ వీడియోను ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు సోషల్ మీడియాలో షేర్ చేసి ఆ రాష్ట్ర ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. ఇది విద్యార్థులను మాత్రమే కాకుండా విద్యా వ్యవస్థను కూడా అవమానించడమేనని అభివర్ణించారు.

# వృద్ధాప్యంలో తిండి పెట్టని కొడుకులు..

### ఆస్తి మొత్తం పంచాయతీకి రాసిన తండ్రి! ఎక్కడంటే..



కాలం వేగంగా మారుతుంది. మనుషుల్లోనూ మానవత్వం తడారిపోతుంది. తల్లికి బిడ్డ బరువవుతుంది. పిల్లలకు కన్నోళ్లు కానివారవుతున్నారు. బ్రహ్మంగారు చెప్పినట్లు మానబంధాలన్నీ తలకిందులవుతున్నాయి. తాజాగా ఇలాంటి షాకింగ్ ఘటన ఒకటి తెలంగాణలోని హనుమకొండలో చోటు చేసుకుంది. వృద్ధాప్యంలో పిల్లల అండ కోసం ఎదురు చూసిన తండ్రికి నిరాశ ఎదురైంది. దీంతో అతడు కఠిన నిర్ణయం తీసుకున్నాడు.. పిల్లల్ని కని, పెంచి, వారిని ప్రయోజకులను చేస్తే.. వయోప్రాయంలో కన్నోళ్లకు పట్టెడన్నం పెట్టడానికి ఆ కొడుకులకు మనసు రాలేదు. అంతే.. చిర్రెత్తుకొచ్చిన తండ్రి తన యావదాస్తిని ఊరి పంచాయితీకి రాసిచ్చి.. మీసం మెలేశాడు. ఈ సంఘటన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికల్?పేటలో వెలుగు చూసింది. వివరాల్లోకెళ్తే.. జిల్లాలోని ఎల్కతుర్తి మండలం పెంచికల్?పేట గ్రామంకి చెందిన పూజారి నాగిళ్ల వెంకటేశ్వర్లుకి భార్య, ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. భీమదేవరపల్లి మండలం కొప్పూర్‌కు చెందిన వెంకటేశ్వర్లు 50 ఏళ్ల క్రితం పెంచికల్ పేటలోని దేవాలయానికి పూజారిగా వచ్చారు. ఆ సమయంలో అతని జీవనోపాధి కోసం గ్రామ పెద్దలు 4.38 ఎకరాల భూమిని సాగుకోసం కేటాయించారు. దీంతో అప్పటినుంచి వెంకటేశ్వర్లు పౌరోహిత్యం చేసుకుంటూ.. ఆ భూమిలో పంటలు పండిస్తూ కుటంబాన్ని పోషించుకుంటున్నాడు. కుమారులు, కుమార్తెకు వివాహం జరిపించాడు. అయితే ఇటీవల వెంటకేశ్వర్లు భార్య మరణించింది. ఇద్దరు కుమారులు బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. దీంతో వెంకవేశ్వర్లు బాగోగులు చూసుకునే వారు కరువయ్యారు. వృద్ధాప్యంలోకి అడుగుపెట్టిన తనను పోషించేవారులేక తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే గ్రామ ఆలయంలో మరో పూజారిని నియమించారు. దీంతో వెంకటేశ్వర్లు షాకింగ్ నిర్ణయం తీసుకున్నాడు. కొడుకులు తనను పోషించడం లేదని భావించిన ఆయన గతంలో గ్రామస్తులు తనకు కేటాయించిన భూమిని తిరిగి గ్రామ పంచాయితీకే ఇచ్చేందుకు సిద్ధపడ్డాడు. ఈక్రమంలో గురువారం గ్రామసభ ఏర్పాటు చేసి, తన అసైన్డ్ భూమిని తిరిగి గ్రామపంచాయతీకే ఇస్తున్నట్లు కాగితాలపై సంతకం చేశాడు. వెంకటేశ్వర్లు నిర్ణయంతో అటు కొడుకులు, ఇటు గ్రామస్థులు అంతా ఆశ్చర్యపోయారు.

# అజిత్ పవార్ ప్రయాణించిన విమానానికి చీకటి చరిత్ర..!




మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో మరణించారు. ఆయన ప్రయాణించిన లియర్‌జెట్ 45 విమానం ల్యాండింగ్ సమయంలో కూలిపోయింది. ఈ దుర్ఘటనలో మొత్తం ఆరుగురు మరణించారు. 16 ఏళ్ల నాటి ఈ విమానానికి ప్రపంచవ్యాప్తంగా ప్రమాదాల చీకటి చరిత్ర ఉంది. విఎస్ఆర్ వెంచర్స్ సంస్థ నడుపుతున్న ఈ విమానం గతంలోనూ రెండు ప్రమాదాలకు గురైంది. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ(నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ) కీలక నేత అజిత్ పవార్(66) ఘోర విమాన ప్రమాదంలో మరణించారు. అజిత్ పవార్ ఎన్నికల ర్యాలీ కోసం బారామతికి వెళుతుండగా ఆయన ప్రయాణిస్తున్న విమానం ల్యాండింగ్ సమయంలో కూలిపోయింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ప్రకారం, చార్టర్ విమానంలో ఉన్న ఆరుగురు వ్యక్తులు ప్రమాదంలో మరణించారు. ల్యాండింగ్ సమయంలో ఈ ప్రమాదం జరిగింది. అజిత్ పవార్ ప్రయాణించిన చార్టర్ విమానం ప్రమాదకరమైన ట్రాక్ రికార్డ్ కలిగి ఉంది. ఈ విమానం కూలిపోయిన చరిత్ర తెలిస్తే వెన్నులో వణుకుపుట్టిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ విమానానికి సంబంధించి దాదాపు 200 ప్రమాదాలు జరిగాయి. ఈ చార్టర్డ్ విమానానికి భారతదేశంలో కూడా చీకటి చరిత్ర ఉంది. కూలిపోయిన విమానం 16 సంవత్సరాల నాటిది. ఈ బాంబార్డియర్ లియర్?జెట్ 45, సీరియల్ నంబర్ 45-417, విఎస్ఆర్ ఫ్లీట్‌లో భాగం.

అజిత్ పవార్ ఏ విమానంలో ప్రయాణించారు?

బారామతి విమానాశ్రయంలో కూలిపోయిన అజిత్ పవార్ విమానం లియర్‌జెట్ 45ఎక్స్ఆర్ మోడల్. దీని రిజిస్ట్రేషన్ నంబర్ ఖ-ాూాఖ. ఈ చార్టర్ విమానం ఎక్కువగా విఐపిల కోసం, అత్యవసర వైద్య సేవల కోసం ఉపయోగించబడుతుంది. ఇది 6 నుండి 8 మంది కూర్చునే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఈ చిన్న విమానం అతిపెద్ద లక్షణం దాని వేగం. లియర్‌జెట్ 45 మోడల్ గంటకు 860 కిలోమీటర్ల గరిష్ట వేగాన్ని కలిగి ఉంది. ఈ విమానం ఒకే వేగంతో దాదాపు 4,000 కిలోమీటర్లు ప్రయాణించగలదు. ఈ చార్టర్డ్ విమానం కేవలం 18 నుండి 20 నిమిషాల్లో 41,000 అడుగుల ఎత్తుకు చేరుకోగలదు. ధర విషయానికొస్తే, లియర్‌జెట్ 45ఎక్స్ఆర్ ధర వి2.5 మిలియన్ల నుండి వి6 మిలియన్ల మధ్య ఉంటుంది.

అజిత్ పవార్ ప్రమాదానికి గురైన విమానం యజమాని ఎవరు?

అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం ఢిల్లీకి చెందిన చార్టర్ కంపెనీ ఖా= వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. ఈ విమానాన్ని కెనడాకు చెందిన బాంబార్డియర్ కంపెనీ తయారు చేసింది. బాంబార్డియర్ ఏరోస్పేస్ 1990లో మధ్య తరహా వ్యాపార విమానాలను తయారు చేయడం ప్రారంభించింది. 45ఠ= 1995- 2012 మధ్య అపారమైన ప్రజాదరణ పొందింది. ఈ కంపెనీని కెనడియన్ వ్యాపారవేత్త విలియం పావెల్ లియర్ ప్రారంభించారు. భారతదేశంలో, ఈ విమానాన్ని ఖా= ఏవియేషన్ నిర్వహిస్తోంది. ఇది గత 15 సంవత్సరాలుగా ఈ చార్టర్ విమానాన్ని నడుపుతోంది. ఈ కంపెనీకి 60 మందికి పైగా పైలట్లు ఉన్నారు. ఈ కంపెనీ క్లయింట్ జాబితాలో హావెల్స్ ఇండియా, వెల్స్పన్, ూాూ అపోలో వంటి క్లయింట్లు ఉన్నారు. ఖా= ఏవియేషన్ విజయ్ కుమార్ సింగ్ సొంతం.

3 సంవత్సరాలలో రెండవ ప్రమాదం..!

1. బాంబార్డియర్ ఏరోస్పేస్ 2021లో లియర్?జెట్ 45 మోడల్ ఉత్పత్తిని నిలిపివేసింది. ఉన్న విమానాలతోనే సర్వీస్ నిర్వహణ కొనసాగుతోంది. అజిత్ పవార్ ప్రయాణిస్తున్న లియర్?జెట్ 45 మోడల్ విమానం గత మూడు సంవత్సరాలలో రెండు ప్రమాదాలకు గురైంది.

2.2023 సెప్టెంబర్ 2న ముంబైలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో లియర్‌జెట్ 45 కూలిపోయింది. భారీ వర్షం కారణంగా విమానం రన్?వే నుండి జారిపోయింది. ప్రమాదం తర్వాత విమానం రెండు ముక్కలుగా విరిగిపోయింది. విమానం ల్యాండింగ్‌కు 40 సెకన్ల ముందు ఆటోపైలట్ డిస్‌కనెక్ట్ అయిందని దర్యాప్తులో తేలింది. తత్ఫలితంగా విమానం రన్?వే నుండి పక్కకు వెళ్లి టాక్సీవే సమీపంలో కూలిపోయింది.

3. 2021 ఫిబ్రవరిలో మెక్సికోలో లియర్‌జెట్ 45 విమానం కూలిపోయింది. ఎల్ లెన్సెరో విమానాశ్రయంలో విమానం కూలిపోవడంతో ఆరుగురు సైనికులు మరణించారు.

4. 2008 నవంబర్‌లో మెక్సికో సిటీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అల్లకల్లోలం కారణంగా లియర్‌జెట్ 45 కూలిపోయి, తొమ్మిది మంది మరణించారు.

5. 2009 జూలైలో అమెరికాలో లియర్‌జెట్ 45ఎక్స్ఆర్ గాలి అల్లకల్లోలం కారణంగా ప్రమాదానికి గురైంది.

6. 2003 జూన్‌లో ఇటలీలోని మిలన్‌లో టేకాఫ్ సమయంలో పక్షులను ఢీకొట్టడంతో లియర్‌జెట్ 45 కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు మరణించారు.

7. 1998 సెప్టెంబర్‌లో అమెరికాలోని వాలోప్స్ ద్వీపంలో ల్యాండింగ్ చేస్తున్నప్పుడు నియంత్రణ కోల్పోవడం వల్ల లియర్‌జెట్ 45 కూలిపోయింది.


బిజినెస్ వాయిస్

## ఒక్క రోజులో ముకేష్ అంబానీ
# ఎంత సంపాదిస్తాడో తెలుసా..?




ముఖేష్ అంబానీ రోజువారీ ఆదాయం సుమారు 163 కోట్ల రూపాయలు. ఈ భారీ మొత్తం ఆయన జీతం కాదు, రిలయన్స్ ఇండస్ట్రీస్ లాంటి తన కంపెనీల లాభాలు, వాటాలు, పెట్టుబడుల నుంచి వస్తుంది. పెట్రోకెమికల్స్, రిటైల్, డిజిటల్ రంగాల్లోని వ్యాపారాలు ఆయన సంపదను నిరంతరం పెంచుతున్నాయి. కొన్నిసార్లు ఒక్క రోజులోనే వేల కోట్ల రూపాయలు పెరుగుతుంది. ముఖేష్ అంబానీ.. పరిచయం అక్కర్లేని పేరు. ఆయన ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల జాబితాలో ఒకరిగా ఉన్నారు. అంబానీ గురించి ఏ విషయం చెప్పినా అది ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తుంది. ముఖ్యంగా, ఆయన రోజుకు ఎంత ఆదాయం సంపాదిస్తారనే ప్రశ్న అందరిలోనూ ఉంటుంది. ఈ గణాంకాలను తెలుసుకుంటే ఎవరైనా ఆశ్చర్యపోక తప్పదు. ముఖేష్ అంబానీకి చమురు, పెట్రోకెమికల్స్, రిటైల్, డిజిటల్ సేవలు లాంటి అనేక ప్రధాన వ్యాపారాలు ఉన్నాయి. ఈ బిజినెస్‌లు ఆయన సంపదను నిరంతరం పెంచుతూనే ఉన్నాయి. అయితే, ఆయన ఒకే రోజులో ఎంత సంపాదిస్తారో ఎప్పుడైనా ఆలోచించారా? ఈ ఆదాయాన్ని నిమిషాలు లేదా సెకన్లలో విభజించినప్పుడు వచ్చే గణాంకాలు నిజంగా ఆశ్చర్యపరిచే విధంగా ఉంటాయి. ఇది ఒక సగటు వ్యక్తి ఒకే రోజులో ఎంత డబ్బు సంపాదించగలడో ఊహించడం కూడా కష్టమని స్పష్టం చేస్తుంది. ముఖేష్ అంబానీ రోజుకు దాదాపు 163 కోట్ల రూపాయలు సంపాదిస్తారని అంచనా. ఇది ఒక సంవత్సరంలో లక్షలాది మంది సంపాదించే మొత్తం కంటే ఎక్కువ. అయితే, ఈ ఆదాయం ఆయనకు జీతం రూపంలో నేరుగా రాదు. బదులుగా, ఇది ఆయన కలిగి ఉన్న కంపెనీల లాభాలు, వాటాలు, పెట్టుబడుల నుండి వచ్చే రాబడుల ద్వారా సంపాదిస్తారు. వాస్తవానికి, అంబానీ స్వయంగా గత ఐదు సంవత్సరాలుగా తన కంపెనీ నుండి ఎటువంటి జీతం తీసుకోలేదు. అయినప్పటికీ, ఆయనకు చెందిన వాటాలు ప్రతి సంవత్సరం గణనీయమైన లాభాలను ఆర్జిస్తూనే ఉన్నాయి. ముఖేష్ అంబానీకి ప్రధాన ఆదాయ వనరులు ఆయన పెద్ద కార్పొరేట్ వ్యాపారాలు. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనేది పెట్రోకెమికల్స్, చమురు శుద్ధి, రిటైల్, టెలికాం లాంటి అనేక ప్రధాన రంగాలలో విస్తృతమైన ప్రయోజనాలను కలిగి ఉంది. ఈ అన్ని పరిశ్రమల నుండి వచ్చే ఆదాయాలు ఆయన మొత్తం సంపదపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయి. కంపెనీల లాభాలు పెరిగినప్పుడు, వాటి షేర్ ధరలు కూడా పెరుగుతాయి. తద్వారా అంబానీ నికర విలువ పెరుగుతుంది.

# ఎస్ఐపిలో ఇన్వెస్ట్ చేస్తున్నారా?
## చిన్న పొరపాటుతో మీకు భారీ నష్టం రావొచ్చు!



మ్యూచువల్ ఫండ్స్ ఎస్ఐపిలో పెట్టుబడి పెడుతున్నారా? అనుకోని ఆర్థిక అవసరాలతో ఎస్ఐపి వాయిదాలను దాటవేస్తున్నారా? అలా చేయడం వల్ల మీ దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. చక్రవడ్డీ శక్తిని కోల్పోవడం వల్ల లక్షల, కోట్ల రూపాయల సంపదను కోల్పోతారు. ఈ మధ్యకాలంలో చాలా మంది మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ చేస్తున్నారు. ముఖ్యంగా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌తో ప్రతి నెలా తమ పెట్టుబడిని కొనసాగిస్తున్నారు. మీరు కూడా ఎస్ఐపిలో ఇన్వెస్ట్ చేస్తున్నట్లు అయితే ఈ విషయం కచ్చితంగా తెలుసుకోవాల్సిందే. అదేంటంటే.. చాలా మంది ఎస్ఐపిలో ఇన్వెస్ట్‌మెంట్‌ను ఎంతో ఉత్సాహంగా మొదలుపెడతారు. కొన్ని నెలలు ఇన్వెస్ట్ చేసిన తర్వాత మధ్యలో అనుకోని ఆర్థిక అవసరాలు రాగానే ఎస్ఐపిను స్కిప్ చేస్తారు. ఇలా చేయడం వల్ల కలిగే నష్టం భారీగా ఉంటుంది. దాని గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.. ఉదాహరణకు దీపావళి షాపింగ్, వివాహ ఖర్చులు లేదా కొత్త ఇల్లు కొనడానికి ఇఎంఐల ఒత్తిడి వంటి సాధారణ కారణాలతో కొన్ని నెలల పాటు రూ.20,000 వాయిదాని ఆపడం చాలా చిన్న విషయంగా అనిపిస్తుంది. కానీ వాస్తవానికి మీ ఎస్ఐపిని ఆపడం గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. ఈ రోజు ఒక చిన్న అంతరాయం వల్ల 2030 సంవత్సరాలలో రూ.50 లక్షలు, రూ.1 కోటి లేదా అంతకంటే ఎక్కువ నష్టం సంభవించవచ్చు. కారణం కాంపౌండింగ్. కాంపౌండింగ్ మీ అవసరాల గురించి పట్టించుకోదు. మీరు ఎంత ఇబ్బందుల్లో ఉన్నా కూడా ప్రతి నెలా ఇన్వెస్ట్‌మెంట్ ఆపకుండా పెడితే దాని పని అది కరెక్ట్‌గా చేస్తుంది. ప్రతి నెలవారీ ఎస్ఐపి ఒక కొత్త పెట్టుబడి. మీరు నెలవారీ వాయిదాను దాటవేస్తే, ఆ డబ్బు 20-30 సంవత్సరాలు పెరిగే అవకాశం లేదు. మీరు 30 సంవత్సరాల పాటు ప్రతి నెలా రూ.20,000 ఎస్ఐపి చేసి సగటున 12 శాతం రాబడిని ఆర్జిస్తే, మీరు దాదాపు రూ.7 కోట్ల నిధిని నిర్మించుకోవచ్చు. అయితే మీరు ప్రతి సంవత్సరం కేవలం మూడు నెలలు ఎస్ఐపిని ఆపివేస్తే, తుది నిధి దాదాపు రూ.5 కోట్లకు కుదించుకొని పోతుంది. అంటే మీరు రూ.1.52 కోట్ల నష్టపోయినట్టే. అయితే కొంత మంది ఒక రెండు నెలలు మిస్ చేసిన ఎస్ఐపిను, లోటును భర్తీ చేసుకోవడానికి తరువాత ఎక్కువ పెట్టుబడి పెట్టవచ్చని అనుకుంటారు, కానీ అది అంత సులభం కాదు. కోల్పోయిన సమయం భర్తీ చేయలేనిది. మీరు ఎంత త్వరగా, మరింత స్థిరంగా పెట్టుబడి పెడితే మీరు అంత లాభదాయకంగా ఉంటారు. వివాహాలు, పండుగలు, సామాజిక ఒత్తిడి అన్నీ మీ ఖర్చులను పెంచుతాయి. మీ ఎస్ఐపిని కేవలం ఒక నెల పాటు పాజ్ చేయడం సులభం అనిపించవచ్చు, కానీ ఈ అలవాటు దీర్ఘకాలంలో గణనీయమైన నష్టాలకు దారితీస్తుంది.

# ఆగని బంగారం-వెండి ధరలు..!
## ఇప్పుడు కొంటే లాభమా? లేక ప్రమాదమా? నిపుణుల షాకింగ్ కామెంట్స్




బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ప్రపంచ అనిశ్చితి, బలహీనమైన డాలర్ ఈ పెరుగుదలకు కారణం. ఈ సమయంలో పెట్టుబడి పెట్టడం సరైనదేనా అని మదుపరులు సందేహిస్తున్నారు. నిపుణుల ప్రకారం, బంగారం సురక్షిత పెట్టుబడిగా కొనసాగుతుంది, 2026 నాటికి 10 గ్రాములు 2 లక్షలకు చేరుకోవచ్చు. వెండి విషయంలో జాగ్రత్త వహించాలి, లాభాల బుకింగ్ తర్వాత కొనుగోలు చేయాలి. బంగారం, వెండి ధరలు రోజురోజుకూ ఆకాశాన్ని అంటుతున్నాయి. జనవరి 28 బుధవారం మరో భారీ పెరుగుదల కనిపించింది. ఎంసిఎక్స్, బులియన్ మార్కెట్ రెండింటిలోనూ బంగారం, వెండి ధరలు రికార్డులను సృష్టించాయి. వీజశలో బుధవారం ఉదయం ట్రేడింగ్‌లో బంగారం 3శాతం కంటే ఎక్కువ పెరిగి, మొదటిసారిగా 10 గ్రాములకు రూ.1.62 లక్షలకు చేరుకుంది. ఫిబ్రవరి ఫ్యూచర్స్ రూ.4,700 కంటే ఎక్కువ పెరిగి రూ.1,62,429కి చేరుకోవడంతో ఇది బంగారానికి రికార్డు స్థాయి. మార్చిలో వెండి ఫ్యూచర్స్ కూడా రూ.21,400 పెరిగి కిలోకు రూ. 3,77,655 కొత్త రికార్డును తాకింది. ప్రపంచ అనిశ్చితి, బలహీనమైన డాలర్, బలమైన స్పాట్ డిమాండ్ కారణంగా రెండు విలువైన లోహాలలో ఈ పెరుగుదల కనిపించింది. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. దీని ఫలితంగా పెట్టుబడిదారులు సురక్షిత స్వర్గధామాల వైపు పారిపోతున్నారు.. ఖూ డాలర్ ఇండెక్స్ కూడా తగ్గుతోంది. నాలుగు సంవత్సరాల కనిష్ట స్థాయికి చేరుకుంది. బలహీనమైన డాలర్ విదేశీ కొనుగోలుదారులకు బంగారాన్ని చౌకగా చేస్తుంది. ట్రంప్ సుంకాల విధానం ప్రపంచ వాణిజ్యం, ఆర్థిక వృద్ధిపై అనిశ్చితిని పెంచింది. భారతదేశం-యుఎస్ వాణిజ్య ఒప్పందం గురించి సానుకూల సంకేతాలు ఇంకా కనిపించలేదు. అయితే, అధిక ధరలకు భయపడి చాలా మంది పెట్టుబడులు పెట్టడం మానేశారు. రికార్డు స్థాయిలో బంగారం, వెండిలో పెట్టుబడి పెట్టడం విలువైనదేనా అని మధుపదారులు ఆలోచిస్తున్నారు. ఈ స్థాయిలలో పెట్టుబడి పెట్టడం వల్ల భవిష్యత్తులో రాబడి వస్తుందా లేదా నష్టాలు వస్తాయా అనే సందేహం కూడా కనిపిస్తోంది.

**కొనుగోలు చేయడానికి ఇప్పుడు సరైన సమయమేనా..?**

ప్రపంచ అనిశ్చితి మధ్య ర్యాలీ కొనసాగుతుందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. బంగారం సురక్షితమైన పెట్టుబడిగా మిగిలిపోయింది. బంగారంలో పెట్టుబడి గురించి ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ప్రపంచ అనిశ్చితి మధ్య బంగారంలో పెట్టుబడి పెట్టడం కొనసాగించాలని నిపుణులు చెబుతున్నారు. రాబోయే కాలంలో దాని బలహీనత పెరగవచ్చు. దీని కారణంగా, బంగారం, వెండి కాకుండా ఇతర వస్తువులు కూడా బలపడుతున్న సంకేతాలను చూపిస్తున్నాయి.

**బంగారం ధరలు రూ. 2 లక్షలకు చేరుకుంటాయా..?**

2026 నాటికి అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర వి6,000, భారత మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర 2 లక్షల రూపాయలకు చేరుకుంటుందని అంచనా. పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టడం మిస్ అయితే, వారు ఇప్పటికీ పెట్టుబడి పెట్టవచ్చు. ఎల్లప్పుడూ ఎస్ఐఎఫ్ (సబ్సిడీ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) ద్వారా పెట్టుబడి పెట్టండి. ధరలు 5-10 శాతం తగ్గితే, ఒకేసారి పెట్టుబడి పెట్టడానికి అవకాశం ఉంది. మొత్తం ట్రెండ్ సానుకూలంగానే ఉంది.

**వెండి విషయంలో కొంచెం జాగ్రత్త అవసరం**

వెండి విషయంలో కొంచెం జాగ్రత్త అవసరమని నిపుణులు అంటున్నారు. కోమెక్స్‌లో మానసిక స్థాయి వి125, భారత మార్కెట్లో రూ. 4 లక్షలు. ఈ స్థాయిలలో ఏదైనా మార్పులు జరగవచ్చు అంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో వెండి ధర వి150, భారత మార్కెట్లో రూ. 4.70 లక్షలకు చేరుకోవచ్చునని చెబుతున్నారు. లాభాల బుకింగ్ తర్వాత, అది రూ. 3.20 లక్షల నుండి రూ. 3.50 లక్షలకు పడిపోతే, అందులో పెట్టుబడి పెట్టడానికి ఇది మంచి అవకాశం. ఈరోజు బుధవారం (జనవరి28న) 24 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ.16,708, 22 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ.15,315, 18 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ. 12,531లుగా నమోదైంది. నేటి వెండి ధర గ్రాము రూ. 400లు కాగా, కిలో వెండి ధర రూ.4,00,000లకు చేరింది. బంగారం, వెండి ధరల్లో ర్యాలీ రాబోయే రోజుల్లో కూడా కొనసాగే అవకాశం ఉందని అంటున్నారు.

# సొంతింటి కల కంటున్న వారికి బడ్జెట్‌లో గుడ్‌న్యూస్



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న బడ్జెట్ 2024లో గృహనిర్మాణ రంగానికి గణనీయమైన ఊతం లభించనుంది. ముఖ్యంగా, సరసమైన గృహాల ప్రస్తుత ధర పరిమితి రూ.45 లక్షల నుండి రూ.70-90 లక్షలకు పెంచే అవకాశం ఉంది. మరిన్ని వివరాలు ఇలా ఉన్నాయి.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న పార్లమెంటులో నూతన బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్ కోసం యావత్ దేశం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ముఖ్యంగా బడ్జెట్ దేశంలోని గృహనిర్మాణ రంగం సహా అనేక రంగాలలో గణనీయమైన మార్పులను తీసుకువచ్చే అవకాశం ఉంది. ఇల్లు కొనాలని కలలు కంటున్న లక్షలాది మందికి ఈ బడ్జెట్ భారీ రిలీఫ్ ఇస్తుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఆర్థిక వృద్ధిని పెంచడంతో పాటు, ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్ గృహనిర్మాణ రంగంపై కూడా దృష్టి పెడుతుంది. ముఖ్యంగా సరసమైన గృహాల నిర్వచనంలో పెద్ద మార్పు చేసే అవకాశం ఉంది. ఇది మెట్రోపాలిటన్ ప్రాంతాలలో ఇల్లు కొనడాన్ని సులభతరం చేస్తుంది. రియల్ ఎస్టేట్ రంగం, గృహ కొనుగోలుదారులు చాలా కాలంగా సరసమైన గృహాల ధర పరిమితిని పెంచాలని డిమాండ్ చేస్తున్నారు, ప్రభుత్వం బడ్జెట్ ద్వారా దీనిని పరిష్కరించవచ్చు. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. మన దేశంలో రూ.45 లక్షల వరకు ధర ఉన్న ఇళ్ళు, ఫ్లాట్లు సరసమైన గృహాల కేటగిరిలో ఉన్నాయి. ఈ వర్గం కింద, మెట్రో నగరాల్లో గరిష్టంగా 60 చదరపు మీటర్లు, మెట్రోయేతర నగరాల్లో 90 చదరపు మీటర్ల వరకు నిబంధన ఉంది. భూమి, నిర్మాణ సామగ్రి, శ్రమ ధరలో గణనీయమైన పెరుగుదల కారణంగా ఈ పరిమితి ఇటీవలి కాలంలో అసాధ్యంగా మారింది. రియల్ ఎస్టేట్ పరిశ్రమ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రభుత్వం 2017లో రూ.45 లక్షల పరిమితిని నిర్ణయించినప్పుడు మార్కెట్ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ప్రస్తుత దృష్టాంతంలో ప్రధాన నగరాల్లో రూ.70 లక్షల కంటే తక్కువ ధరకు రెండు బెడ్‌రూమ్‌ల ఫ్లాట్‌ను కనుగొనడం కూడా సవాలుగా ఉంది. ఈ సమస్య కారణంగా మొదటిసారి ఇల్లు కొనుగోలు చేసేవారు సరసమైన గృహాల వర్గం నుండి మినహాయించబడ్డారు. పన్ను మినహాయింపులు, సబ్సిడీల నుండి ప్రయోజనం పొందలేకపోతున్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో డెవలపర్లు, కొనుగోలుదారులు సరసమైన గృహాల గరిష్ట ధర పరిమితిని రూ.70-90 లక్షలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ మార్పు అమలులోకి వచ్చిన తర్వాత, ఇది మధ్యతరగతికి గణనీయమైన ఉపశమనం కలిగించడమే కాకుండా గృహనిర్మాణ రంగానికి కూడా ఊతం ఇస్తుంది.

# వందే భారత్ స్లీపర్ రైళ్ల ప్రత్యేకతలు ఇవే..

వందే భారత్ స్లీపర్ రైళ్లు భారత్‌లో ఇప్పటికే ప్రారంభమయ్యాయి. తొలి రైలు ఈ నెల 17న ప్రారంభమైంది. ఈ రైళ్లలోని ఫీచర్లు, సదుపాయాల గురించి తెలుసుకునేందుకు అందరూ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ రైళ్లో విమానం తరహాలో లగ్జరీ సౌకర్యాలు ఉన్నాయి. వాటి గురించి చూద్దాం. వందే భారత్ తొలి స్లీపర్ రైలు దేశంలో అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. తొలి రైలు హౌరా-గువహతి మధ్య ఈ నెల 17న ప్రధాని మోదీ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. త్వరలో దేశవ్యాప్తంగా మరిరికొన్ని రూట్లలో ఈ రైళ్లను ప్రవేశపెట్టనున్నారు. అందులో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో సికింద్రాబాద్-ఢిల్లీ మార్గంలో తొలి వందే భారత్ స్లీపర్ ట్రైన్ అందుబాటులోకి తెచ్చేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం ఈ రూట్లో రాజధాని ఎక్స్‌ప్రెస్ నడుస్తూండగా.. ఇందులో ప్రయాణ సమయం ఒకరోజు పడుతుంది. అదే వందే భారత్ స్లీపర్ రైలు వస్తే జర్నీ సమయం మరింత తగ్గుతుంది. దీంతో పాటు సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చు. వందే భారత్ స్లీపర్ రైళ్ల గురించి ఇంట్రెస్టింగ్ ఫ్యాక్ట్స్ ఇప్పుడు తెలుసుకుందాం.

**కోచ్‌లు ఎన్నంటే..?**

వందే భారత్ స్లీపర్ రైళ్లల్లో 16 ఏసీ కోచ్‌లు ఉంటాయి. 823 మంది ఒకేసారి ప్రయాణించే సామర్థ్యం ఉంది. 11 ఏసీ త్రీ టైర్, 4 ఏసీ టూ టైర్, , ఒక ఫస్ట్ క్లాస్ ఏసీ కోచ్‌లు ఉంటాయి.

**అత్యాధునిక బెర్త్‌లు**

ఈ ట్రైన్స్‌లో బెర్త్‌లు చాలా లగ్జరీగా ఉంటాయి. మెరుగైన కుషనింగ్‌తో ఎర్గనమిక్‌గా రూపొందించిన బెర్త్‌లు ఉంటాయి. ఎగువ బెర్త్‌లకు ఎక్కడానికి నిచ్చెన ఉంటుంది. వీటిల్లో బయట శబ్దాలు, కుదుపులు ఏం ఉండవు. దీంతో రాత్రిపూట ఎలాంటి డిస్టబెన్స్ లేకుండా హాయిగా నిద్రపోతూ ప్రయాణించవచ్చు.

**వేగం ఎంతంటే..?**

వందే భారత్ స్లీపర్ రైళ్ల వేగం గంటకు 180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యం కలిగి ఉన్నాయి. దీంతో వీటిని సెమీ హై స్పీడ్ రైళ్లుగా పిలుస్తున్నారు.

**డ్రైవర్ క్యాబిన్**

ఈ రైళ్లు బుల్లెట్ ట్రైన్ల మాదిరిగానే ఏరో డైనమిక్ బాహ్య రూపాన్ని కలిగి ఉంటాయి. ప్రయాణ సమయంలో వేగంగా తిరగవచ్చు. ప్రతి చివర డ్రైవర్ క్యాబిన్ ఉంటుంది. ఈ రైలులో లోక్ పైలట్‌కు ఆటోమేటిక్ ఎగ్జిట్, ప్రవేశ ద్వారాలు ఉంటాయి.

**చాలామంది ఈ విషయాలు గమనించి ఉందరు**



**అత్యాధునిక టాయిలెట్లు**

వందే భారత్ స్లీపర్ రైళ్లల్లో అత్యాధునిక టాయిలెట్లు అందుబాటులో ఉంటాయి. విమానాల తరహాలోనే ఇందులో మాడ్యులర్ బయో వాక్యూమ్ టాయిలెట్లు కలిగి ఉంటాయి. ఫస్ట్ ఏసీ కోచ్‌లో ప్రయాణికుల కోసం షవర్ క్యూబికల్ ఏరియా ఉంటుంది. ఇక ఈ రైల్లో ఒక టాయిలెట్ దివ్యాంగులకు ప్రత్యేకంగా ఉంటుంది.

**భద్రతా వ్యవస్థలు**

ఈ రైల్లో స్వదేశీ టెక్నాలజీతో తయారుచేసిన కవచ్ యాంటీ కొలిషన్ సిస్టమ్ అమర్చబడి ఉంటుంది. ఇక మెరుగైన అగ్ని భద్రతా ఏరోసోల్ ఆధారిత అగ్ని గుర్తింపు, అణచివేత వ్యవస్థ ఉంటుంది. దీంతో అగ్ని ప్రమాదాల సమయంలో ఇవి రక్షిస్తాయి.

**టికెట్ల బుకింగ్ నిబంధనలు**

వందే భారత్ స్లీపర్ రైళ్లల్లో వెయిటింగ్, ఆర్ఏసీ టికెట్లు ఉండవు. కేవలం కన్ఫార్మ్‌డ్ టికెట్లు ఉన్నవారు మాత్రమే ప్రయాణించడానికి వీలవుతుంది. ఇక రైలు బయల్దేరడానికి 8 గంటల్లోపు టికెట్ రద్దు చేసుకుంటే రిఫండ్ ఉండదు. 8 గంటల ముందు రద్దు చేసుకుంటూ వాపసు ఉంటుంది.

### అనుమానం.. ఆవేశం..

# ఇద్దరు చిన్నారులను అనాథలను చేసింది..


## భార్యను చంపి భర్త చేశాడంటే..?



గుంటూరు జిల్లా తెనాలికి చెందిన సాయిబాబా క్యాటరింగ్ పనులకు వెళుంటాడు. సాయిబాబాకు నల్గొండకు చెందిన శిరీషతో 2015లో వివాహం అయింది. వీరికి ఇద్దరూ పిల్లలున్నారు. పెళ్లైనా తర్వాత హైదరాబాద్‌లో కొంతకాలం పాటు కాపురం పెట్టారు. సంసారం సాఫీగా సాగుతుండటంతో దంపతులు ఆరు నెలల క్రితమే తెనాలి వచ్చారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన సాయిబాబా క్యాటరింగ్ పనులకు వెళ్తుంటాడు. సాయిబాబాకు నల్గొండకు చెందిన శిరీషతో 2015లో వివాహం అయింది. వీరికి ఇద్దరూ పిల్లలున్నారు. పెళ్లైనా తర్వాత హైదరాబాద్‌లో కొంతకాలం పాటు కాపురం పెట్టారు. సంసారం సాఫీగా సాగుతుండటంతో దంపతులు ఆరు నెలల క్రితమే తెనాలి వచ్చారు. రామలింగేశ్వర పేటలో నివసిస్తున్న వీరిద్దరిలో సాయిబాబా క్యాటరింగ్ పనులకు వెళ్తుండగా శిరీష మాత్రం బ్యూటీ పార్లర్ లో పనిచేస్తుంది. ఇంతలోనే భార్యపై అనుమాన బీజం పడింది. దీంతో సాయిబాబా తరుచూ ఆమెతో గొడవపడుతుండేవాడు. ఎప్పటిలాగే మంగళవారం (జనవరి 27, 2026) కూడా భార్యతో ఘర్షణ పడ్డాడు. ఈ గొడవలో ఆమెపై దాడి చేశాడు. భర్త కొట్టడంతో శిరీష మంచంపై పడిపోయింది. అవేశంతో భార్య గొంతు నులిమి సాయిబాబు చంపేశాడు. కోపం తగ్గిన తర్వాత చూస్తే భార్య విగత జీవిగా పడి ఉంది. వెంటనే తేరుకున్న సాయిబాబా ఇంటి నుండి బయటకు వచ్చేశాడు. అయితే భార్య చనిపోయిన విషయాన్ని బంధువులకు చెప్పాలన్న ఉద్దేశంతో దారిలో ఎదురైన ఒక వ్యక్తి సెల్ ఫోన్ కావాలంటూ అడిగాడు. ఫోన్ చేసుకుని ఇస్తానని చెప్పిన సాయిబాబా ఆ ఫోన్ తీసుకొని అక్కడ నుండి పారిపోయాడు. కొద్దీ దూరం వెళ్లిన తర్వాత హైదరాబాద్‌లో ఉంటున్న తన బావమరిదికి సమాచారం ఇచ్చాడు. శిరీష తాను గొడవ పడ్డామని ఆమె మంచంపై పడిపోయిందని చెప్పాడు. వెంటనే తెనాలిలో ఉన్న తన మేనల్లుడికి అదే విధంగా ఫోన్ చేసి చెప్పేశాడు. సాయిబాబా బావమరిది స్థానికంగా ఉండే బంధువులకు విషయం తెలియజేశాడు. స్థానికులు ఇంటికి వచ్చి చూడగా శిరీష మంచంపై విగతజీవిగా కనిపించింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు చెప్పారు. శిరీష చనిపోయిన విషయాన్ని బంధువులతో ధ్రువీకరించుకున్న సాయిబాబా పోలీసులకు లొంగిపోయాడు. తల్లి చనిపోగా తండ్రిని పోలీసులు తీసుకెళ్లడంతో పిల్లలిద్దరూ అయోమయంలో పడిపోయారు. ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్న చిన్నారులను ప్రస్తుతం తెనాలిలో ఉన్న బంధువులు తమ ఇంటికి తీసుకెళ్లారు. చిన్నారుల పరిస్థితి తలుచుకొని బంధువులు కంటతడి పెట్టారు. ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### ఏపీలో ఊహించని

# టర్న్ తీసుకున్న వాతావరణం..




ఏపీలో వాతావరణం ఊహించని మలుపు తిరిగింది. చలికాలం పూర్తిగా వీడకముందే పగటి వేళ ఎండలు మండిపోతుండగా... రాత్రివేళ చలి గాలులు వణికిస్తున్నాయి. పగలు, రాత్రి ఉష్ణోగ్రతల మధ్య తీవ్ర వ్యత్యాసం ప్రజలను అయోమయానికి గురి చేస్తోంది. లేటెస్ట్ వెదర్ రిపోర్ట్ తెలుసుకుందాం పదండి... ఏపీలో వాతావరణం ఒక్కసారిగా మారుతుంది. చలికాలం పూర్తిగా ముగియకముందే. ఎండ తీవ్రత మొదలవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. గత రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడంతో మధ్యాహ్నం వేళ భానుడు భగభగా మండిపోతున్నాడు.. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. ఎండకు తోడు వాహనాల పొగ, పొల్యూషన్ కలిసి ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.. పగలు మండే ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు రాత్రివేళ కూడా ఉపశమనం లభించడం లేదు. చలిగాలులు వీయడంతో చలి తీవ్రత కొనసాగుతోంది. దీంతో పగలు, రాత్రి ఉష్ణోగ్రతల మధ్య తీవ్ర వ్యత్యాసం ఏర్పడుతోంది. ఈ మార్పు పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఏపీలోని పలు ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు అధికంగా నమోదు అవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటన విడుదల చేశారు. కృష్ణాజిల్లా నందిగామలో 33.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయింది. అదే సమయంలో రాబోయే మూడు రోజులపాటు రాయలసీమ ప్రాంతంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు మరో మూడు నుంచి నాలుగు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని అమరావతి వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. అయితే ఎండ తీవ్రత పెరుగుతున్నప్పటికీ ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాలలో మాత్రం చలి ఇంకా పూర్తిగా తగ్గలేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో అత్యల్పంగా 7.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎత్తైన కొండప్రాంతాల్లో ఉదయం వేళ మంచు చలి, పొగ మంచు కారణంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు.. మరోవైపు వాతావరణం లో చోటు చేసుకున్న మార్పుల కారణంగా దక్షిణాంధ్ర ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసాయి. చిత్తూరు, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో చినుకులతో కూడిన వర్షం పడింది. కొన్ని ప్రాంతాల్లో పంటలపై స్వల్ప ప్రభావం కనిపించగా రైతులు వాతావరణం మార్పులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి మూడు గంటల మధ్య బయటకు వెళ్లే సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేస్తున్నారు. తాగునీరు, తేలికపాటి ఆహారం తీసుకోవడం, చిన్నారులు, వృద్ధులను నేరుగా ఎండలోకి పంపించకుండా చూసుకోవాలని హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో వాతావరణం వేగంగా మారుతున్న ఒకవైపు మండుతున్న ఎండ , మరోవైపు చలి గాలులు వీస్తున్న పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వాతావరణ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

### తెలుగు రాష్ట్రాల్లో

# జియో 'ఎఐ ఎడ్యుకేషన్' విప్లవం..

## ఉచితంగా విద్యార్థులకు ఎఐ శిక్షణ! డైరెక్ట్ లింక్ ఇదే..




ఆధునిక యుగంలో అభ్యాస, బోధనా పద్ధతులను మెరుగుపరచడానికి 'గూగుల్ జెమిని ప్రో' ఆచరణాత్మక అప్లికేషన్‌పై ఈ చొరవ దృష్టి పెడుతుంది. అత్యాధునిక ఎఐ సాధనాలను తరగతి గదుల్లోకి తీసుకురావడం ద్వారా, సాంకేతికతతో కూడిన వృత్తిపరమైన రంగంలో రాణించగల డిజిటల్ నైపుణ్యం కలిగిన విద్యార్థులను, ఉపాధ్యాయులను తయారు చేయడమే జియో లక్ష్యం.. విద్యా రంగానికి అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నైపుణ్యాలను అందించడం ద్వారా డిజిటల్ వ్యత్యాసాన్ని తగ్గించడానికి రిలయన్స్ జియో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తృతమైన విద్యా ప్రచారాన్ని ప్రారంభించింది. ఆధునిక యుగంలో అభ్యాస, బోధనా పద్ధతులను మెరుగుపరచడానికి 'గూగుల్ జెమిని ప్రో' ఆచరణాత్మక అప్లికేషన్?పై ఈ చొరవ దృష్టి పెడుతుంది. అత్యాధునిక ఎఐ సాధనాలను తరగతి గదుల్లోకి తీసుకురావడం ద్వారా, సాంకేతికతతో కూడిన వృత్తిపరమైన రంగంలో రాణించగల డిజిటల్ నైపుణ్యం కలిగిన విద్యార్థులను, ఉపాధ్యాయులను తయారు చేయడమే జియో లక్ష్యం. ఈ ప్రచారం ఇప్పటికే గణనీయమైన పురోగతిని సాధించి... రెండు రాష్ట్రాల్లో 2200 కంటే ఎక్కువ పాఠశాలలకు విజయవంతంగా చేరుకుంది. జియో సీనియర్ ఎగ్జిక్యూటివ్?ల నేతృత్వంలో జరుగుతున్న ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలలో 27,000 కంటే ఎక్కువ మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ లో 1500 కంటే ఎక్కువ పాఠశాలల్లో 20 వేల మంది, తెలంగాణలో 700 పాఠశాలల్లో 7000 వేల మందికి పైగా ఈ శిక్షణ పొందుతున్నారు. ఈ ఇంటరాక్టివ్ వర్క్?షాప్?లు గూగుల్ జెమిని వ్యవస్థను పరిచయం చేయడానికి ప్రత్యేకంగా రూపొందించబడ్డాయి. పాఠ్యాంశాల నోట్స్ తయారు చేయడం, అసైన్‌మెంట్‌లు రాయడం, సంక్లిష్టమైన కోడింగ్ ప్రాజెక్ట్?లలో సహాయం పొందడం వంటి పనులను ఈ సాంకేతికతతో ఎలా సులభతరం చేయవచ్చో ఇందులో వివరించారు. దీర్ఘకాలిక వృత్తిపరమైన వృద్ధి కోసం ప్రాజెక్ట్ ఐడియేషన్, గ్రాఫిక్ డిజైన్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్ కోసం ఎఐని ఉపయోగించడంపై కూడా ఈ శిక్షణ ప్రాధాన్యతనిస్తుంది. ఈ డిజిటల్ సాధికారత ప్రచారంలో ప్రధాన అంశం ఏమిటంటే.. వినియోగదారులకు ఎటువంటి ఖర్చు లేకుండా ప్రీమియం సాంకేతికతను అందించడం. జియో తన అన్‌లిమిటెడ్ 5+ సబ్‌స్క్రైబర్లకు రూ.35,100 విలువైన 'గూగుల్ జెమిని ప్రో ప్లాన్'ను 18 నెలల పాటు ఉచితంగా అందిస్తోంది. వినియోగదారులు నేరుగా మైజియో యాప్ ద్వారా యాక్టివేట్ చేసుకునే ఈ సబ్‌స్క్రిప్షన్, అత్యాధునిక 'జెమిని 3 ప్రో' మోడల్?తో పాటు హై-ఎండ్ క్రియేటివ్ టూల్స్‌కు ప్రాప్యతను కల్పిస్తుంది. ఇందులో ఎఐసహాయంతో చిత్రాలను రూపొందించే 'నానో బనానా ప్రో', వీడియో జనరేషన్ కోసం 'వీయో 3.1' వంటి సాధనాలు ఉన్నాయి. అకడమిక్ రీసెర్చ్ కోసం 'నోట్‌బుక్ ఎల్‌ఎమ్', డిజిటల్ డేటాను భద్రపరుచుకోవడానికి 2 ఐదీ క్లౌడ్ స్టోరేజ్ కూడా ఈ ప్లాన్‌లో భాగంగా ఉన్నాయి. యువత నైపుణ్యాభివృద్ధికి ఉన్న నిబద్ధతను మరింత ముందుకు తీసుకెళ్తూ, కంపెనీ 'జియో ఎఐక్లాస్‌రూమ్' అనే ఉచిత నాలుగు వారాల ఆన్?లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌ను కూడా ప్రవేశపెట్టింది. విద్యార్థులు డెస్క్‌టాప్ లేదా ల్యాప్‌టాప్ ద్వారా వారి స్వంత వేగంతో ఎఐ సాంకేతికతలపై ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని పొందేలా ఈ కోర్సు రూపొందించబడింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థులు **Jio.com/ai-classroom** పోర్టల్‌ను సందర్శించడం ద్వారా ఈ శిక్షణ పొందవచ్చు. ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో పోటీ పడటానికి అవసరమైన పునాది జ్ఞానాన్ని ఇది అందిస్తుంది. తద్వారా ప్రాంతీయ శ్రామిక శక్తి సాంకేతిక ఆవిష్కరణలలో ముందంజలో ఉండేలా జియో నిర్ధారిస్తుంది.

### చెప్తే వినరు.. ఆర్టీసీ బస్‌లో


# తల బయటకు పెట్టిన ఇంటర్ విద్యార్థి..!



బస్సులు, కారుల్లో ప్రయాణించేటప్పుడు చేతులు, తలలు బయటకు పెట్ట వద్దని పెద్దలు ఎన్ని సార్లు చెప్పినా కొందరు వినిపించుకోరు. దీంతో ప్రమాదాలు కొని తెచ్చుకుంటూ ఉంటారు. తాజాగా ఓ బస్సు కిటికీ సీటులో కూర్చున్న ఓ ఇంటర్ విద్యార్థి అనుకోని విధంగా దుర్మరణం చెందాడు... బస్సులో ప్రయాణించేటప్పుడు చేతులు, తలలు బయటకు పెట్ట వద్దని పెద్దలు ఎన్ని సార్లు చెప్పినా కొందరు వినిపించుకోరు. దీంతో నిర్లక్ష్యంగా ప్రమాదకర రీతిలో బస్సు కిటికీల వద్ద సీటుల్లో కూర్చుని ప్రయాణిస్తుంటారు. తాజాగా ఓ ఆర్టీసీ బస్సులో వెళ్తున్న ఇంటర్ విద్యార్థి అనుకోని విధంగా దుర్మరణం చెందాడు. కిటికీ సీటు వద్ద కూర్చున్న విద్యార్థి తల బయటకు పెట్టాడు. కాసేపటికే దారుణం చోటు చేసుకుంది. ఈ షాకింగ్ ఘటన అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం టోల్గేట్ వద్ద బుధవారం (జనవరి 28) చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారాయి. వివరాల్లోకెళ్తే.. కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్గేట్ వద్ద ఆర్టీసీ బస్ లో ఈ రోజు ఉదయం ప్రయాణికులతో వెళుంది. ఇందులో కాలేజీలు, బడులు, ఉద్యోగ వ్యాపారాలకు వెళ్తే రకరకాల ప్రయాణికులు ఉన్నారు. అయితే బస్సు టోల్ గేట్ వద్ద బస్ వెల్లుతుండగా ఆర్టీసీ బస్ కిటికీలో నుంచి ఓ ఇంటర్? విద్యార్థి తల బయటకు పెట్టాడు. అక్కడ కొద్ది సేపు ఆగిన బస్సు ఆ వెంటనే బయల్దేరింది. ఈ క్రమంలో బస్సు ముందుకు కదలడంతో టోల్ గేట్ కేబిన్ రాడ్ విద్యార్థి తలకు బలంగా తగిలింది. దీంతో తీవ్ర గాయాల పాలైన విద్యార్థిని 108 అంబులెన్స్ లో హుటాహుటీన అమలాపురం ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే అంబులెన్స్లో తీసుకెళ్తుండగా మార్గ మధ్యలోనే విద్యార్థి మృతి చెందాడు. టోల్గేట్ వద్ద ఉన్న సీసీ కెమెరాలో ప్రమాద దృశ్యాలు రికార్డ్ అయ్యాయి. మురమళ్ల నుండి అమలాపురం వెళుతున్న ఆర్టీసీ బస్సులో మార్గం మధ్య లో బాధిత విద్యార్థి బస్ ఎక్కాడు. అమలాపురం కాలేజీ కి విద్యార్థి వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# బడి పిల్లలకు మరో గుడ్‌న్యూస్..

## స్కూళ్లకు మరో నాలుగు రోజులు వరుస సెలవులు?



సంక్రాంతి సెలవులు ముగిశాయి. అన్ని చోట్ల స్కూల్స్, కాలేజీలు మొదలయ్యాయి. ఇక పరీక్షలు త్వరలోనే రానుండటంతో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. అయితే ఈ నెల చివరిలో తెలంగాణలో మరో 4 రోజులు విద్యార్థులకు సెలవులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందుకు కారణం మేడారం.. తెలంగాణలో సంక్రాంతి సెలవులు ముగిశాయి. అన్ని చోట్ల స్కూల్స్, కాలేజీలు మొదలయ్యాయి. ఇక పరీక్షలు త్వరలోనే రానుండటంతో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. అయితే ఈ నెల చివరిలో తెలంగాణలో మరో 4 రోజులు విద్యార్థులకు సెలవులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందుకు కారణం మేడారం జాతర. తెలంగాణ ప్రజలకు మేడారం జాతర ఎంత ప్రత్యేకమో చెప్పనవసరం లేదు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర జనవరి నెలాఖరులో జరగనుంది. ఈ జాతర జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగనుంది. సమ్మక్క-సారలమ్మ దేవతలను రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చి ప్రజలు దర్శించుకుంటారు. ఈ జాతర సందర్భంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని పీర్టీయూ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ కుటుంబాలతో కలిసి జాతరకు వెళ్లే అవకాశం ఉన్నందున సెలవులు ఇవ్వడం సమంజసమని కోరుతున్నారు. ఇదే జరిగితే విద్యార్థులకు వరుస సెలవులు రానున్నాయి. దీనిపై తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. అయితే సాధారణంగా మేడారం జాతర ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరుగుతుంది. దీంతో ఈ జిల్లా పరిధిలోని విద్యా సంస్థలకు స్థానిక సెలవులు అధికారులు ప్రకటిస్తుంటారు. అయితే ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సెలవులు ఇస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది. దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మరోవైపు ఈ జాతరకు కేవలం తెలంగాణ నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి పొరుగు రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ క్రమంలో రవాణా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. యేటా ఈ జాతరకు తెలంగాణ సర్కార్ ప్రత్యేక బస్సులు నడుపుతుంది. జాతర సమయంలో బస్సులు, రైళ్లు, రహదారులు భక్తులతో కిక్కిరిసిపోతాయి. దీంతో రవాణా వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పడే అవకాశం ఉంది.

క్రీడా వాయిస్

# మ్యాచ్ ఫిక్సింగ్ కేసులో అరెస్ట్..

## 4 ఏళ్ల జైలు శిక్షతోపాటు 5 ఏళ్ల నిషేధం.. ఎవరంటే..?

లంక ప్రీమియర్ లీగ్‌లో మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు తేలిన తమీమ్ రెహమాన్‌కు నాలుగు సంవత్సరాల జైలు శిక్షతోపాటు ఐదు సంవత్సరాల నిషేధం, 25 మిలియన్ శ్రీలంక రూపాయల జరిమానా కూడా విధించింది. దుబయ్ ఫ్లైట్ ఎక్కేముందు పోలీసులు అరెస్ట్ చేశారు. లంక ప్రీమియర్ లీగ్ మ్యాచ్ ఫిక్సింగ్ కేసులో కీలక తీర్పు వెలువడింది. దంబుల్లా థండర్స్ యజమాని తమీమ్ రెహమాన్‌ను కోర్టు దోషిగా తేల్చింది. అతనికి నాలుగు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. అయితే ఈ శిక్షతోపాటు, అతనిపై ఐదు సంవత్సరాల నిషేధం, 24 మిలియన్ శ్రీలంక రూపాయల జరిమానా కూడా విధించింది. బంగ్లాదేశ్ మూలానికి చెందిన తమీమ్ రెహమాన్ తనపై ఉన్న ఆరోపణలను అంగీకరించాడు.



టోర్నమెంట్ సమయంలో తాను బెట్టింగ్ ఏర్పాటు చేశానని, ఒక ఆటగాడితో ఫిక్సింగ్ గురించి చర్చించానని అతను అంగీకరించాడు.

**దుబాయ్ పారిపోవడానికి ప్రయత్నాలు..**

శ్రీలంక అవినీతి నిరోధక చట్టం కింద తమీమ్ రెహమాన్ దోషిగా నిర్ధారించింది. ఇది 2019లో అమలులోకి వచ్చింది. రెహమాన్ 2024లో అరెస్టు అయ్యాడు. ఈ సంఘటన గురించి ఒక ఆటగాడు ఫిర్యాదు చేయడంతో మొత్తం విషయం వెలుగులోకి వచ్చింది. కొలంబో విమానాశ్రయంలో దుబాయ్‌కు పారిపోవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు రెహమాన్ అరెస్టు చేశారు. అతన్ని అదుపులోకి తీసుకున్నారు. రెహమాన్ బెయిల్‌పై విడుదలయ్యే ముందు చాలా వారాల పాటు జైలులో ఉన్నాడు. ఈ కేసులో దంబుల్లా జట్టు మేనేజర్‌గా ఉన్న పాకిస్తాన్ పౌరుడు ముజీబ్ ఉర్ రెహమాన్‌పై అరెస్ట్ వారెంట్ కూడా జారీ చేశారు. లంక ప్రీమియర్ లీగ్ 2020లో ప్రారంభమైంది. శ్రీలంకలోని ఐదు నగరాల పేర్లతో ఐదు జట్లు ఈ లీగ్‌లో పోటీపడతాయి. 2024 నాటికి టోర్నమెంట్ ఐదు సీజన్లు జరిగాయి. ప్రస్తుత ఛాంపియన్లు జాఫ్నా కింగ్స్, నాలుగుసార్లు గెలిచింది.

### వైజాగ్‌లో

# టాస్ గెలిచిన సూర్య..

## ఇషాన్ కిషన్ ఔట్.. ఎవరొచ్చారంటే?




భారత్ వర్సెస్ న్యూజిలాండ్ జట్ల మధ్య నాల్గవ టీ20ఐ మ్యాచ్ ఈరోజు విశాఖపట్నంలోని డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి **ACA-VDCA** స్టేడియంలో జరుగుతుంది. ఈ క్రమంలో టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. భారతత్ వర్సెస్ న్యూజిలాండ్ జట్ల మధ్య నాల్గవ టీ20ఐ మ్యాచ్ ఈరోజు విశాఖపట్నంలోని డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి **ACA-VDCA** స్టేడియంలో జరుగుతుంది. ఈ క్రమంలో టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. గాయం కారణంగా ఇషాన్ కిషన్ ఆడటం లేదని, అర్షదీప్ సింగ్ తిరిగి వచ్చారని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పేర్కొన్నాడు. ఇంతలో, కైల్ జామిసన్ స్థానంలో జాక్ ఫౌల్కేస్ న్యూజిలాండ్‌కు తిరిగి వచ్చాడు. అంతకుముందు, మూడో టి20ఐలో భారత్ 8 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించి, ఇప్పటికే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను కైవసం చేసుకుంది. న్యూజిలాండ్ ప్రస్తుతం 3–0తో వెనుకబడి ఉంది. వైజాగ్‌లో కూడా భారత్?కు బలమైన రికార్డు ఉంది. ఇక్కడ ఆడిన నాలుగు టి20ఐలలో, టీమ్ ఇండియా మూడింటిలో గెలిచింది, ఆస్ట్రేలియాపై మాత్రమే ఓటమి పాలైంది.

భారత్: అభిషేక్ శర్మ, సంజు శాంసన్(కీపర్), సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), రింకు సింగ్, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, హర్షిత్ రాణా, రవి బిష్ణోయ్, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా.

న్యూజిలాండ్: టిమ్ సీఫెర్ట్(కీపర్), డెవాన్ కాన్వే, రాచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, మార్క్ చాప్మన్, డారిల్ మిచెల్, మిచెల్ సాంట్నర్(కెప్టెన్), జకారీ ఫౌల్క్స్, మాట్ హెన్రీ, ఇష్ సోధి, జాకబ్ డఫీ.

# నైట్ వాచ్‌మ్యాన్ అనుకుంటే డబుల్ సెంచరీ బాదేశాడు..

## టెస్టుల్లో ఇప్పటికీ బద్దలవ్వని వరల్డ్ రికార్డు

టెస్ట్ క్రికెట్‌లో నైట్ వాచ్‌మ్యాన్‌గా ఒక బ్యాట్స్‌మెన్ సెంచరీ కొట్టడం అనేది చాలా అరుదైన సంఘటన. ముఖ్యంగా ఎక్కువ సందర్భాల్లో నైట్ వాచ్‌మ్యాన్‌గా ఒక బౌలర్ బ్యాటింగ్‌కు వస్తూ ఉంటాడు. ఇలాంటి ఆటగాళ్ల నుండి సాధారణంగా ఎక్కువ పరుగులు ఆశించరు. ఆ వివరాలు ఇలా.. టెస్ట్ క్రికెట్‌లో నైట్ వాచ్‌మ్యాన్‌గా వచ్చే బ్యాట్స్‌మెన్ సెంచరీ కొట్టడం చాలా అరుదు. అయితే, ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ జాసన్ గిలెస్పీ 2006లో బంగ్లాదేశ్‌పై నైట్ వాచ్‌మ్యాన్‌గా బ్యాటింగ్‌కు వచ్చి, ఏకంగా 201 పరుగులు చేసి డబుల్ సెంచరీ సాధించాడు. ఈ భారీ స్కోరు ఇప్పటికీ నైట్ వాచ్‌మ్యాన్ చేసిన అత్యధిక వ్యక్తిగత స్కోర్‌గా నమోదై ఉంది. వివరాల్లోకి వెళ్తే.. టెస్ట్ క్రికెట్‌లో నైట్ వాచ్‌మ్యాన్‌గా ఒక బ్యాట్స్‌మెన్ సెంచరీ కొట్టడం అనేది చాలా అరుదైన సంఘటన. ముఖ్యంగా ఎక్కువ సందర్భాల్లో నైట్ వాచ్‌మ్యాన్‌గా ఒక బౌలర్ బ్యాటింగ్‌కు వస్తూ ఉంటాడు. ఇలాంటి ఆటగాళ్ల నుండి సాధారణంగా ఎక్కువ పరుగులు ఆశించరు. అయితే, చరిత్రలో ఒక అద్భుతమైన సంఘటనగా, ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ జాసన్ గిలెస్పీ నైట్ వాచ్‌మ్యాన్‌గా బ్యాటింగ్‌కు వచ్చి ఏకంగా డబుల్ సెంచరీ సాధించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ అసాధారణమైన ఇన్నింగ్స్ 2006వ సంవత్సరంలో బంగ్లాదేశ్‌తో జరిగిన ఒక టెస్ట్ మ్యాచ్‌లో చోటుచేసుకుంది. ఆ మ్యాచ్‌లో నెంబర్ త్రీ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన గిలెస్పీ, ఊహించని విధంగా 201 పరుగుల భారీ స్కోర్‌ను సాధించాడు.



సాధారణంగా బౌలర్‌గా పరిచయం ఉన్న గిలెస్పీ, నైట్ వాచ్‌మ్యాన్‌గా వచ్చి ఇలాంటి చారిత్రాత్మక ఇన్నింగ్స్ ఆడతాడని ఎవరూ ఊహించలేదు. గిలెస్పీ చేసిన ఈ 201 పరుగులు ఇప్పటికీ టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒక నైట్ వాచ్‌మ్యాన్ చేసిన అత్యధిక వ్యక్తిగత స్కోర్‌గా రికార్డుల్లో నిలిచి ఉంది. ఇది క్రికెట్ ప్రపంచంలో ఒక అరుదైన, గుర్తుండిపోయే ఫీట్‌గా నిలిచింది.

# అంత పొగరొద్దు జైస్వాల్..

## ఇకపై ఎంపిక చేయబోమంటూ షాకిచ్చిన సెలెక్టర్లు..




యశస్వి జైస్వాల్ ప్రస్తుత రంజీ ట్రోఫీ సీజన్‌కు దూరం కావడంపై ముంబై క్రికెట్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఫిట్‌నెస్ సమస్యలు లేకపోయినా, జైస్వాల్ తనకిష్టమైన మ్యాచ్‌లను మాత్రమే ఎంచుకుంటూ బోర్డ్ అధికారులకు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఎంసీఏ సెలెక్టర్లు అతడిని ఇకపై ఎంపిక చేయమని తెలిపారు.టీం ఇండియా యువ సంచలనం యశస్వి జైస్వాల్ ప్రస్తుత రంజీ ట్రోఫీ సీజన్‌కు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. అతడి ఫిట్‌నెస్ సమస్యలు లేనప్పటికీ, జైస్వాల్ కేవలం తనకిష్టమైన మ్యాచ్‌లలో మాత్రమే ఆడటానికి ఆసక్తి చూపుతున్నాడని వార్తలు వినిపిస్తున్నాయి. బోర్డ్ అధికారుల సంప్రదింపులకు సరిగ్గా స్పందించడం లేదని ఆరోపణలు వెలువడ్డాయి. ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ), జాతీయ సెలెక్టర్లు జైస్వాల్ లభ్యత గురించి ఆరా తీసినప్పుడు, వారికి సరైన సమాధానం రాకపోవడంతో అతడి వైఖరిపై విమర్శలు తీవ్రమయ్యాయి. అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొందిన తర్వాత దేశవాళీ క్రికెట్ పట్ల జైస్వాల్ చూపుతున్న ఈ ఉదాసీనత సరైన పద్ధతి కాదని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జాతీయ జట్టులో స్థానం సుస్థిరం చేసుకున్న క్రీడాకారులు రంజీ వంటి ప్రతిష్టాత్మక టోర్నీలను విస్మరించడం సరికాదని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, ముంబై క్రికెట్ అసోసియేషన్ సెలెక్టర్లు ఇకపై యశస్వి జైస్వాల్‌ను జట్టులోకి ఎంపిక చేయబోమని స్పష్టంగా ప్రకటించారు. ఈ పరిణామాలతో యశస్వి జైస్వాల్ కెరీర్ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. కింది స్థాయి నుంచి స్టార్ ప్లేయర్ స్థానానికి చేరకున్న జైస్వాల్.. ఇప్పుడు ఇలా చేయడం ఏం బాగోలేదంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. టీమిండియా తరపున టెస్ట్ ల్లో సుస్థిర స్థానం సంపాదించుకోగా, వన్డే, టెస్ట్ ల్లో మాత్రం నిలకడగా రాణించలేకపోతున్నాడు. స్క్వాడ్ లో ఉన్నా ప్లేయింగ్ 11లో మాత్రం నిరాశను ఎదుర్కొంటున్నాడు. రోహిత్, కోహ్లీల రిటైర్మెంట్ తర్వాత వన్డేల్లో స్థానం ఫిక్స్ చేసుకునే అవకాశం ఉంది.

### భారత జట్టులోకి

# మరో ఇద్దరు ఎంట్రీ..

## టీ20 ప్రపంచ కప్‌నకు ముందు బీసీసీఐ మాస్టర్ ప్లాన్..!

టీ20 ప్రపంచ కప్ 2026కు ముందు ఇండియా ఎ జట్టు రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌లు యునైటెడ్ స్టేట్స్, నమీబియాతో జరుగుతాయి. వీటికి సంబంధించి అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. ఈ క్రమంలో ఇద్దరు యంగ్ ప్లేయర్లకు లక్కీ ఛాన్స్ దక్కింది. ఆయుష్ బదోని, ప్రియాంష్ ఆర్యలను ఢిల్లీ రంజీ జట్టు నుంచి విడుదల చేశారు. 2026 టీ20 ప్రపంచ కప్‌నకు ముందు ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడేందుకు వారిని ఇండియా ఎ జట్టుకు ఎంపిక చేశారు. ఇండియా ఎ రెండు జట్లతో వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఆయుష్ బదోని ఇటీవలే భారత వన్డే జట్టులో చేరాడు. కానీ ఆడలేకపోయాడు. వాషింగ్టన్ సుందర్‌ను తొలగించిన తర్వాత అతన్ని ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. బదోని, ప్రియాంష్ గతంలో ఇండియా ఎ జట్టులో ఉన్నారు. ఇద్దరూ లిస్ట్ ఎ మ్యాచ్‌లు ఆడారు. బదోని నాలుగు రోజుల మ్యాచ్‌లు కూడా ఆడారు. ఇప్పుడు, మొదటిసారి ఇండియా ఎతో టీ20 మ్యాచ్ ఆడనున్నారు. టీ20 ప్రపంచ కప్‌నకు ముందు ఇండియా ఎ అమెరికా, నమీబియాతో వార్మప్ మ్యాచ్‌లు ఆడనుందని తెలుస్తోంది. ఈ మ్యాచ్‌లు నవీ ముంబై, బెంగళూరులో జరగవచ్చు. అమెరికాతో మ్యాచ్ ఫిబ్రవరి 2న, ఫిబ్రవరి 6న నమీబియాతో జరగనుంది. గతంలో, భారత జట్టు ఇండియా ఎతో వార్మప్ మ్యాచ్ కూడా ఆడవచ్చని కూడా వార్తలు వచ్చాయి. టీం ఇండియా ఒకే ఒక ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతుందని చెబుతున్నారు. అది ఫిబ్రవరి 4న దక్షిణాఫ్రికాతో జరగవచ్చు.

**ఢిల్లీ జట్టు కెప్టెన్‌గా ఆయుష్ దోసేజా..**

రంజీ ట్రోఫీ చివరి గ్రూప్ దశ మ్యాచ్‌లో బడోనీ, ప్రియాంష్ లేకుండా ఢిల్లీ ముంబైతో తలపడనుంది. ఈ మ్యాచ్ బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో జరుగుతుంది. ఈ మ్యాచ్ కోసం ఢిల్లీ జట్టులో ఒక మార్పు జరిగింది. బదోనీ లేకపోవడంతో ఆయుష్ దోసేజా కెప్టెన్‌గా నియమితులయ్యాడు. ఆరు మ్యాచ్‌ల్లో కేవలం తొమ్మిది పాయింట్లతో ఢిల్లీ క్వార్టర్ ఫైనల్ బెర్త్ రేసులో లేదు. మరోవైపు ముంబై 30 పాయింట్లతో ముందుకు సాగి గ్రూప్ డిలో ఆధిక్యంలో ఉంది.

**ఢిల్లీ రంజీ జట్టు..**

ఆయుష్ దోసెజా (కెప్టెన్), సనత్ సాంగ్వాన్, వైభవ్ కంద్‌పాల్, సుమిత్ మాథుర్, ప్రణవ్ రాజ్‌వంశీ, సిద్ధాంత్ శర్మ, ధ్రువ్ కౌశిక్, రాహుల్ దాగర్, అనుజ్ రావత్, దివిజ్ మెహ్రా, ఆర్యన్ రాణా, మణి గ్రేవాల్, రోహన్ రాణా, రాహుల్ చౌదరి.

# ఉన్నది 3 మ్యాచ్‌లు.. 2 స్థానాల కోసం 4 జట్ల పోరు.. ఆసక్తిగా మారిన ప్లేఆఫ్ రేస్..




ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026లో పదిహేడు లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు ఒక జట్టు మాత్రమే ప్లేఆఫ్‌లకు అర్హత సాధించింది. మరో రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇందుకోసం నాలుగు జట్లు పోటీ పడుతున్నాయి. ఆ వివరాలేంటో ఓసారి చూద్దాం.. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2025లో పదిహేడు మ్యాచ్‌లు జరిగాయి. ఇప్పటివరకు, ప్లేఆఫ్‌కు అర్హత సాధించిన ఏకైక జట్టుగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలిచింది. లీగ్ దశ మ్యాచ్‌లు మూడు మిగిలి ఉన్నాయి. ఇవి మిగిలిన రెండు జట్ల ప్లేఆఫ్ స్థానాలను నిర్ణయిస్తాయి. మిగిలిన రెండు ప్లేఆఫ్ స్థానాల కోసం నాలుగు జట్లు పోటీ పడుతున్నాయి: ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్, యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్. జనవరి 27న ఢిల్లీని ఓడించడం ద్వారా గుజరాత్ తమ ఆశలను సజీవంగా ఉంచుకుంది. తద్వారా నేరుగా ఫైనల్‌కు చేరుకునే అవకాశం ఉంది. డబ్ల్యుపిఎల్‌లో లీగ్ దశ దాటి కేవలం మూడు జట్లు మాత్రమే ముందుకు సాగుతాయి. డబ్ల్యుపిఎల్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. రెండవ, మూడవ స్థానంలో ఉన్న జట్లు రెండవ ఫైనలిస్ట్ కోసం పోటీ పడతాయి. ప్రస్తుతం, ఆర్‌సిబి 10 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ఎనిమిది పాయింట్లతో గుజరాత్ రెండవ స్థానంలో ఉంది. ముంబై, ఢిల్లీ ఆరు పాయింట్లతో తరువాతి స్థానాల్లో ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ నాలుగు పాయింట్లతో అట్టడుగున ఉంది. కానీ రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి.

**యుపి వారియర్స్ అవకాశాలు..**

డబ్ల్యుపిఎల్ 2026 మ్యాచ్‌లలో జనవరి 29న బెంగళూరు **vs** యూపీ, జనవరి 30న గుజరాత్ **vs** ముంబై, ఫిబ్రవరి 1న ఢిల్లీ **vs** యూపీ మ్యాచ్‌లు ఉన్నాయి. ముందుకు సాగాలంటే ఖూ మిగిలిన రెండు మ్యాచ్‌లలో గెలవాల్సి ఉంటుంది. ఒక్క ఓటమి కూడా ప్లేఆఫ్ రేసు నుంచి తప్పించవచ్చు.

**గుజరాత్ జెయింట్స్ అవకాశాలు..**

గుజరాత్ తమ చివరి మ్యాచ్‌లో గెలిస్తే ప్లేఆఫ్‌కు చేరుకుంటుంది. యూపీ ఢిల్లీని ఓడించి ఆర్‌సిబి చేతిలో ఓడిపోయినా, గుజరాత్ ఇప్పటికీ ప్లేఆఫ్‌కు అర్హత సాధిస్తుంది. ఈ జట్టు ఫైనల్‌కు చేరుకోవడానికి పెద్ద విజయం, ఆర్‌సిబికి పెద్ద ఓటమి అవసరం.

**ఢిల్లీ క్యాపిటల్స్ అవకాశాలు..**

ఢిల్లీ జట్టు చివరి మ్యాచ్ యూపీతో ఆడుతుంది. ముందుకు సాగాలంటే తప్పక గెలవాల్సిందే. ముంబై లేదా గుజరాత్ ఓడిపోవడం కూడా ఢిల్లీకి అవసరం. యూపీ చేతిలో ఓడిపోయినా ముందుకు సాగవచ్చు. గుజరాత్ ముంబైని గణనీయమైన తేడాతో ఓడించాలి. అలాగే, ఆర్‌సీబీ యూపీని ఓడించాలి. అప్పుడే ఢిల్లీ నెట్ రన్ రేట్ ఆధారంగా ముందుకు సాగగలదు.

**ముంబై ఇండియన్స్ అవకాశాలు..**

ముంబై ఇండియన్స్ ప్రస్తుతం ఆరు పాయింట్లతో ఉంది. చివరి మ్యాచ్ గుజరాత్‌తో ఉంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే ముందుకు వెళ్లే ఛాన్స్ ఉంటుంది. ఒకవేళ ఓడిపోతే, ఢిల్లీ జట్టు యూపీ చేతిలో ఓడిపోవాలి, అలాగే బెంగళూరు, యూపీ చేతిలో ఓడిపోవాలని కోరుకోవాలి.

సినీ వాయిస్ CINEMA

## పెట్టింది రూ. 20కోట్లు..
# వచ్చింది రూ. 182 కోట్లు..!



ఓటీటీ ప్లాట్ ఫామ్స్‌లలో కొన్నాళ్లుగా హారర్ కంటెంట్ చిత్రాలు అధికంగా స్ట్రీమింగ్ అవుతున్నాయి. మర్డర్ మిస్టరీ, సస్పెన్స్ థ్రిల్లర్ మూవీస్, ఆసక్తిని రేకెత్తించే వెబ్ సిరీస్ నిత్యం సినీప్రియులను ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా హారర్ జోనర్‌కు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. ఎన్ని రకాల సినిమాలు వచ్చినా.. హారర్ సినిమాలకు మాత్రం సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. ఆడియన్స్ లో చాలా మంది దెయ్యాల సినిమాలు చూడటానికి ఇష్టపడుతూ ఉంటారు. ఎలాంటి హారర్ సినిమాలు వచ్చిన వదిలిపెట్టకుండా చూస్తుంటారు. ఇక కొంతమంది భయమేసిన కళ్లు మూసుకుంటునైనా సినిమాను చూస్తూ ఉంటారు. ఓటీటీలో భయపెట్టే సినిమాలు చాలానే ఉన్నాయి. హాలీవుడ్ ను మించి హారర్ సినిమాలు మన దగ్గర చాలానే ఉన్నాయి. హారర్ కామెడీ సినిమాలు కొన్నున్నాయి. అలాగే కంపీల్ట్ హారర్ మూవీస్ కూడా ఉన్నాయి. ఓటీటీల్లో హారర్ సినిమాలు చూసేవారి సంఖ్య కూడా ఎక్కువే. అందులోనూ దెయ్యం కాన్సెప్ట్‌తో వచ్చే స్టోరీలు అయితే.. మూవీ లవర్స్ తెగ ఎంజాయ్ చేస్తారు. మరి దెయ్యంతో పాటు కొంచెం థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటే.. అలాంటి సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ ఒకటి ఇప్పుడు చెప్పబోతున్నాం. ఈ హారర్ థ్రిల్లర్ మూవీ అసలేంటి. ఏ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుందో ఇప్పుడు చూద్దాం..! ఆ సినిమా ఏదో కాదు బాలీవుడ్ లో తెరకెక్కిన స్త్రీ. శ్రాద్ధకపూర్, రాజ్ కుమార్ రావ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా ఎంత పెద్ద హిట్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చిన్న సినిమాగా వచ్చిన ఈ మూవీ బాలీవుడ్ లో నయా రికార్డ్ క్రియేట్ చేసింది. కలెక్షన్స్ కుమ్మేసింది. ఈ సినిమాకు అమర్ కౌశిక్ దర్శకత్వం వహించారు. కామెడీ హారర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సినిమా ఓ వైపు నవ్విస్తూనే మరోవైపు.. భయపెడుతుంది. ఈ సినిమాలోని హారర్ సీన్స్ భయంతో వణికిపోయేలా చేస్తాయి. స్త్రీ సినిమా ప్రపంచ వ్యాప్తంగా రూ.182 కోట్ల వసూళ్లు వచ్చాయి. గత ఏడాది ఈ సినిమాకు సీక్వెల్ కూడా వచ్చింది. స్త్రీ 2 సినిమా కూడా ఘనవిజయం సాధించింది. ఆ సినిమా ఏకంగా రూ. 800కోట్లు కలెక్షన్లు సాధించి నయా రికార్డ్ క్రియేట్ చేసింది. కాగా స్త్రీ సినిమా ఇప్పుడు యూట్యూబ్ లో అందుబాటులో ఉంది. సినిమా వచ్చి 8 ఏళ్ళు అవుతున్నా ఇప్పటికీ ట్రెండింగ్ లో ఉంది ఈ మూవీ. అస్సలు మిస్ అవ్వకుండా చూసేయండి.








# 'పెద్ది' ప్లేస్ లో 'విశ్వంభర'
## ఇంతకంటే మంచి డేట్ ఉందా?

ప్రస్తుతం మన టాలీవుడ్ లో పలు బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ ల తాలూకా రిలీజ్ డేట్ లు ఎలా మారుతున్నాయో చూస్తూనే ఉన్నాం. ఎప్పుడో అనౌన్స్ చేసిన ఈ సినిమాలు కూడా ఇప్పుడు ఆన్ టైం వచ్చే పరిస్థితులు లేవు. ఇందులో మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా ఇప్పుడు నటిస్తున్న చిత్రం పెద్ది కూడా ఒకటి. ఈ సినిమా మార్చ్ నుంచి మే, ఇప్పుడు మే నుంచి దసరా సీజన్ అంటూ పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఒకవేళ ఈ సినిమా మే నెల నుంచి కూడా తప్పుకుంటే మాత్రం ఆ టైం లో మెగాస్టార్ 'విశ్వంభర'కి మంచి స్కోప్ ఉండొచ్చు. పైగా మే నెలలోనే మెగాస్టార్ నుంచి పలు భారీ హిట్ చిత్రాలు కూడా ఉన్నాయి. సో సెంటిమెంట్ ప్రకారం కూడా విశ్వంభర మే నెల రిలీజ్ కి పాజిటివ్ అయ్యే ఛాన్స్ ఉంది. కానీ ప్రస్తుతం ఈ సినిమా వి ఎఫ్ ఎక్స్ అవుట్ పుట్ పైనే అందరి కళ్ళు ఉన్నాయి. మేకర్స్ అయ్యితే ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా బెస్ట్ క్వాలిటీ అందించే పనిలో ఉన్నారు. సో విశ్వంభర మే రిలీజ్‌ని ఆక్యుపై చేస్తుందా లేదా అనేది వేచి చూడాల్సిందే.

# జోనర్ మారుస్తున్న 'హిట్' డైరెక్టర్..






టాలీవుడ్‌లో హిట్ ఫ్రాంచైజీ చిత్రాలతో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు దర్శకుడు శైలేష్ కొలను. పూర్తి క్రైమ్ అండ్ థ్రిల్లర్ సబ్జెక్టులను తనదైన రీతిలో ఎంగేజింగ్‌గా మిలిచి బాక్సాఫీస్ దగ్గర సాలిడ్ హిట్స్ అందుకున్నాడు. ఇక 'హిట్-3' చిత్రంతో బాక్సాఫీస్ దగ్గర బ్లాక్‌బస్టర్ హిట్‌ను చూశాడు ఈ డైరెక్టర్. అయితే, బ్యాక్ టు బ్యాక్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రాలను రూపొందించిన ఈ డైరెక్టర్ ఇప్పుడు తన రూటు మార్చేందుకు నిర్ణయించుకున్నాడు. తన నెక్స్ట్ చిత్రం కోసం తన జోనర్ మార్చుతున్నట్లు ఆయన హింట్ ఇచ్చాడు. ఇక తాను రొమాంటిక్ కథను ప్రేక్షకులకు వివరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపాడు. దీంతో శైలేష్ కొలను ఒక్కసారిగా క్రైమ్ థ్రిల్లర్ జోనర్ వదిలి ఎలాంటి ప్రేమకథను వినిపిస్తాడా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇక తన నెక్స్ట్ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించేందుకు ఈ క్రేజీ డైరెక్టర్ రెడీ అవుతున్నాడు.

# శృతి హాసన్ ఇంకా వివాహం చేసుకోకపోవడానికి కారణం ఇదేనా?

అందాల ముద్దుగుమ్మ శృతి హాసన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ బ్యూటీ జనవరి 28,1986లో జన్మించింది. నేడు ఈ బ్యూటీ బర్త్ డే. 39 నుంచి 40వ వసంతంలోకి అడుగు పెడుతుంది. ఈ క్రమంలోనే ఈ ముద్దుగుమ్మకు సంబంధించిన అనేక వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. శృతి హాసన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ అమ్మడు అనగనగా ఒక రాజు సినిమాతో తెలుగు వెండితెర పైకి అడుగు పెట్టి మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. మొదట్లో ఈ ముద్దుగుమ్మ చేసిన సినిమాలన్నీ డిజాస్టర్ అవ్వడంతో ఐరన్ లెగ్ అంటూ అనేక వార్తలు వచ్చాయి. కానీ గబ్బర్ సింగ్ మూవీ ఈ చిన్నదాని కెరీర్‌ను మలుపు తిప్పిందనే చెప్పాలి. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన గబ్బర్ సింగ్ మూవీలో నటించి మొదటి సారి బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ మూవీ తర్వాత వరసగా హిట్స్ అందుకుంటూ.. లక్కీ హీరోయిన్‌గా మారిపోయింది. అంతేకాకుండా టాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా కొన్ని రోజుల పాటు తన హవా కొనసాగించింది. ఇక ప్రస్తుతం ఈ బ్యూటీకి ఎక్కువగా అవకాశాలు రావడం లేదు. వచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకొని, తన నటనతో అభిమానులను ఆకట్టుకుంటుంది. ఇక సినిమాల పరంగా ఎలా ఉన్నా, ఈ బ్యూటీ నిత్యం వార్తల్లో నిలుస్తూ ఉండేది. ముఖ్యంగా ఈ బ్యూటీ లవ్ ట్రాక్స్ చాలానే ఉన్నాయని చెప్పాలి. చివరగా 2021లో శంతను హజారికాతో డేటింగ్ చేస్తున్నట్లు తానే స్వయంగా చెప్పింది. దీంతో వీరు త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారంటూ అనేక వార్తలు సోషల్ మీడియాలో చక్కెర్లు కొట్టాయి. కానీ చివరకు వారు బ్రేకప్ చెప్పుకొని వారి వారి కెరీర్ పై ఫోకస్ పెట్టారు. ఇక దీని తర్వాత శృతి హాసన్ ఎప్పుడూ ప్రేమ, పెళ్లి గురించి మాట్లాడలేదు. అయితే ఆమె బర్త్ డే సందర్భంగా శృతి హాసన్ గతంలో పెళ్లిపై చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాను గతంలో తనకు పెళ్లి అనే వ్యవస్థపై నమ్మకం లేదు అని వ్యక్తిగత స్వేచ్ఛ కోరుకుంటాను, వివాహం చేసుకోవడం భయం, ఒంటరిగా ఉండటమే చాలా ఇష్టం అని తెలిపింది. దీంతో ఈ బ్యూటీ ఇంకా పెళ్లి చేసుకోకపోవడానికి కారణం ఇదేనేమో అంటూ గతంలో ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.



విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com